www.trinetnews.com
# త్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక

సంపుటి 01 సంచిక 85 ఎడిటర్ :వెంకటేశ్వర్లు రాపోలు బుధవారం అక్టోబర్ 28, 2026 పేజీలు:12 వెల.10/-

## తీరాన్ని తాకిన అర్నబ్ తుపాను.. ప్రారంభమైన ల్యాండ్ ఫాల్ ప్రక్రియ

కాకినాడ: అర్నబ్ అతి తీవ్ర తుపాను తీరాన్ని తాకింది. యానాం వద్ద తుపాను ల్యాండ్ ఫాల్ ప్రక్రియ ప్రారంభమైంది. తుపాను తీరాన్ని తాకినట్లుగా అధికారులు సీఎం చంద్రబాబుకు వివరించారు. తీవ్ర తుపాను గమనంపై ఎప్పటికప్పుడు అధికారుల నుంచి సీఎం చంద్రబాబు వివరాలు తెలుసుకుంటున్నారు. అధికారులకు తగిన సూచనలు చేస్తున్నారు. బుధవారం తెల్లవారుజామున 4 గంటల వరకు ల్యాండ్ ఫాల్ ప్రక్రియ పూర్తి అవుతుందని అధికారులు వివరించారు.



## ఇన్నేళ్లు నా కథ వాళ్లే చెప్పారు..
# ఇక నా వంతు

- తన గురించి వచ్చిన వార్తల్లో చాలావరకు అవాస్తవాలేనన్న సోనియా.
- ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్'తో వాస్తవాలు వెల్లడిస్తానని ప్రకటన.
- దశాబ్దాలుగా ఇతరులే తన కథ చెప్పారని వ్యాఖ్య.
- రాజీవ్ గాంధీ ప్రధాని కావడాన్ని తాను వ్యతిరేకించానని వెల్లడి.
- పుస్తకం విడుదల తర్వాత తనపై అభిప్రాయాలు మారవచ్చని వ్యాఖ్య.

తన భర్త రాజీవ్ గాంధీ ప్రధానమంత్రి కావడాన్ని పూర్తిగా వ్యతిరేకించానని కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ తెలిపారు. తన ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్'కు సంబంధించి సోషల్ మీడియాలో మరో వీడియో పోస్టు చేశారు. దశాబ్దాలుగా తన గురించి ఇతరులు అనేక విషయాలు చెప్పేవారని, ఇప్పుడు తన వంతు వచ్చిందన్నారు. ఈ పుస్తకం విడుదలైన తర్వాత కొన్ని నాటకీయ పరిణామాలు జరగడం ఖాయమన్నారు.

"నా గురించి అనేక వార్తలు వచ్చాయి. కానీ, వాటిలో చాలా వరకు అవాస్తవాలు, కల్పితాలే. మరికొన్ని అతిశయోక్తిగా అనిపించాయి. అందుకే స్వయంగా వాస్తవాలను చెప్పాలనుకున్నా. ఇది నా కథ. ప్రజలకు నా గురించి అనేక అభిప్రాయాలున్నాయి. దీని తర్వాత కొంతమంది నాపై అభిప్రాయాన్ని మార్చుకోవచ్చు. మరికొందరు మరింత దిగజారవచ్చు. ప్రజా జీవితంలో ఉన్నప్పుడు లేదా ఏదైనా పుస్తకం రాసినప్పుడు ఇలాంటివి సాధారణమే" అని సోనియా పేర్కొన్నారు. తాను ఎదుర్కొన్న సంఘటనల గురించి వాస్తవాలను తెలియజెప్పేందుకు తనకు ఇదో అవకాశంగా భావిస్తున్నట్లు తెలిపారు.



## ఔషధ ధరలపై
## సుప్రీంకోర్టు ఆగ్రహం!

- మందుల ఎంఆర్‌పీ, రిటైల్ ధరల మధ్య భారీ వ్యత్యాసంపై ప్రశ్నలు.
- ఫార్మా కంపెనీలకు అనుకూలంగా వ్యవస్థ పనిచేస్తోందా? అని నిలదీత.
- ఎన్‌పీపీఏ పనితీరుపై కీలక వ్యాఖ్యలు.
- ప్రభుత్వం కళ్లముందే ధరల వ్యత్యాసం జరుగుతోందని వ్యాఖ్య.
- మందుల ధరలపై కేంద్రం వాదనలు విన్న ధర్మాసనం.
- రెండు పిటిషన్లపై తీర్పు రిజర్వ్ చేసిన సుప్రీంకోర్టు.

ఔషధాల ఎంఆర్‌పీకి, రిటైలర్లకు విక్రయించే ధరకు మధ్య ఉన్న భారీ వ్యత్యాసంపై కేంద్రాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. "మొత్తం వ్యవస్థ ఫార్మాస్యూటికల్ తయారీదారులకు సాయపడేలా ఎందుకు పనిచేస్తోంది?" అని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం నిలదీసింది. అయితే.. ఫార్మా రంగానికి సంబంధించిన మొత్తం వ్యవస్థను నియంత్రించకూడదనేది ప్రభుత్వ విధానమని సర్వోన్నత న్యాయస్థానానికి కేంద్రం తెలిపింది.

'రామ్‌హిత్'పై నోరు జారి.. క్షమాపణలు చెప్పిన యూపీ ఎన్నికల అధికారి
దేశంలో ఔషధాల ధరలపై దాఖలైన రెండు పిటిషన్లను సుప్రీంకోర్టు ధర్మాసనం విచారించింది. 'నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ' పూర్తిగా నిరుపయోగమైన సంస్థగా కనిపిస్తోందని వ్యాఖ్యానించింది. ఎంఆర్‌పీకి, రిటైలర్ ధరకు మధ్య ఉన్న భారీ తేడాను ప్రస్తావిస్తూ.. "ప్రభుత్వమే దీనికి అనుమతిస్తోంది. దాని కళ్లముందే ఇదంతా జరుగుతోంది. దీన్ని ఇలాగే అదుపు లేకుండా సాగిపోనివ్వాలా?" అని ప్రశ్నించింది. కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటీ వాదనలు వినిపిస్తూ.. భారత్‌లో మందుల ధరలు ప్రపంచంలోనే అత్యంత తక్కువగా ఉన్నాయని కోర్టుకు తెలిపారు. అనంతరం ధర్మాసనం ఈ వ్యవహారంపై తీర్పును రిజర్వ్ చేసింది.



## రూ.2.50 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన సీఐ

హైదరాబాద్:
మీర్‌చౌక్ పీఎస్ పరిధిలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. సీఐ కొండలరావు ఓ కేసుకు సంబంధించి రూ. 2.50 లక్షలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కొండలరావును అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.


2లో..

## ప్రభుత్వ ఉద్యోగం పేరుతో మహిళపై లైంగిక దాడి!

- రూ.5 లక్షలకు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలుకు.
- రూ.4.5 లక్షలు తీసుకుని రిసార్ట్‌కు తరలింపు.
- అవుషాపూర్‌లోని రిసార్ట్‌లో మహిళపై లైంగిక దాడి.
- అనంతరం దాడి చేసి రోడ్డుపై వదిలేసిన నిందితుడు.

## కేటీఆర్ పాస్‌పోర్టుపై
## ఏసీబీ వైఖరేంటి?


2లో

- » ఫార్ములా ఈ రేస్ కేసులో కీలక పరిణామం.
- » పాస్‌పోర్టు విషయంలో వైఖరి చెప్పాలని ఏసీబీకి హైకోర్టు ఆదేశం.
- » పాస్‌పోర్టు జప్తుపై ఆర్‌పీవో షోకాజ్ నోటీసును సవాల్ చేసిన కేటీఆర్.
- » పాస్‌పోర్టు అధికారుల చర్యలు చట్టవిరుద్ధమంటూ పిటిషన్.
- » తదుపరి విచారణ నవంబర్ 6కు వాయిదా.

హైదరాబాద్:
ఫార్ములా ఈ రేస్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేటీఆర్ పాస్‌పోర్ట్ విషయంలో వైఖరేంటో చెప్పాలని ఏసీబీకి తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న కేటీఆర్ హైకోర్టును ఆశ్రయించారు. ఫార్ములా ఈ రేస్ కేసులో రీజనల్ పాస్ పోర్ట్ ఆఫీస్ నుంచి కేటీఆర్ కు నోటీస్ అందింది.

## ఉప్పల్‌లో భారీ చోరీ..
## 48 తులాల బంగారం మాయం!

- న్యూ భరత్‌నగర్‌లో దొంగల చేతివాటం.
- ఇంటికి తాళం వేసి కొమురవెల్లికి వెళ్లిన దంపతులు.
- 48 తులాల బంగారం, 1.5 కిలోల వెండి అపహరణ.
- రూ.3.5 లక్షల నగదు కూడా చోరీ.
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన ఉప్పల్ పోలీసులు.


2లో..

## దీపావళికి ముందే రైతులకు రూ.5 వేల సాయం!


2లో..

- మహారాష్ట్రలో 304 కరవు మండలాల రైతులకు ఆర్థిక సాయం.
- దాదాపు 1.5 కోట్ల మంది రైతులకు లబ్ధి.
- ఒక్కో రైతు ఖాతాలో రూ.5,000 జమ.
- 33 శాతానికి పైగా పంట నష్టపోయిన రైతులకు అర్హత.
- సాయం కోసం రూ.7,500 కోట్ల నిధులు కేటాయింపు.
- ఈ వారంలోనే నగదు జమ చేయాలని సీఎం ఫడణవీస్ ఆదేశాలు.

## 'ఇయర్‌ఫోన్లు' కాదు..
## ప్రమాద ఘంటికలు!

- రైల్వే ట్రాక్‌ల వద్ద ఇయర్‌ఫోన్లతో ప్రాణాలకు ముప్పు.
- వాహనాలు నడిపేటప్పుడు ఇయర్‌ఫోన్లతో ప్రమాదాలు.
- పరిసరాలపై అవగాహన లేకుంటే పెను ప్రమాదం.
- ఒక్క ఫోన్ కాల్ కోసం నిండు జీవితం ప్రమాదంలోకి నెట్టొద్దు.
- కుటుంబం కోసం క్షణం ఆలోచించండి.. జాగ్రత్తగా ఉండండి: సజ్జనార్.


మిగతాది 2లో

## హైదరాబాద్ లో క్యూర్ పరిధిలో ఇల్లు కట్టుకునే ప్లాన్ లో ఉన్నారా..? ఓసారి ఇది చూడండి..!


2లో..



## ఎల్‌నినో ఎఫెక్ట్..
## తెలంగాణలో కరవు కాటకం!

- రాష్ట్రవ్యాప్తంగా 31 జిల్లాల్లో 365 కరవు మండలాల ప్రకటన.
- 111 మండలాల్లో తీవ్ర కరవు.. 254 మండలాల్లో మోస్తరు ప్రభావం.
- సాధారణ వర్షపాతం 740.6 మి.మీ. కాగా.. కురిసింది 615.5 మి.మీ. మాత్రమే.
- నైరుతి రుతుపవనాలపై ఎల్‌నినో ప్రభావం.
- వర్షపాతం, భూగర్భ జలాలు, పంటల పరిస్థితుల ఆధారంగా గుర్తింపు.
- కరవు మండలాలపై ప్రభుత్వం ఉత్తర్వులు జారీ.

2లో

హైదరాబాద్:
ఎల్‌నినో ప్రభావంతో నెలకొన్న కరవు మండలాలను ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా 31 జిల్లాల్లోని 365 మండలాల్లో కరవు పరిస్థితులు ఉన్నట్లు వెల్లడించింది. రాష్ట్రంలో 111 మండలాల్లో తీవ్రంగా.. మరో 254 మండలాల్లో మోస్తరుగా ప్రభావం ఉందని వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు, క్షేత్రస్థాయి పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని కలెక్టర్లు పంపిన ప్రతిపాదనలపై ఈనెల 23న మంత్రివర్గ ఉపసంఘం చర్చించింది.

ట్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక
బుధవారం అక్టోబర్ 28, 2026
www.trinetnews.com

# ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానంటూ మహిళపై లైంగిక దాడి

మొదటిపేజీ తరువాయి
మున్సిపల్ కార్యాలయంలో ఉద్యోగం ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి ఓ వివాహితను రిసార్ట్స్‌లోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడిన సంఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో సోమవారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ పి.కిరణ్ తెలిపిన మేరకు.. మల్లాపూర్‌కు చెందిన ఓ మహిళ (30) భర్తతో విడిపోయి టైలరింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తోంది. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరికి చెందిన జగన్‌మోహన్ మోత్కూరు మున్సిపాలిటీలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు.

ఇతడితో మహిళకు 4 నెలల క్రితం ఫోన్ ద్వారా పరిచయం ఏర్పడింది. తాను భువనగిరి మేనేజర్‌గా పని చేస్తానని, రూ.5 లక్షలు ఇస్తే మున్సిపల్ ఆఫీసులో ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికాడు. దీంతో ఆమె సోమవారం రూ.4.5 లక్షలు సిద్ధం చేసుకోగా, జగన్‌మోహన్ కారులో వెళ్లి మల్లాపూర్‌లో ఎక్కించుకుని భువనగిరికి బయలుదేరారు. ప్రయాణించే సమయంలోనే డబ్బు తీసుకొని కారులో భద్రపరుచుకున్నాడు. భువనగిరికి వెళ్లకుండా ఎదులాబాద్ డివిజన్ అవుషాపూర్ వద్ద శ్రీనిధి రిసార్ట్స్‌లోకి కారును మళ్లించగా బాధితురాలు అనుమానంతో ప్రశ్నించింది.

డబ్బులు తీసుకునే అధికారి రిసార్ట్స్‌లో ఉన్నాడని బదులిచ్చాడు. లోపలికి వెళ్లిన అనంతరం రిసార్ట్స్‌లోని ఓ గదిలోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. అధికారిని కలుద్దామని ఆమె కోరడంతో కారులో ఎక్కించుకుని ఆమె ముఖంపై చేతులతో దాడి చేసి బయటకు తోసేసి వెళ్లిపోయాడు. బాధితురాలు 100కు డయల్ చేయగా ఘట్‌కేసర్ పోలీసులు వచ్చి భరోసా కేంద్రానికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు జగన్‌మోహన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# హైదరాబాద్ లో క్యూర్ పరిధిలో ఇల్లు కట్టుకునే ప్లాన్ లో ఉన్నారా..? ఓసారి ఇది చూడండి..!

మొదటిపేజీ తరువాయి
గ్రేటర్ హైదరాబాద్, క్యూర్ పరిధిలో కొత్తగా ఇల్లు కట్టుకోవాలని అనుకునే మధ్యతరగతి జనానికి ప్రభుత్వ నిబంధనలు శాపంగా మారుతున్నాయి. గ్రేటర్, క్యూర్ పరిధిలో వంద గజాల స్థలంలో ఇల్లు కట్టుకోవాలంటే... ప్లాట్ వెడల్పు కనీసం 20 అడుగులు తప్పనిసరిగా ఉండాలని నిబంధన చిక్కులు తెచ్చిపెడుతోంది. ప్రభుత్వ ఆన్‌లైన్ పోర్టల్ 'బిల్డ్‌నౌ' లో పెట్టిన నిబంధనల కొర్రీల వల్ల కొత్తగా ఇల్లు కట్టుకోవాలని అనుకునేవారు ఇబ్బందులు పడుతున్నారు.

అయితే..సిటీ శివార్లలో చాలా అన్ అప్రూవ్డ్ లేఅవుట్లలో ప్లాట్ల వెడల్పు 12 నుంచి 25 అడుగుల లోపే ఉంటోందని... ఘట్ కేసర్ లాంటి ఏరియాల్లో 15 అడుగుల వెడల్పు, 50 అడుగుల పొడవుతో సేల్ డీడ్ రిజిస్ట్రేషన్లు ఉన్నప్పటికీ.. బిల్డ్ నౌలో ఉన్న కనీసం 20 అడుగుల నిబంధన కారణంగా అప్లికేషన్లు రిజెక్ట్ అవుతున్నాయి. దీంతో పర్మిషన్ లేకపోవడంతో బ్యాంకులు హోమ్ లోన్స్ కూడా ఇవ్వడం ఆపేశాయని అంటున్నారు.

**అర్బన్ లో ఒక రూల్.. రూరల్ లో ఒక రూల్**
భావన నిర్మాణ అనుమతులకు సంబంధించి అర్బన్ లో ఒకలా, రురల్ లో ఒకలా రూల్స్ ఉండటం గమనార్హం. గ్రేటర్ పరిధిలో వంద గజాల స్థలంలో కనీసం 20 అడుగుల వెరీజియన్ లో 18 అడుగుల వెడల్పు ఉన్నా అనుమతిస్తున్నారు. రూరల్ అగ్రి రీజియన్ లో అయితే.. 18 అడుగుల వెడల్పుతో లేఅవుట్లకు అనుమతి లభిస్తుంది.
2012లో ఉమ్మడి రాష్ట్రంలో తెచ్చిన జీవో 168నే చిన్న సవరణలతో కొనసాగిస్తుండగా.. ప్రస్తుతం ప్రభుత్వం యూనిఫైడ్ డెవలప్మెంట్ బిల్డింగ్ కోడ్ తీసుకురావడానికి సన్నాహాలు చేస్తోంది. ఈమేరకు బాధ్యతలు ఎవీణాకు అప్పగించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో కొత్త బిల్డింగ్ కోడ్ లో చిన్న ప్లాట్ల వెడల్పు రూల్ 20అడుగుల నుంచి కనీసం 15 అడుగులకు తగ్గించాలని డిమాండ్ చేస్తున్నారు రియల్టర్లు.

# మోకాళ్ల నొప్పితో ఆఫీస్ బయట కూర్చుంది.. కలెక్టర్ అని తెలియక బాధలన్నీ చెప్పుకుంది!

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ మహమ్మద్ అబ్దుల్ అజీమ్ పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని ముగించుకుని మధ్యాహ్నం 12 గంటల సమయంలో కార్యాలయానికి తిరిగి వచ్చారు. కారు దిగి కార్యాలయంలోకి వెళ్తుండగా మెట్లపై ఓ వృద్ధురాలు కూర్చొని ఉండటం ఆయన కంటపడింది. ఆమెను చూసిన కలెక్టర్ అక్కడే ఆగి, ఆమె సమస్య ఏమిటో తెలుసుకోవాలని ప్రయత్నించారు. ఆ సమయంలో పట్టణ ప్రగతి కార్యక్రమంలో పాల్గొనేందుకు కార్యాలయ సిబ్బంది వెళ్లడంతో కార్యాలయం దాదాపు ఖాళీగా ఉంది. కలెక్టర్ తన వద్దకు వస్తున్నా ఆ వృద్ధురాలు తన సమస్యను చెప్పేందుకు ముందుకు రాలేదు. ఆయన కూడా ఆమె పరిస్థితిని గమనించి పలకరించారు. 'అవ్వా.. ఎందుకు వచ్చావు? నీకు ఏం కావాలి?' అని కలెక్టర్ ఆప్యాయంగా అడిగారు. దీంతో ఆ వృద్ధురాలు తన మనసులోని బాధను బయటపెట్టింది. 'బిడ్డా.. నా సమస్య చెబితే పరిష్కరిస్తావా?' అని అడిగింది. ఆమె మాటల్లోని ఆవేదనను అర్థం చేసుకున్న కలెక్టర్.. 'లోపలికి రా అవ్వా.. కూర్చొని మాట్లాడుకుందాం' అంటూ ఆమెను ఆప్యాయంగా ఆహ్వానించారు.

### రెండేళ్లుగా అందని పింఛన్.. ఆరు నెలలుగా కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు!

ఆ వృద్ధురాలి పేరు బంగమ్మ. ఆమె వయస్సు 70 సంవత్సరాలు. మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న ఆమె రెండేళ్లుగా పింఛన్ అందక ఇబ్బందులు పడుతోంది. తనకు రావాల్సిన పింఛన్ కోసం గత ఆరు నెలలుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకపోయింది. 'బిడ్డా.. నాకు మోకాళ్ల నొప్పులు ఉన్నాయి. పింఛన్ కోసం ఆరు నెలలుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాను. అధికారులను అడిగితే రేపు రమ్మంటారు.. ఎల్లుండి రమ్మంటారు. కానీ నా సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు' అంటూ బంగమ్మ తన ఆవేదనను వ్యక్తం చేసింది. మండల కార్యాలయంలో అడిగిన ప్రతిసారీ ఒక్కొక్కరు ఒక్కో కారణం చెబుతున్నారని, తన ఆధార్ కార్డు, ఇతర పత్రాల జిరాక్స్ కాపీలు తీసుకుంటున్నా పింఛన్ మాత్రం మంజూరు చేయడం లేదని వాపోయింది. రాజకీయ నాయకులు సైతం ఎన్నో హామీలు ఇచ్చారని, అయినా తనకు న్యాయం జరగలేదని తెలిపింది. ఆమె బాధను విన్న కలెక్టర్ చలించిపోయారు. మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న వృద్ధురాలి పక్కనే కూర్చొని, ఆమె చేతులు పట్టుకుని ధైర్యం చెప్పారు. 'అవ్వా.. నువ్వేమీ బాధపడకు. నీ సమస్యను ఇప్పుడే పరిష్కరిస్తాం. ఇకపై ఎవరి చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. నేను ఉన్నాను' అంటూ భరోసా ఇచ్చారు.

### నేనే కలెక్టర్‌ను.. నీ సమస్య పరిష్కరిస్తాను!

కలెక్టర్ తన సమస్యను పరిష్కరిస్తానని చెప్పడంతో బంగమ్మకు కొంత ధైర్యం వచ్చింది. అయినప్పటికీ, ఇన్నాళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరిగినా తనకు న్యాయం జరగకపోవడంతో ఆమెకు అనుమానం కలిగింది. 'నిజంగానే నా సమస్య పరిష్కరిస్తావా బిడ్డా?' అని ఆప్యాయంగా అడిగింది. అప్పుడు కలెక్టర్.. 'నిజంగానే పరిష్కరిస్తాను అవ్వా. నేనే కలెక్టర్‌ను. నీ సమస్యను పరిష్కరించగలను. నువ్వు భయపడాల్సిన అవసరం లేదు' అని చెప్పారు. తన ముందు కూర్చొని ఆప్యాయంగా మాట్లాడుతున్న వ్యక్తి జిల్లా కలెక్టర్ అని తెలుసుకున్న బంగమ్మ కళ్లలో ఆనందభాష్పాలు తిరిగాయి. ఇన్నాళ్లుగా తన బాధను పట్టించుకునే వారు లేకపోవడంతో, ఉన్నతాధికారే తన పక్కన కూర్చొని సమస్యను వింటుండటంతో ఆమె భావోద్వేగానికి గురైంది. అనంతరం కలెక్టర్ ఆమె ఆధార్ కార్డును పరిశీలించి వయస్సు 70 సంవత్సరాలుగా నిర్ధారించుకున్నారు. వెంటనే డీఆర్‌డీవో పీడీ సుమతితో ఫోన్‌లో మాట్లాడారు. 'బంగమ్మ అనే వృద్ధురాలు నా దగ్గరకు వచ్చింది. ఇంతకాలంగా ఆమెకు పింఛన్ ఎందుకు మంజూరు చేయలేదు? ఆమె సమస్యను ఎందుకు పరిష్కరించలేదు?' అంటూ అధికారులను ప్రశ్నించారు. వృద్ధురాలికి వెంటనే పింఛన్ మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

బంగమ్మ సమక్షంలోనే ఫోన్‌లో మాట్లాడిన పీడీ సుమతి.. ఆమెకు పింఛన్ అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. అయినప్పటికీ, ఇన్నాళ్లుగా ఎదురుచూస్తున్న పింఛన్ నిజంగా వస్తుందో లేదోనని బంగమ్మ సందేహం వ్యక్తం చేసింది. 'బిడ్డా.. నిజంగానే పింఛన్ వస్తుందా?' అని అడిగింది. దానికి కలెక్టర్.. 'అవ్వా.. నేనే కలెక్టర్‌ను. నువ్వు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు' అంటూ మరోసారి భరోసా ఇచ్చారు. తన సమస్యను అర్థం చేసుకుని, తన పక్కన కూర్చొని మాట్లాడిన కలెక్టర్ ఆప్యాయతకు బంగమ్మ ముగ్ధురాలైంది. 'నాలాంటి ముసలావిడ పక్కన కూర్చొని మాట్లాడిన కలెక్టర్ బిడ్డవు నువ్వు. నిండు నూరేళ్లు చల్లగా బతకాలి' అంటూ మనస్ఫూర్తిగా ఆశీర్వదించింది. అనంతరం కలెక్టర్ ఆమెతో మాట్లాడుతూ.. 'నువ్వు ఇంటికి వెళ్లమ్మా. అధికారులే నీ ఇంటికి వస్తారు. ఇకపై ఎవరి దగ్గరికీ వెళ్లాల్సిన అవసరం లేదు' అని చెప్పారు. కలెక్టర్ చూపిన మానవత్వానికి బంగమ్మ మాటలు రాక కొద్దిసేపు అలాగే ఉండిపోయింది. అనంతరం ఆనందంగా ఇంటికి బయలుదేరింది. 'అందరూ ఇలాంటి అధికారులే ఉంటే నాలాంటి పేదవాళ్లకు ఇన్ని కష్టాలు ఉండేవి కావు సార్' అంటూ తన సంతోషాన్ని వ్యక్తం చేసింది. వృద్ధురాలి సమస్యను తెలుసుకునేందుకు కలెక్టర్ నేలపై కూర్చొని ఆమెతో మాట్లాడిన దృశ్యాలను దూరం నుంచి గమనించిన కొందరు ఫొటోలు తీశారు. ఆ ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

సాధారణంగా ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఉన్నతాధికారులను కలవాలంటే ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటారు. అలాంటిది, ఓ వృద్ధురాలి బాధను స్వయంగా విని, ఆమెకు భరోసా ఇచ్చి, సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవడం పలువురి ప్రశంసలు అందుకుంది. ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకుగా వ్యవహరించే అధికారిగా గుర్తింపు పొందిన మహమ్మద్ అబ్దుల్ అజీమ్.. ప్రస్తుతం మైనారిటీ శాఖ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. అధికారం అంటే హోదా మాత్రమే కాదు.. బాధలో ఉన్నవారికి అండగా నిలవడం కూడా. ప్రజల సమస్యలను ఓపికగా విని, వారికి గౌరవం ఇచ్చి, పరిష్కారం కోసం చొరవ చూపినప్పుడే నిజమైన ప్రజాసేవకు అర్థం ఉంటుంది. కలెక్టర్ అబ్దుల్ అజీమ్ చూపిన ఈ మానవత్వం అదే విషయాన్ని మరోసారి గుర్తుచేస్తోంది.

**నోట్: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో జరిగిన ఈ**

# రూ.30కోట్ల సైబర్ మోసాన్ని పట్టించిన 'కుర్తీ ఆర్డర్'

దిల్లీ యూనివర్సిటీ విద్యార్థిని ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసిన 'కుర్తీ' విషయంలో మోసానికి సంబంధించి దర్యాప్తు చేస్తుండగా.. రూ.30 కోట్లకు పైగా సైబర్ నేరం వెలుగులోకి వచ్చింది. దీంతో పోలీసులు అతిపెద్ద సైబర్ నెట్‌వర్క్‌ను ఛేదించగలిగారు.

ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఫాతిమా దిల్లీ యూనివర్సిటీలో చదువుకుంటోంది. ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ చూస్తున్న సమయంలో ఓ షాపింగ్ ప్రకటనలో చూపించిన కుర్తీని ఆర్డర్ చేసింది. వారి వాట్సాప్ ఖాతాలో పంపిన క్యూఆర్ కోడ్‌కు మొదట రూ.400 చెల్లించింది. అనంతరం పార్సిల్ డెలివరీకి సంబంధించి కాల్ చేసి, పాస్‌కోడ్ ఇవ్వమని దుండగులు అడగడంతో ఫోన్‌కు వచ్చిన కోడ్ చెప్పింది. కుర్తా డెలివరీ కోసం ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలని..




తర్వాత వాటిని తిరిగి చెల్లిస్తామని నమ్మించి పలుమార్లు రూ.1,150, రూ.2,000, రూ.2,650, రూ.650 బదిలీ చేసేలా ప్రేరేపించారు. చివరికి పార్సిల్ డెలివరీ కాకపోవడం, డబ్బు రీఫండ్ ఇవ్వకపోవడంతో విద్యార్థిని తాను మోసపోయానని గుర్తించింది . ఈ విషయంపై నేషనల్ సైబర్‌క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ లో ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేపట్టారు. అనంతరం నార్త్ డిస్ట్రిక్ట్ సైబర్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.
వివిధ క్యూఆర్ కోడ్‌లకు చెల్లించిన డబ్బు కెనరా బ్యాంక్‌లోని ఓ ఖాతాకు చేరినట్లు అధికారులు దర్యాప్తులో గుర్తించారు. దానితో సంబంధం ఉన్న నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడు ఇచ్చిన సమాచారంతో మరో ఐదుగురిని అరెస్ట్ చేశారు. వీరిపై వివిధ రాష్ట్రాల్లో 27 సైబర్ మోసాల ఫిర్యాదులు ఉన్నట్లు తెలిపారు. నకిలీ సంస్థలు, వ్యక్తుల పేర్లతో తెరిచిన 25 బ్యాంకు ఖాతాల ద్వారా నిందితులు రూ.30కోట్ల సొమ్మును మళ్లించినట్లు పేర్కొన్నారు. ఈ మొత్తాన్ని సైబర్ నేరాల ద్వారా దోచుకున్నట్లు తేలడంతో దర్యాప్తు చేపట్టారు.

# 'ఇయర్‌ఫోన్లు' కాదు.. ప్రమాద ఘంటికలు!

మొదటిపేజీ తరువాయి
హైదరాబాద్ పోలీసు కమిషనర్ ఐపీఎస్ వీసీ సజ్జనార్ మరో విషాదంతో కూడిన సందేశాత్మక కథనాన్ని పంచుకున్నారు. ఇయర్ ఫోన్లు పెట్టుకుని అజాగ్రత్తగా ఉండట వల్లన వచ్చే అనర్థాల గురించి ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా రైల్వే ట్రాక్‌ల దగ్గర నడుస్తున్నప్పుడు లేదా వాహనాలు నడుపుతున్నప్పుడు ఇయర్‌ఫోన్‌లు వాడటం వల్ల కలిగే పరధ్యాన ప్రమాదాలను సజ్జనార్ ఎత్తిచూపారు. నిండు జీవితం కంటే ఆ ఫోన్ కాల్ అంత అత్యవసరమా, ఇంట్లో ఎదురుచూసే కుటుంబ సభ్యుల కంటే ఆ పాటలు అంత ముఖ్యమైనవా? ఒక్కసారి ఆలోచించండి అంటూ ట్వీట్ చేశారు.

# ఉప్పల్‌లో భారీ చోరీ..? 48 తులాల బంగారం అపహరణ

మొదటిపేజీ తరువాయి
హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో ఓ ఇంట్లో భారీ చోరీ జరిగింది. సుమారు 48 తులాల బంగారాన్ని దొంగలు అపహరించారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ న్యూ భరత్ నగర్‌లో నివాసం ఉంటున్న గంగం భాస్కర్ రెడ్డి, బాలమణి దంపతులు సోమవారం మధ్యాహ్నం కొమురవెల్లికి వెళ్లారు. మంగళవారం ఉదయం పనిమనిషి ఇంటికి వచ్చి చూడగా, ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో వెంటనే చుట్టుపక్కల వారిని పిలిచి పరిశీలించగా చోరీ జరిగిన విషయం వెలుగుచూసింది. సమాచారం అందుకున్న ఇంటి యాజమాని వెంటనే బయలుదేరి ఇంటికి వచ్చి పరిశీలించారు. సుమారు 48 తులాల బంగారం, 1.5 కేజీల వెండి, రూ.3.5 లక్షల నగదు చోరీకి గురైనట్లు ఉప్పల్ పోలీసులకు ఇంటి యజమాని ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఎల్‌నినో ఎఫెక్ట్.. తెలంగాణలో కరవు కాటకం!

మొదటిపేజీ తరువాయి
జూన్ 1 నుంచి సెప్టెంబరు 30 వరకు వర్షపాతం, ప్రతి మండలంలోని 10శాతం గ్రామాల్లో భూగర్భ జలాలు, పంటల పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్నారు. ఎల్‌నినో పరిస్థితులు, బంగాళాఖాతంలో అల్పపీడనాలు బలహీనపడటం, సుదీర్ఘ కాలం పొడి వాతావరణం.. నైరుతి రుతుపవనాల సీజన్‌పై తీవ్ర ప్రభావం చూపినట్లు ప్రభుత్వం తెలిపింది. రాష్ట్రంలో 740.6 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతం ఉండగా.. 17 శాతం లోటుతో 615.5 మిల్లీ మీటర్ల వర్షమే కురిసిందని వెల్లడించింది. మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సులను ఆమోదించిన ప్రభుత్వం.. కరవు మండలాలను ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

# కేటీఆర్ పాస్‌పోర్ట్ విషయంలో వైఖరేంటో చెప్పండి.. ఏసీబీకి తెలంగాణ హైకోర్టు ఆదేశాలు

మొదటిపేజీ తరువాయి
ACB లేఖతో పాస్ పోర్ట్ impound పై RPO అధికారులు నోటీస్ ఇచ్చారు. రీజినల్ పాస్ పోర్ట్ ఆఫీస్ జారీ చేసిన నోటీసుపై హైకోర్టులో కేటీఆర్ పిటిషన్ దాఖలు చేశారు. స్టేటస్ కో ఇస్తూ కోర్ట్ ఉత్తర్వులు ఇచ్చింది. ప్రతివాదులు అందరికీ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను నవంబర్ 6 వాయిదా వేసింది.

కేటీఆర్ పాస్ పోర్టును ఎందుకు జప్తు చేయకూడదో వివరించాలని కోరుతూ రీజనల్ పాస్ పోర్ట్ ఆఫీస్ సెప్టెంబర్ 28న కేటీఆర్ కు షోకాజ్ నోటీస్ జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నోటీసును సవాల్ చేస్తూ కేటీఆర్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

పాస్ పోర్ట్ అథారిటీ చర్యలు చట్ట విరుద్ధంగా ఉన్నాయని, ఏకపక్షంగా.. పక్షపాత ధోరణిలో ఉన్నాయని.. రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14, 19, 21 కింద తన ప్రాథమిక హక్కులకు భంగం కలిగించేలా ఉన్నాయని కేటీఆర్ తన పిటిషన్ లో పేర్కొన్నారు. ఈ కేసులో ప్రతివాదులుగా కేంద్ర ప్రభుత్వం, ప్రాంతీయ పాస్ పోర్ట్ అధికారి, ఏసీబీ డైరెక్టర్ జనరల్?ను చేర్చారు.

# ఆ రైతుల ఖాతాల్లోకి రూ.5వేలు.. దీపావళికి ముందే ఫడణవీస్ సర్కార్ సాయం!

మొదటిపేజీ తరువాయి
కరవు పరిస్థితుల నేపథ్యంలో మహారాష్ట్ర ప్రభుత్వం రైతులకు గుడ్‌న్యూస్ చెప్పింది. దీపావళికి ముందుగానే రాష్ట్రంలోని 304 కరవు ప్రభావిత ప్రాంతాల్లోని దాదాపు 1.5కోట్ల మంది రైతులకు రూ.5వేలు చొప్పున ముందస్తు సాయం ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు సీఎం దేవేంద్ర ఫడణవీస్ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా 33శాతానికి పైగా పంట నష్టపోయిన రైతులను ఈ సాయానికి అర్హులుగా నిర్ణయించారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.7500 కోట్లు వెచ్చించనుంది. ఈ వారంలోనే రైతుల ఖాతాల్లోకే నేరుగా ఈ మొత్తాన్ని జమ చేయాలని సీఎం ఆదేశించారు. వర్షాభావ పరిస్థితుల వేళ రాష్ట్రంలోని మొత్తం 358 మండలాలకు గాను 304 మండలాలను రాష్ట్ర ప్రభుత్వం కరవు మండలాలుగా ప్రకటించింది.

# రూ.4 రిఫండ్‌కు ఆశపడి 98వేలు పోగొట్టుకున్న మహిళ

ఓ ఆర్డర్ విషయంలో రూ.4 రిఫండ్ కోసం ఆశపడి ఓ మహిళ ఏకంగా రూ.98 వేలు పోగొట్టుకున్నారు. నకిలీ కస్టమర్‌కేర్ నంబరుకు కాల్ చేయడంతో ఆమె మోసపోయారు. ఈ ఘటన మధ్యప్రదేశ్‌లోని జబల్‌పుర్ జిల్లా అదర్తల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇంతకీ ఏం జరిగిందంటే..
పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సవిత అనే మహిళ ఓ ఈ-కామర్స్ వెబ్‌సైట్‌లో బ్యాగ్‌ను బుక్ చేసుకున్నారు. ఆ ప్రొడక్ట్ అసలు ధర రూ.526 కాగా.. డెలివరీ బాయ్ రూ.530 వసూలు చేశాడు. అదనంగా తీసుకున్న రూ.4 గురించి ఆమె ప్రశ్నించగా.. ఆన్‌లైన్‌లో ప్రాసెస్ చేయాల్సి ఉంటుందని అతడు బదులిచ్చాడు. దీంతో ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయడానికి ఆమె సదరు కంపెనీ హెల్ప్‌లైన్ నంబర్ కోసం వెతకగా.. సైట్‌లో కనిపించిన ఓ నంబరుకు కాల్ చేయడంతో ఆ కాల్‌కు సమాధానం ఇచ్చిన వ్యక్తి రిఫండ్ చేస్తామని ఆమెను నమ్మించాడు. ఆమె బ్యాంకు వివరాలు తెలుసుకొని మాట్లాడుతుండగానే రూ.98 వేలు కాజేశాడు. ఇది సైబర్ మోసమని గ్రహించిన బాధితురాలు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు

# బీసీ సంక్షేమ శాఖ పథకాల అమలులో పారదర్శకత, వేగం పెంచాలి

**38 ఆత్మగౌరవ భవనాల జీవోల ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలిలి**
**డిసెంబర్ 9న లబ్ధిదారులకు కుట్టు మిషన్లు అందించేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలిలి**
**తెలంగాణ మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలల సొంత భవనాలకు స్థల సేకరణ పూర్తి చేయాలిలి**
**బీసీ స్టడీ సర్కిల్ లో కమిటీ నివేదిక ఆధారంగా నూతన సంస్కరణలు అమలు చేయాలి**
**మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలు**



హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27: సచివాలయంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బీసీ సంక్షేమ శాఖపై సమీక్షా సమావేశం నిర్వహించారు. బీసీ సంక్షేమ శాఖ పరిధిలో అమలవుతున్న పథకాలు, గురుకుల పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, ఆత్మగౌరవ భవనాలు, నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ, బీసీ వర్గాలకు స్వయం ఉపాధి అవకాశాల కల్పన తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు.

మహాత్మా జ్యోతిబా ఫూలే విదేశీ విద్యా నిధి పథకం అమలుపై మంత్రి సమీక్షించారు. ఈ పథకం ద్వారా అర్హులైన మెరిట్ విద్యార్థులకు పూర్తి పారదర్శకతతో పెండింగ్ లేకుండా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచనల మేరకు 38 ఆత్మగౌరవ భవనాలకు సంబంధించిన జీవోల ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు.

బీసీ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపరిచే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇంటింటా కుట్టు మిషన్ల పథకం అమలుపై మంత్రి సమీక్షించారు. ఈ పథకానికి మహిళల నుంచి మంచి స్పందన లభించిందని, సుమారు 4.80 లక్షల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. నియోజకవర్గానికి వెయ్యి మంది చొప్పున మొత్తం 1.90 లక్షల మంది మహిళలకు లబ్ధి చేకూర్చేలా ప్రణాళిక రూపొందించినట్లు పేర్కొన్నారు. డిసెంబర్ 9న లబ్ధిదారులకు కుట్టు మిషన్లు అందించేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని, టెండర్ ప్రక్రియతో పాటు ఇతర అవసరమైన పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

రాజీవ్ యువ వికాసం పథకం కింద వచ్చిన దరఖాస్తుల వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ పథకం ద్వారా లబ్ధి పొందే వారిలో బీసీలకు తగిన ప్రాధాన్యత కల్పించే అంశంపై ప్రభుత్వంతో చర్చిస్తామని తెలిపారు. రాష్ట్రంలోని 327 మహాత్మా జ్యోతిబా ఫూలే గురుకుల పాఠశాలల్లో ఆర్సీవోలు పర్యటించి మౌలిక సదుపాయాలు, సిబ్బంది, విద్యార్థుల సంఖ్య, ఖాళీలు, సొంత భవనాల స్థితిగతులు తదితర అంశాలపై నివేదికలు అందించినట్లు మంత్రి తెలిపారు. ఈ నివేదికల ఆధారంగా పాఠశాలల్లో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రాష్ట్రంలోని 327 గురుకుల పాఠశాలల్లో కేవలం 26 పాఠశాలలకు మాత్రమే సొంత భవనాలు ఉండగా, మిగిలిన 301 పాఠశాలలు ప్రైవేట్ భవనాల్లో కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. 37 గురుకులాలకు సొంత స్థలాలు ఉన్నందున వాటిలో భవనాల నిర్మాణానికి అనుమతులు, నిధులు మంజూరు చేసే అంశంపై ప్రభుత్వంతో చర్చిస్తామని తెలిపారు. గురుకులాలకు కూడా సొంత భవనాలు నిర్మించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. అధికారులు గురుకుల పాఠశాలలను క్రమం తప్పకుండా సందర్శించాలని, జిల్లా కలెక్టర్లు నెలకు ఒక గురుకుల పాఠశాలను సందర్శించి నివేదిక అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గురుకులాలకు అవసరమైన స్థలాల సేకరణను త్వరగా పూర్తి చేయాలని ప్రిన్సిపల్ సెక్రటరీని ఆదేశించారు.

నవంబర్ మొదటి వారంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్, జిల్లా కలెక్టర్లు, ఆర్సీవోలు, ప్రిన్సిపాళ్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి గురుకులాల సమస్యల పరిష్కారంపై సమీక్షించనున్నట్లు తెలిపారు. గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు, బీసీ సంక్షేమ శాఖ హాస్టల్ వార్డెన్లకు లేఖలు రాసి విద్యార్థులకు ఎల్ నినో ప్రభావం, నీటి పొదుపు, విద్యుత్ వినియోగంలో మితవ్యయం తదితర అంశాలపై అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. విద్యార్థులకు అవగాహన కల్పించడం ద్వారా వారు తమ తల్లిదండ్రులకు కూడా ఈ అంశాలను వివరించే అవకాశం ఉంటుందని తెలిపారు. బీసీ స్టడీ సర్కిళ్లలో సంస్కరణలు చేపట్టి నిరుద్యోగులకు ఉద్యోగాలే లక్ష్యంగా నాణ్యమైన శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఈ అంశంపై ఐదుగురు సభ్యుల కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా సమర్థవంతమైన డైరెక్టర్ల నియామకానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. డైరెక్టర్ల ఎంపిక కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, యూపీఎస్సీ, గ్రూప్–1 వంటి పోటీ పరీక్షల్లో మెరిట్ సాధించిన వారికి అవకాశాలు కల్పించేలా ఎంపిక ప్రక్రియ చేపట్టాలని తెలిపారు.

బీసీ కార్పొరేషన్ ద్వారా శిక్షణ పొందిన వారికి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని మంత్రి సూచించారు. మధిర వంటి నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్టుగా పశువుల పంపిణీ తరహా ఉపాధి పథకాన్ని ప్రారంభించి, లబ్ధిదారుల ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎంఎస్ఎంఈ పథకం కింద చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపనకు వివిధ కుల సంఘాలకు నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు, ఆర్థిక వృద్ధి పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బీసీ వితంతువులు, ఒంటరి మహిళలకు నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో రజకుల కోసం ఆధునిక ధోబీఘాట్లు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. ట్యాంక్‌బండ్‌పై బలహీనవర్గాల ఐకాన్‌లుగా నిలిచిన ప్రముఖుల విగ్రహాలకు పేర్లు రాయించే పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

కాటమయ్య రక్షణ కవచాల పంపిణీపై సమీక్షిస్తూ, శిక్షణ పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు వాటిని అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నీరా కేఫ్, నందనవనాల నిర్వహణ, అభివృద్ధి అంశాలపై మంత్రి చర్చించారు. వాటిని అధికారులు స్వయంగా సందర్శించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించాలని ఆదేశించారు. బీసీ సంక్షేమ శాఖ పరిధిలోని పథకాలు అర్హులైన లబ్ధిదారులకు సమర్థవంతంగా చేరేలా, స్వయం ఉపాధి అవకాశాలు పెరిగేలా, గురుకులాల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేలా సమన్వయంతో పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జ, బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాలమాయాదేవి, మహాత్మా జ్యోతిబా ఫూలే గురుకులాల కార్యదర్శి సైదులు, అధికారులు మల్లయ్య భట్టు, అలోక్ కుమార్, పద్మ, మామిడి హరికృష్ణ, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# యాసంగిలో వరి సాగు వద్దు.. రైతులకు మంత్రి తుమ్మల సూచన

**ఎల్‌నినో ప్రభావంతో సాగునీటి కొరతకు అవకాశం..**
**తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు**




ఖమ్మం, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో యాసంగి పంటల సాగు, సాగునీటి లభ్యత, తాగునీటి సరఫరా, ఆర్నాబ్ తుఫాన్ ప్రభావం తదితర అంశాలపై రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎల్‌నినో ప్రభావంతో సాగునీటి లభ్యత తగ్గే అవకాశం ఉన్నందున రైతులు నష్టపోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. యాసంగిలో వరి సాగుకు దూరంగా ఉండాలని రైతులకు పిలుపునిచ్చారు.

**సాగునీటి లభ్యతపై ముందస్తు ప్రణాళిక**

ఎల్‌నినో ప్రభావంతో నీటి లభ్యతపై ప్రతికూల పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులకు ఇరిగేషన్ శాఖ అధికారులు అవగాహన కల్పించాలని మంత్రి ఆదేశించారు. సాగునీటి కొరత కారణంగా రైతులు పెట్టుబడులు పెట్టి నష్టపోయే పరిస్థితి రాకుండా ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీతారామ ప్రాజెక్టు కాలువలు, సాగర్ ఎడమ కాలువలో షట్టర్లు మూసి నీటిని నిల్వ ఉంచేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు.

**తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు**

వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. మిషన్ భగీరథ ద్వారా ప్రజలకు నిరంతర నీటి సరఫరా అందించేందుకు కిన్నెరసాని ప్రాజెక్టును ప్రత్యామ్నాయ వనరుగా వినియోగించుకునేలా ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో తాగునీటి ఇబ్బందులు, విద్యుత్ కోతలు లేకుండా ఉమ్మడి ఖమ్మం జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

**తుఫాన్ నేపథ్యంలో రైతులు అప్రమత్తం**

ఆర్నాబ్ తుఫాన్ నేపథ్యంలో చేతికొచ్చిన పంటలకు నష్టం వాటిల్లకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పంటల రక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పంటల ఉత్పత్తులు తగ్గినప్పటికీ వివిధ రకాల పంటలకు మంచి ధరలు లభిస్తున్నాయని పేర్కొన్నారు.

**కొనుగోళ్లలో ఇబ్బందులు రాకూడదు**

రైతులు పండించిన పంటలను విక్రయించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా మార్కెటింగ్ శాఖ అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని మంత్రి తుమ్మల సూచించారు. కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని, రైతులకు నష్టం కలగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని ఆదేశించారు. సాగునీటి కొరత, తాగునీటి సరఫరా, విద్యుత్ సరఫరా, పంటల కొనుగోళ్లు వంటి అంశాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి స్పష్టం చేశారు. పరిస్థితులకు అనుగుణంగా ముందస్తు ప్రణాళికలతో ప్రజలకు, రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు.

# కాంగ్రెస్ లో విలువ కోల్పోయిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27: ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధికి నియోజకవర్గ సమస్యలపై పట్టు ఎంత అవసరమో, వాటిని ప్రభుత్వం ద్వారా సాధించుకునే రాజకీయ పరిపక్వత అంతకంటే ముఖ్యం. కానీ జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి వ్యవహారశైలి చూస్తుంటే, ఆయనకు కనీస రాజకీయ స్పృహ, పాలనా సంస్కారాలు కొరవడ్డాయన్న భావన రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో, కనీసం సొంత గ్రామంలో సైతం కాంగ్రెస్ మద్దతుదారులను గెలిపించుకోలేని అసమర్థత ఆయనది. అలాంటి తెలివితేటల్నే అన్ని విషయాల్లోనూ పాటిస్తున్నారు.



**గతంలో ఎమ్మెల్యేలను కూడగట్టిన నిర్వాకం**

గతంలో తోటి అసంతృప్త ఎమ్మెల్యేలను కూడగట్టి, అధిష్ఠానం వద్ద బేరసారాల కోసం తెరవెనుక వర్గాన్ని నడిపించేందుకు ఆయన చేసిన ప్రయత్నాలు అభాసుపాలై తీవ్రమైన మైనస్ మార్కులను మూటగట్టుకున్నాయి. ఆ చేదు అనుభవాల నుంచైనా పాఠాలు నేర్చుకుని తన రాజకీయ శైలిని మార్చుకుంటారని భావిస్తే.. తాజాగా రూ.40 కోట్ల రోడ్ల పెండింగ్ బిల్లుల కోసం చనిపోతానంటూ ఆమరణ దీక్షాస్త్రం సంధించి మరోసారి తన అపరిపక్వతను బట్టబయలు చేసుకున్నారు. రోడ్లు, కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులనేవి రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆర్థిక వెసులుబాటు, ప్రాధాన్యతల ఆధారంగా విడుదలయ్యే పరిపాలనా ప్రక్రియ. రాష్ట్రంలో మిగతా నియోజకవర్గాలన్నింటికీ నిధులు ఇచ్చి, కేవలం తనపైనే వ్యక్తిగత కక్షతో ఆపేశారన్నట్లుగా ఆయన మాట్లాడుతున్న తీరు హాస్యాస్పదంగా ఉంది.

**అంతా తెలిసి కూడా అనిరుధ్ రెడ్డి రాజకీయం**

ప్రభుత్వంలో నిధుల కేటాయింపులు, ట్రెజరీ నిర్వహణ ఎలా సాగుతాయో తెలిసిన ఏ ప్రజాప్రతినిధి కూడా ఇలా బహిరంగంగా చనిపోతానని బ్లాక్‌మెయిలింగ్ తరహా ప్రకటనలు చేయరు. ఉప ముఖ్యమంత్రి, ఆర్ అండ్ బి మంత్రులపై బహిరంగంగా ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేస్తూ, ప్రతిపక్షాలకు ఆయుధాలు అందిస్తున్న తీరు ఆయన రాజకీయ అనుభవలేమిని తేటతెల్లం చేస్తోంది. సొంత నియోజకవర్గంలో రోడ్ల సమస్య వాస్తవమే కావొచ్చు, కానీ దాన్ని శాసనసభ వేదికగానో, ముఖ్యమంత్రి చాంబర్‌లోనే సమన్వయంతో సాధించుకోవాలే తప్ప.. నా ప్రాణం విలువ రూ.40 కోట్లా అంటూ సంచలనాల కోసం డ్రామాలు రక్తికట్టించడం రాజకీయ అపరిపక్వతకు నిదర్శనం.

**కాంగ్రెస్ లో విలువ కోల్పోయిన ఎమ్మెల్యే**

అనిరుధ్ రెడ్డి వంటి అపరిపక్వ నేతలు చేసే వివాదాస్పద విన్యాసాలు కేవలం కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠకే కాకుండా, పరిపాలనపై పట్టు సాధించేందుకు తీవ్రంగా శ్రమిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా పెద్ద తలనొప్పిగా మారుతున్నాయి. సొంత పార్టీ ఎమ్మెల్యేనే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆమరణ దీక్షలంటూ రంకెలేస్తుంటే.. ప్రజల్లోకి పరిపాలనా వైఫల్యం అనే తప్పుడు సంకేతాలు వెళ్తాయి. పార్టీ అంతర్గత వేదికలపై చర్చించాల్సిన పాలనాపరమైన అంశాలను రోడ్డుపైకి లాగి, సినిమాటిక్ డైలాగులతో చౌకబారు ప్రచారం పొందాలని చూసే ఇలాంటి ధోరణులను అధిష్ఠానం ఇకనైనా తీవ్రంగా పరిగణించకపోతే.. అది పార్టీ ఐక్యతకే కాక ప్రభుత్వ స్థిరత్వానికే చేటు తెచ్చే ప్రమాదముంది. అందుకే అనిరుధ్ రెడ్డిని ఇక లైట్ తీసుకునే అవకాశం ఉంది.

# బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరంలో తెలంగాణ గొంతు బలంగా వినిపిస్తాం

**తెలంగాణ ప్రగతి, రాష్ట్ర కీలక అంశాలను అంతర్జాతీయ వేదికపై వివరిస్తాం: స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్**



న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27: అంతర్జాతీయ వేదికలపై తెలంగాణ రాష్ట్ర ఖ్యాతిని మరింత పెంచేందుకు కృషి చేస్తామని తెలంగాణ శాసనసభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ స్పష్టం చేశారు. ఢిల్లీలోని సంవిధాన్ సదన్ (పాత పార్లమెంట్ భవనం)లో అక్టోబర్ 26, 27 తేదీల్లో నిర్వహిస్తున్న 12వ బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరం సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రగతి, రాష్ట్రానికి సంబంధించిన కీలక అంశాలను వివరిస్తామని స్పీకర్ తెలిపారు. బ్రిక్స్ సమావేశాల వేదికపై తెలంగాణ గొంతును బలంగా వినిపిస్తామని పేర్కొన్నారు.

**శంషాబాద్ నుంచి ఢిల్లీకి పయనం**

బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరం సమావేశాల్లో పాల్గొనేందుకు గడ్డం ప్రసాద్ కుమార్ సోమవారం ఉదయం శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా విమానాశ్రయంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ అభివృద్ధి, రాష్ట్ర ప్రాధాన్యతలను అంతర్జాతీయ స్థాయిలో ప్రస్తావించేందుకు ఈ సమావేశాలు దోహదపడతాయని పేర్కొన్నారు.

**పలువురు ప్రముఖుల భాగస్వామ్యం**

12వ బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరం సమావేశాల్లో తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు కూడా పాల్గొన్నారు. వివిధ దేశాల పార్లమెంటరీ ప్రతినిధులు పాల్గొనే ఈ వేదికపై తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన అంశాలను ప్రస్తావించడంతోపాటు, రాష్ట్ర ప్రతిష్ఠను మరింత పెంచేందుకు కృషి చేస్తామని స్పీకర్ తెలిపారు.

గడ్డం ప్రసాద్ కుమార్ పర్యటన విజయవంతం కావాలని పలువురు ఆకాంక్షించారు.

# కాళేశ్వరం పేరు వింటే హరీశ్‌రావుకు ఎక్కడలేని కోపం: ఎంపీ చామల

**మేడిగడ్డ నుంచి ఏపీకి 20 వేల క్యూసెక్కుల నీళ్లు వెళ్తున్నాయనడం బీఆర్ఎస్ దుష్ప్రచారం**
**బీఆర్ఎస్ హయాంలోనే మేడిగడ్డ బ్యారేజీ కూలింది**



హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27: కాళేశ్వరం ప్రాజెక్టు, మేడిగడ్డ బ్యారేజీ గురించి మాట్లాడితే మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావుకు ఎక్కడలేని కోపం వస్తోందని భువనగిరి లోక్‌సభ సభ్యుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాల వల్లే కాళేశ్వరం ప్రాజెక్టు పరిస్థితి దెబ్బతిన్నదని ఆరోపించారు.

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల వద్ద నీటిమట్టాల గురించి తాను మాట్లాడానని చామల పేర్కొన్నారు. అయితే, మేడిగడ్డ నుంచి 20 వేల క్యూసెక్కుల నీరు ఆంధ్రప్రదేశ్‌కు వెళ్తోందంటూ బీఆర్ఎస్ దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. మేడిగడ్డ బ్యారేజీ దెబ్బతిన్న విషయం తెలంగాణ ప్రజలకు, బీఆర్ఎస్ నేతలకు తెలియదా అని ప్రశ్నించారు.

**బీఆర్ఎస్ హయాంలోనే బ్యారేజీ దెబ్బతింది**

బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయిందని చామల ఆరోపించారు. అప్పట్లో ఇరిగేషన్ మంత్రిగా ఉన్న హరీశ్‌రావు కాళేశ్వరం ప్రాజెక్టును సరిగా నిర్వహించలేకపోయారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరు ప్రస్తావించినప్పుడల్లా హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ పాలనలో తీసుకున్న నిర్ణయాలు, చేపట్టిన పనుల కారణంగానే కాళేశ్వరం ప్రాజెక్టుకు ఈ పరిస్థితి వచ్చిందని ఆయన ఆరోపించారు. గోదావరి జలాలను సద్వినియోగం చేసుకోవడంలో గత ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.

**దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల్లో పంపులు నడుస్తున్నాయి**

దేవాదుల, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో పంపులు పనిచేస్తున్నాయని చామల తెలిపారు. మేడిగడ్డ వద్ద గతంలోనూ నీటిని ఎత్తిపోసేందుకు అవకాశం లేదని, ప్రస్తుతం కూడా పరిస్థితి అలాగే ఉందని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై బీఆర్ఎస్ నేతలు వాస్తవాలను పక్కనపెట్టి రాజకీయ విమర్శలకు దిగుతున్నారని ఆయన ఆరోపించారు. గోదావరి జలాల వినియోగం, బ్యారేజీల పరిస్థితిపై ప్రజలకు వాస్తవాలు తెలియజేయాల్సిన అవసరం ఉందని చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు.

త్రినేత్ర తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక
బుధవారం అక్టోబర్ 28, 2026
www.trinetnews.com

# స్టార్టప్‌లకు ప్రోత్సాహం.. వ్యాపార నిబంధనల్లో భారీ సంస్కరణలు

**న్యూఢిల్లీ, త్రినెట్ న్యూస్, అక్టోబర్ 27:**

అనుమతుల ఆధారిత విధానం నుంచి విశ్వాస ఆధారిత పాలన వైపు భారత్ అడుగులు వేస్తోందని పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక శాఖ (డీపీఐఐటీ) తెలిపింది. స్టార్టప్‌లకు మద్దతు, నిబంధనల సరళీకరణ, విదేశీ పెట్టుబడులకు ప్రోత్సాహం, డిజిటల్ సింగిల్ విండో అనుమతుల ద్వారా వ్యాపారాలపై నియంత్రణ భారాన్ని తగ్గిస్తున్నట్లు పేర్కొంది.

స్టార్టప్ ఇండియా కార్యక్రమం కింద దేశవ్యాప్తంగా 770కి పైగా జిల్లాల్లో 2,50,046 స్టార్టప్‌లకు గుర్తింపు లభించింది. ఈ సంస్థలు 25.42 లక్షలకు పైగా ఉద్యోగాలను కల్పించాయి. గుర్తింపు పొందిన స్టార్టప్‌లలో 52 శాతం మెట్రో నగరాల వెలుపలివి కాగా, 48 శాతం సంస్థల్లో కనీసం ఒక మహిళా డైరెక్టర్ ఉన్నారు. 2023--24లో 34,200గా ఉన్న వార్షిక గుర్తింపులు 2024--25లో 36,440కు పెరిగాయి.

స్టార్టప్ ఇండియా సీడ్ ఫండ్ పథకం కింద 32 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 244 ఇంక్యుబేటర్ల ద్వారా 4,194 స్టార్టప్‌లకు రూ.775.67 కోట్లు ఆమోదించారు. వీటిలో మహిళలు నాయకత్వం వహిస్తున్న స్టార్టప్‌లు 2,147 కాగా, టైర్--2, టైర్--3 నగరాలకు చెందినవి 2,356 ఉన్నాయి.

స్టార్టప్‌ల కోసం నిధుల నిధి పథకం కింద సిడ్బీ 166 ప్రత్యామ్నాయ పెట్టుబడి నిధులకు రూ.12,623 కోట్లు కేటాయించింది. ఆ నిధులు 1,475 స్టార్టప్‌లలో రూ.28,254 కోట్లు పెట్టుబడి పెట్టాయి.

స్టార్టప్‌ల క్రెడిట్ గ్యారంటీ పథకం కింద 532 రుణాలకు రూ.1,662.71 కోట్ల హామీ కల్పించారు. ఈ రుణాలు 41,637 మందికి ఉపాధి కల్పిస్తున్న స్టార్టప్‌లకు అందాయి. ఒక్కో రుణగ్రహీతకు గ్యారంటీ పరిమితిని రూ.10 కోట్ల నుంచి రూ.20 కోట్లకు పెంచగా, 27 ప్రాధాన్య రంగాలకు వార్షిక రుసుమును 1 శాతానికి తగ్గించారు.

స్టార్టప్ రంగంలో 63 నియంత్రణ సంస్కరణలు చేపట్టారు. ఏంజెల్ పన్ను రద్దు, లిస్టెడ్, అన్‌లిస్టెడ్ షేర్లపై దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను విధానాల సమన్వయం, బీమా సంస్థలు, ఈపీఎఫ్ఓ, సూపర్‌యాన్యుయేషన్, గ్రాట్యుటీ నిధులు ప్రత్యామ్నాయ పెట్టుబడి నిధుల్లో పెట్టుబడి పెట్టేందుకు అనుమతి వంటివి వీటిలో ఉన్నాయి. ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80-ఐఏసీ కింద 4,467 స్టార్టప్‌లకు అర్హత ధ్రువీకరణ లభించింది.

ప్రభుత్వ ఈ-మార్కెట్‌ప్లేస్ (జీఈఎం)లో నమోదు చేసుకున్న స్టార్టప్‌ల సంఖ్య 2021 జనవరిలో 7,929 ఉండగా, ప్రస్తుతం 43,260కు చేరింది. గత అనుభవం, కనీస టర్నోవర్, ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ నిబంధనల్లో సడలింపులు ఇందుకు దోహదపడ్డాయి. ఈ స్టార్టప్‌లు ప్రభుత్వ కొనుగోలుదారులకు 6.23 లక్షల ఆర్డర్లు అందించి, రూ.68,105 కోట్ల విలువైన వ్యాపారం చేశాయి. స్టార్టప్ విధానాలు అమలు చేస్తున్న రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల సంఖ్య 2016లో నాలుగు ఉండగా, ప్రస్తుతం 32కు పెరిగింది. 17 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 104 ఇంక్యుబేటర్లు ఏర్పాటు కాగా, తేజస్ కార్యక్రమం 27 రాష్ట్రాల్లోని 132 జిల్లాలకు విస్తరించింది.

వ్యాపార నిబంధనల సరళీకరణలో భాగంగా కేంద్ర మంత్రిత్వ శాఖలు, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో మొత్తం 47,957 అనుసరణల భారాన్ని తగ్గించారు. వాటిలో 22,290ను డిజిటలైజ్ చేయగా, 16,141ను సరళీకరించారు, 5,255ను నేర పరిధి నుంచి తొలగించారు, 4,271ను పూర్తిగా రద్దు చేశారు. జన విశ్వాస్ చట్టాల ద్వారా కేంద్ర చట్టాల్లోని 900 నిబంధనలను నేరరహితం చేశారు. 2023లో 42 చట్టాల్లోని 183 నిబంధనలను, 2026లో 79 చట్టాల్లోని 717 నిబంధనలను ఈ పరిధిలోకి తీసుకొచ్చారు.

వ్యాపార సంస్కరణల కార్యాచరణ ప్రణాళికలోని ఏడు దశల ద్వారా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు 9,700కు పైగా సంస్కరణలను అమలు చేశాయి. జిల్లా స్థాయి సంస్కరణల ప్రణాళికలో కలెక్టరేట్లు, అభివృద్ధి సంస్థలు, పట్టణ స్థానిక సంస్థల కోసం 222 సంస్కరణలు చేర్చారు.

29 కేంద్ర కార్మిక చట్టాలను నాలుగు కార్మిక కోడ్‌లుగా ఏకీకృతం చేశారు. తొలగింపు లేదా సంస్థ మూసివేతకు ముందస్తు అనుమతి అవసరమయ్యే కార్మికుల పరిమితిని 100 నుంచి 300కు పెంచారు. విద్యుత్ వినియోగించే కర్మాగారాల్లో కార్మికుల పరిమితిని 10 నుంచి 20కు, విద్యుత్ వినియోగించని కర్మాగారాల్లో 20 నుంచి 40కు పెంచారు. కాంట్రాక్టు కార్మికుల లైసెన్సింగ్ పరిమితిని 20 నుంచి 50కు చేర్చారు. చట్టపరమైన చర్యలకు ముందు 30 రోజుల అనుసరణ నోటీసు ఇవ్వడం తప్పనిసరి చేశారు.

పెట్రోలియం, పేలుడు పదార్థాల భద్రతా సంస్థ (పెసో) జారీ చేసే లైసెన్సుల చెల్లుబాటు గడువును ఐదేళ్ల నుంచి పదేళ్లకు పెంచారు. పెసో సేవలన్నింటినీ డిజిటలైజ్ చేసి జాతీయ సింగిల్ విండో వ్యవస్థతో అనుసంధానించారు. జిల్లా అధికారుల నుంచి అభ్యంతరం లేదని తెలిపే ధ్రువపత్రాలను ఆన్‌లైన్‌లో జారీ చేసే విధానం ప్రవేశపెట్టారు. మహిళలు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు రుసుముల్లో రాయితీలు కల్పించారు. వలస పాలన కాలం నాటి 1923 బాయిలర్స్ చట్టం స్థానంలో 2025 బాయిలర్స్ చట్టాన్ని తీసుకొచ్చారు.

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) రంగంలో 17 విభాగాలను ఆటోమేటిక్ మార్గంలోకి తీసుకొచ్చారు. కొత్త పారిశ్రామిక లైసెన్సులున్న రక్షణ రంగ సంస్థల్లో ఆటోమేటిక్ మార్గం కింద ఎఫ్‌డీఐ పరిమితిని 49 నుంచి 74 శాతానికి పెంచారు. బీమా రంగంలో 2021లో పరిమితిని 49 నుంచి 74 శాతానికి పెంచగా, 2026లో తమ మొత్తం ప్రీమియాన్ని భారత్‌లోనే పెట్టుబడి పెట్టే బీమా సంస్థలకు 100 శాతం ఎఫ్‌డీఐకి అనుమతించారు. 2021--22 నుంచి 2024--25 వరకు బీమా రంగం సుమారు 8.79 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించింది. టెలికమ్యూనికేషన్లు, నాన్-షెడ్యూల్డ్ విమాన సేవలు, విమానాశ్రయ గ్రౌండ్ హ్యాండ్లింగ్, ఉపగ్రహ విడిభాగాల తయారీ, ప్రసార పంపిణీ రంగాల్లో ఆటోమేటిక్ మార్గం ద్వారా 100 శాతం ఎఫ్‌డీఐకి అనుమతి ఉంది.

2014--15 నుంచి 2025--26 వరకు భారత్‌కు 843 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐ వచ్చింది. అంతకుముందు 12 ఏళ్లలో వచ్చిన 313 బిలియన్ డాలర్లతో పోలిస్తే ఇది 169 శాతం అధికం. 2025--26లో ఎఫ్‌డీఐ ప్రవాహం రికార్డు స్థాయిలో 94.53 బిలియన్ డాలర్లకు చేరింది.

జాతీయ సింగిల్ విండో వ్యవస్థ (ఎన్ఎస్‌డబ్ల్యూఎస్) ద్వారా ఇప్పటివరకు 15,49,850 దరఖాస్తులు అందగా, 5,76,778 వ్యాపార సంస్థలు నమోదు చేసుకున్నాయి. 8.5 లక్షలకు పైగా అనుమతులు జారీ చేశారు. ఈ వేదికపై 327 కేంద్ర సేవలు, 3,452 రాష్ట్ర సేవలు కలిపి మొత్తం 3,779 సేవలు అందుబాటులో ఉన్నాయి. 34 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, 32 కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాలను వ్యవస్థతో అనుసంధానించారు.

'నో యువర్ అప్రూవల్స్' (కేవైఏ) మాడ్యూల్ ద్వారా వ్యాపారాలకు వర్తించే 8,000కు పైగా అనుమతులపై సమాచారం అందిస్తున్నారు. వీటిలో 592 కేంద్ర, 2,233 రాష్ట్ర అనుమతులు కలిపి 2,825 అనుమతులు వ్యవస్థలో అనుసంధానమయ్యాయి. 285 అనుమతుల కోసం అవసరమైన 89 సాధారణ సమాచార వివరాలు ఆటోమేటిక్‌గా నింపే సదుపాయం కల్పించారు. పోర్టల్ 22 భారతీయ భాషల్లో అందుబాటులో ఉంది.

అనుమతుల ప్రక్రియను మరింత సరళీకరించేందుకు పరిశ్రమల పారిశ్రామికవేత్తల మెమొరాండం (ఐఈఎం)ను కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, జీఎస్‌టీఎన్ తదితర డేటాబేస్‌ల నుంచి వివరాలు సేకరించి ఆటోమేటిక్‌గా రూపొందిస్తున్నారు. దీనికి ప్రత్యేక విభాగం అనుమతి అవసరం లేదు. విదేశీ నిపుణుల కోసం ఈ-బీ4 ప్రొడక్షన్ వీసా స్పాన్సర్‌షిప్ లేఖలను కూడా ఎన్ఎస్‌డబ్ల్యూఎస్, వీసా పోర్టల్ అనుసంధానం ద్వారా రూపొందిస్తున్నారు.

డిజిటల్ విధానాలు, సులభతర నిబంధనలు, సింగిల్ విండో సేవలతో వ్యాపారాల స్థాపన, విస్తరణ, పెట్టుబడులకు అవసరమైన ప్రక్రియలను సరళీకరించడం, భౌతిక సంప్రదింపులను తగ్గించడం, పారదర్శకత పెంచడం, సేవలను నిర్ణీత గడువులో అందించడం ప్రభుత్వ సంస్కరణల లక్ష్యమని డీపీఐఐటీ పేర్కొంది.

# భారత్--నెదర్లాండ్స్ వాణిజ్య, పెట్టుబడి సంబంధాల బలోపేతంపై పీయూష్ గోయల్ చర్చలు

**న్యూఢిల్లీ, త్రినెట్ న్యూస్, అక్టోబర్ 27:**

నెదర్లాండ్స్ పర్యటనలో భాగంగా కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అక్టోబర్ 26న ఆ దేశ ప్రభుత్వ నేతలు, పార్లమెంటు సభ్యులు, ప్రముఖ కంపెనీల ప్రతినిధులతో ఉన్నతస్థాయి సమావేశాలు నిర్వహించారు. భారత్--నెదర్లాండ్స్ ఆర్థిక సహకారాన్ని విస్తరించడం, వాణిజ్యం, పెట్టుబడులకు కొత్త అవకాశాలను గుర్తించడం ఈ చర్చల ప్రధాన ఉద్దేశం.

నెదర్లాండ్స్ విదేశీ వాణిజ్యం, అభివృద్ధి సహకార శాఖ మంత్రి షోర్డ్ షోర్డ్‌స్మా, ఆర్థిక వ్యవహారాలు, వాతావరణ శాఖ మంత్రి హీలెన్ హెర్బర్ట్, ఉత్తర హాలండ్ ప్రావిన్స్ కింగ్స్ కమిషనర్ ఆర్థర్ వాన్ డైక్‌తో పీయూష్ గోయల్ సమావేశమయ్యారు. ఆ దేశ దిగువ సభ విదేశీ వాణిజ్యం, అభివృద్ధి సహకార కమిటీ, సెనెట్ యూరోపియన్ వ్యవహారాల కమిటీ సభ్యులతోనూ చర్చించారు. ద్వైపాక్షిక ఆర్థిక సంబంధాలు, వాణిజ్యం, పెట్టుబడులు, భారత్--యూరోపియన్ యూనియన్ ఆర్థిక భాగస్వామ్యంపై అభిప్రాయాలు పంచుకున్నారు.

భారత్--నెదర్లాండ్స్ బిజినెస్ ఫోరమ్‌కు పీయూష్ గోయల్, నెదర్లాండ్స్ మంత్రి షోర్డ్ షోర్డ్‌స్మా సంయుక్తంగా అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో భారత, డచ్ వ్యాపార రంగాలకు చెందిన ప్రముఖులతో కలిపి సుమారు 200 మంది పాల్గొన్నారు. భారత్--ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ద్వారా లభించే అవకాశాలు, మార్కెట్ ప్రవేశం, పెట్టుబడి భాగస్వామ్యాలు, కీలక రంగాల్లో సహకారంపై చర్చించారు. ఇరు దేశాల పరిశ్రమల మధ్య మరింత ప్రత్యక్ష భాగస్వామ్యంతో వ్యాపార ఒప్పందాలు, పెట్టుబడులు, భారత్--యూరప్ సరఫరా గొలుసుల అనుసంధానాన్ని బలోపేతం చేయాలని అభిప్రాయపడ్డారు.

సెమీకండక్టర్ సాంకేతికత, ఎలక్ట్రానిక్స్, లాజిస్టిక్స్, ఇంధనం, పారిశ్రామిక పరిష్కారాలు, సాంకేతికత, రిటైల్ రంగాలకు చెందిన డచ్ కంపెనీల ముఖ్య కార్యనిర్వాహకులతో మంత్రి విడివిడిగా సమావేశమై వ్యాపార ప్రాధాన్యాలు, సహకార అవకాశాలపై చర్చించారు. భారత రాయబార కార్యాలయం, హెచ్ఎస్‌బీసీ నెదర్లాండ్స్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో 15 డచ్ కంపెనీల సీనియర్ కార్యనిర్వాహకులతో రౌండ్‌టేబుల్ సమావేశంలోనూ పాల్గొన్నారు. భారత్‌లో పెట్టుబడులు, వాణిజ్య భాగస్వామ్యాలు, ప్రైవేటు రంగాల మధ్య సహకార విస్తరణపై చర్చలు జరిగాయి.

భారత్--నెదర్లాండ్స్ సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి పెంచడం, భారత్--ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదరడంతో ఆర్థిక సంబంధాల్లో కొత్త ఊపు వచ్చిందని మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ పీయూష్ గోయల్ పేర్కొన్నారు. వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతిక భాగస్వామ్యాల విస్తరణకు అపార అవకాశాలున్నాయని, యూరప్ మార్కెట్లకు నెదర్లాండ్స్ కీలక ద్వారంగా నిలుస్తుందని ఆయన తెలిపారు. భారత ఆర్థిక వృద్ధి, పెట్టుబడి అవకాశాలను ప్రస్తావిస్తూ నెదర్లాండ్స్, యూరోపియన్ యూనియన్‌తో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు భారత్ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# కేంద్ర హోంమంత్రి తో గవర్నర్ భేటీ



**హైదరాబాద్, త్రినెట్ న్యూస్,**

అక్టోబర్ 27: తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కేంద్ర హోంమంత్రితో గవర్నర్ భేటీ అయ్యారు.

# బీహార్ గ్రామీణ బ్యాంకు ఉద్యోగులకు రూ.77.69 కోట్ల ప్రయోజనాలు

**న్యూఢిల్లీ, త్రినెట్ న్యూస్, అక్టోబర్ 27:**



బీహార్ గ్రామీణ బ్యాంకు యాజమాన్యం, ఉద్యోగ సంఘాల మధ్య నెలకొన్న రెండు పారిశ్రామిక వివాదాలు సయోధ్య చర్చలతో పరిష్కారమయ్యాయి. అక్టోబర్ 22, 23 తేదీల్లో కేంద్ర కార్మిక కమిషనర్ కార్యాలయం ఆధ్వర్యంలో పాట్నాలోని సహాయ కార్మిక కమిషనర్ (సెంట్రల్) ఈ చర్చలు నిర్వహించారు.ఈ ఒప్పందాల ద్వారా బీహార్ గ్రామీణ బ్యాంకులో పనిచేస్తున్న 10,900 మందికి పైగా ఉద్యోగులకు సుమారు రూ.77.69 కోట్ల ఆర్థిక ప్రయోజనాలు అందనున్నాయి. వీటిలో బీహార్ గ్రామీణ బ్యాంకు వర్కర్స్ ఆర్గనైజేషన్‌తో కుదిరిన ఒప్పందం ద్వారా ఏటా పునరావృతమయ్యే ప్రయోజనాలు సుమారు రూ.9.02 కోట్లుగా ఉంటాయని అధికారులు తెలిపారు.

అక్టోబర్ 22న బీహార్ గ్రామీణ బ్యాంకు అధికారుల సంఘం, పాట్నా, బ్యాంకు యాజమాన్యం మధ్య మొదటి ఒప్పందం కుదిరింది. దీనివల్ల సుమారు 8,400 మంది ఉద్యోగులకు రూ.67.17 కోట్ల మేర ప్రయోజనం చేకూరనుంది. పనితీరు ఆధారిత ప్రోత్సాహకం (పీఎల్ఐ), అదనపు బాధ్యతల భత్యం, వేతనాల పెంపు, ప్రయాణ భత్యం పెంపు, పదోన్నతులు, కారుణ్య నియామకాలు వంటి అంశాలు ఈ ఒప్పందంలో ఉన్నాయి.

అక్టోబర్ 23న బీహార్ గ్రామీణ బ్యాంకు వర్కర్స్ ఆర్గనైజేషన్ (బీజీబీడబ్ల్యూఓ), బ్యాంకు యాజమాన్యం మధ్య రెండో ఒప్పందం జరిగింది. దీని ద్వారా సుమారు 2,500 మంది ఉద్యోగులకు రూ.10.52 కోట్ల ప్రయోజనాలు అందనున్నాయి. ఇందులో ఏటా లభించే ప్రయోజనాలు సుమారు రూ.9.02 కోట్లు. 12వ ద్వైపాక్షిక ఒప్పందం అమలు, ఇంటి అద్దె భత్యం (హెచ్ఆర్ఏ) పెంపు, దివ్యాంగ ఉద్యోగులకు రవాణా భత్యం పెంపు, ఓవర్‌టైమ్ చెల్లింపులు, పదోన్నతుల్లో పారదర్శకత, చర్చల మండలి ఏర్పాటు తదితర అంశాలపై అంగీకారం కుదిరింది.

ఉద్యోగ సంఘాలు, బ్యాంకు యాజమాన్యం చర్చల్లో చురుకుగా పాల్గొనడంతో వివాదాలు సామరస్యంగా పరిష్కారమయ్యాయని కార్మిక శాఖ పేర్కొంది. ఉద్యోగుల ప్రయోజనాల పరిరక్షణ, న్యాయమైన కార్మిక విధానాల ప్రోత్సాహం, పరిశ్రమల్లో సుహృద్భావ సంబంధాల బలోపేతానికి ఈ సయోధ్య చర్యలు దోహదపడతాయని తెలిపింది.

# జలశక్తి శాఖ ప్రాజెక్టుల పురోగతిపై మంత్రి సి.ఆర్. పాటిల్ సమీక్ష

**న్యూఢిల్లీ, త్రినెట్ న్యూస్, అక్టోబర్ 27:**




జలశక్తి శాఖ పరిధిలోని ప్రాజెక్టులు, పథకాలు, కార్యక్రమాల పురోగతిపై కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్. పాటిల్ సమీక్ష నిర్వహించారు. జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌధరి సమక్షంలో, జలవనరులు, నదుల అభివృద్ధి, గంగా పునరుజ్జీవన శాఖ ఉన్నతాధికారులతో ఈ సమావేశం జరిగింది.

సమావేశంలో వరద నిర్వహణ విభాగం, ఫరక్కా బ్యారేజ్ ప్రాజెక్టు, జాతీయ జల మిషన్, కమాండ్ ఏరియా అభివృద్ధి--జల నిర్వహణ ఆధునీకరణ (ఎం-క్యాడ్‌డబ్ల్యూఎం), బేసిన్ మేనేజ్‌మెంట్, జాతీయ జల అభివృద్ధి సంస్థ, కెన్--బెత్వా లింక్ ప్రాజెక్టు అథారిటీ, బ్రహ్మపుత్ర--బరాక్ నదుల వ్యవహారాలు, బ్రహ్మపుత్ర బోర్డు, చిన్నతరహా సాగునీటి గణాంకాలు, జాతీయ జలవిజ్ఞాన సంస్థ తమ ప్రాజెక్టులు, కార్యకలాపాలపై ప్రజెంటేషన్లు ఇచ్చాయి.వరద నిర్వహణ, సరిహద్దు ప్రాంతాల కార్యక్రమం (ఎఫ్ఎంబీఏపీ) కింద పనుల పురోగతి, ఫరక్కా బ్యారేజ్ గేట్ల మార్పిడి, కోత నివారణ చర్యలు, జాతీయ జల మిషన్ ప్రాధాన్య కార్యక్రమాలు, ఎం-క్యాడ్‌డబ్ల్యూఎం కింద 35 పైలట్ క్లస్టర్ల అమలు, కెన్--బెత్వా లింక్ ప్రాజెక్టులో భాగంగా లింక్ కెనాల్, దౌధన్ డ్యామ్ పనుల స్థితిగతులపై చర్చించారు. బ్రహ్మపుత్ర బోర్డు మాస్టర్ ప్లాన్లు, డీపీఆర్‌ల తయారీ, చిన్నతరహా సాగునీటి గణాంకాల కార్యక్రమం కింద కొనసాగుతున్న నాలుగు జనగణనల పురోగతి, జాతీయ జలవిజ్ఞాన సంస్థ లక్ష్యాలు, కార్యక్రమాలపైనా సమీక్షించారు.ప్రాజెక్టుల అమలులో ఎదురవుతున్న అడ్డంకులను గుర్తించి త్వరితగతిన పరిష్కరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పనులు నిర్ణీత గడువులో పూర్తయ్యేలా రాష్ట్రాలతో సమన్వయం పెంచాలని సూచించారు. సమీక్షలో తీసుకున్న నిర్ణయాలపై సంబంధిత విభాగాలు, సంస్థల అధిపతులు నిరంతర పర్యవేక్షణతో సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని, నిర్ణీత కాలవ్యవధిలో ఆశించిన ఫలితాలు సాధించాలని స్పష్టం చేశారు.

# కేంద్ర విజిలెన్స్ కమిషన్ ఆధ్వర్యంలో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్

**న్యూఢిల్లీ, త్రినెట్ న్యూస్, అక్టోబర్ 27:**



కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) ఆధ్వర్యంలో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్--2026 ప్రారంభమైంది. న్యూఢిల్లీలోని సతర్కతా భవన్‌లో ఉదయం 11 గంటలకు కేంద్ర విజిలెన్స్ కమిషనర్ ఏ.ఎస్. రాజీవ్, విజిలెన్స్ కమిషనర్ ప్రవీణ్ వశిష్ట కమిషన్ అధికారులు, సిబ్బందితో నిజాయితీ ప్రతిజ్ఞ చేయించారు.

ఈ ఏడాది అక్టోబర్ 26 నుంచి నవంబర్ 1 వరకు "సమృద్ధి కోసం నైతికత" అనే ఇతివృత్తంతో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్‌ను నిర్వహిస్తున్నారు.

విజిలెన్స్ వ్యవస్థను మరింత సమర్థంగా తీర్చిదిద్దేందుకు ఆగస్టు 17 నుంచి నవంబర్ 16 వరకు మూడు నెలల నివారణ విజిలెన్స్ ప్రచారాన్ని చేపట్టాలని కేంద్ర ప్రభుత్వంలోని అన్ని మంత్రిత్వ శాఖలు, విభాగాలు, సంస్థలకు కమిషన్ సూచించింది. ఈ ప్రచారంలో పెండింగ్ ఫిర్యాదులు, కేసుల పరిష్కారం, సామర్థ్య నిర్మాణ కార్యక్రమాలు, డిజిటల్ చర్యలు, ఒప్పందాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొంది.

విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్‌లో భాగంగా అక్టోబర్ 30న "సాంకేతికత ద్వారా పరివర్తన" అంశంపై ఒకరోజు కార్యశాలను కమిషన్ నిర్వహించనుంది.

# ప్రత్యేక ప్రచారం--6లో పెట్రోలియం శాఖ పురోగతి

**న్యూఢిల్లీ, త్రినెట్ న్యూస్, అక్టోబర్ 27:**

స్వచ్ఛత, పెండింగ్ అంశాల పరిష్కారంపై కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ ప్రత్యేక ప్రచారం--6లో గణనీయమైన పురోగతి సాధించింది. అక్టోబర్ 25 నాటికి అందిన వివరాల ప్రకారం, పలు అంశాల్లో 100 శాతం లక్ష్యాన్ని చేరుకుంది.

పరిశీలనకు గుర్తించిన 5,593 భౌతిక ఫైళ్ల సమీక్షను పూర్తి చేసింది. మరో 712 ఈ-ఫైళ్లను సమీక్షకు పంపింది. ప్రజా ఫిర్యాదుల అప్పీళ్లలో 500 పరిష్కరించి 100 శాతం పూర్తి చేసింది.

ప్రచారంలో భాగంగా 148 ప్రాంతాల్లో స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటివరకు 126 చోట్ల చేపట్టింది. కార్యాలయ స్థల వినియోగాన్ని మెరుగుపరిచే చర్యల్లో 1.15 లక్షల చదరపు అడుగుల లక్ష్యానికి మించి 2.22 లక్షల చదరపు అడుగుల స్థలాన్ని ఖాళీ చేసింది. ప్రచారం ద్వారా రూ.41 కోట్ల ఆదాయం సమకూర్చాలన్న లక్ష్యానికి గాను ఇప్పటివరకు రూ.34.64 కోట్లు సాధించింది.

ప్రజా సేవల పరిష్కారంలో 7,500 ఫిర్యాదుల లక్ష్యానికి గాను 6,006 ఫిర్యాదులను పరిష్కరించింది. ఇది 80.10 శాతం పురోగతి. ఈ-వ్యర్థాలు, స్క్రాప్ తొలగింపు, కార్యాలయాల పరిశుభ్రత, రికార్డుల సమర్థ నిర్వహణ, ఫిర్యాదుల సకాల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మంత్రిత్వ శాఖ తెలిపింది.

పెట్రోలియం శాఖకు చెందిన కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలు, ఇతర విభాగాలు ప్రచారంలో చురుకుగా పాల్గొనాలని సూచించింది. ప్రచారం పురోగతిని క్రమం తప్పకుండా పర్యవేక్షించి, పరిపాలనా సంస్కరణలు--ప్రజా ఫిర్యాదుల విభాగం ప్రారంభించిన ప్రత్యేక వెబ్ పోర్టల్‌లో నమోదు చేయనున్నట్లు పేర్కొంది. ?చ్ఛత, కార్యాలయ స్థలాల మెరుగైన వినియోగం, పెండింగ్ అంశాల సత్వర పరిష్కారంతో పరిపాలనా సామర్థ్యాన్ని పెంచడమే ఈ కార్యక్రమ లక్ష్యమని తెలిపింది.

# పనితీరులో మార్పు రాకపోతే కఠినచర్యలు తప్పవు

**భూ సమస్యల పరిష్కారంలో జాప్యాన్ని సహించేది లేదు**
**భూ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి**
**క్షేత్రస్థాయిలో సర్వేను పరిశీలించి రైతులకు భూమి విస్తీర్ణంపై స్పష్టత ఇవ్వాలి**
**రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సహించబోం**
**పెండింగ్ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలి**
**పేదల సొంతింటి కల సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం**
**రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:
రెవెన్యూ ఉద్యోగులు సక్రమంగా, బాధ్యతాయుతంగా పనిచేసినప్పుడే ప్రజల ముఖ్యంగా రైతుల సమస్యలు తీరుతాయని ఈ విషయంలో ఇప్పటికే పలుమార్లు రెవెన్యూ ఉద్యోగులను ఆదేశించినప్పటికీ పూర్తిస్థాయి ఫలితాలు కనిపించలేదని భవిష్యత్తులో మార్పురాకపోతే అధికారులు, ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
హెచ్చరించారు. మంగళవారం నాడు ఉమ్మడి మెదక్ జిల్లాలోని రెవెన్యూ, రిజిస్ట్రేషన్, హౌసింగ్ శాఖల పనితీరుపై సంగారెడ్డి కలెక్టరేట్‌లో మంత్రి పొంగులేటి సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు భూ రికార్డుల్లో పారదర్శకత తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం రీ సర్వే చేపట్టింది
భూ సర్వే నిర్వహణకు సంబంధించి పలువురు తహసీల్దార్లు,




సర్వేయర్లతో ముఖాముఖి నిర్వహించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సర్వే కోసం ఎన్ని గ్రామాలను కేటాయించారు, ఇప్పటివరకు ఎన్ని గ్రామాల్లో సర్వే పూర్తయింది, ఏ విధంగా సర్వే నిర్వహిస్తున్నారు, రోజుకు ఎన్ని ఎకరాల భూమిని సర్వే చేస్తున్నారు, సర్వే పూర్తి చేయడానికి ఎంత సమయం పడుతోంది తదితర అంశాలపై ఆరా తీశారు.
సర్వే సమయంలో సంబంధిత రైతుకు తన భూమి ఎంత విస్తీర్ణంలో ఉందో స్పష్టంగా తెలియజేయాలని తహసీల్దార్లు, సర్వేయర్లకు సూచించారు. భూమి విస్తీర్ణం, సరిహద్దులకు సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, రైతులకు ఎలాంటి సందేహాలు లేకుండా వివరించాలని పేర్కొన్నారు.
తహసీల్దార్ నుంచి జిల్లా కలెక్టర్ వరకు రెవెన్యూ అధికారులు సర్వే ప్రక్రియను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సర్వే పనుల పురోగతిని స్వయంగా పరిశీలిస్తూ, రైతుల సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకోవాలని ఆదేశించారు. భూ సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా, రైతులకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.
ఏడాదిన్నరలోపు వ్యవసాయ భూములతో పాటు ఆబాదీ ఆస్తుల రీ సర్వేను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. తొలి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో రీ సర్వే కొనసాగుతోందని, రీ సర్వే జరుగుతున్న గ్రామాల్లో జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించాలని సూచించారు.
రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల సాకారమయ్యే వరకు విడతలవారీగా ఇళ్ల మంజూరు కొనసాగుతుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులపై నిర్మాణ వ్యయ భారాన్ని తగ్గించేందుకు సిమెంట్ బ్యాగ్‌ను కేవలం రూ.230కే అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

**డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం**

అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని మంత్రిగారు ఆదేశించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులు వేగవంతంగా, పూర్తి పారదర్శకంగా, అర్హత ప్రాతిపదికన జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.
సమీక్షకు ముందు పలువురు ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాల్లో నెలకొన్న భూ సమస్యలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులకు సంబంధించిన అంశాలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలను పరిశీలించి పరిష్కరించేందుకు సంబంధిత జిల్లా కలెక్టర్లకు మంత్రి పలు సూచనలు చేశారు. ప్రజాప్రతినిధులు అందించిన సలహాలు, సూచనలను స్వీకరించారు.
ఈ సమావేశంలో ఎంపీ రఘునందన్ రావు, సురేశ్ షెట్కర్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, సునీతా లక్ష్మారెడ్డి, మాణిక్‌రావు, కొత్త ప్రభాకర్ రెడ్డి, సంజీవరెడ్డి ,సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల కలెక్టర్లు ప్రతీక్ జైన్, హైమావతి, ప్రతిమా సింగ్‌లతో పాటు అదనపు కలెక్టర్లు, సబ్ కలెక్టర్, రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణలో మళ్లీ అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ పార్టీనే

**వచ్చే ఎన్నికల్లో 100 సీట్లే మా లక్ష్యం.. బీజేపీకి రెండు ఎంపీ సీట్లు వస్తే ఎక్కువ: టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్**



హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:
తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయిలో బలంగా ఉందని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 100 సీట్లు సాధించడమే తమ లక్ష్యమని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదని, ప్రస్తుతం ఆ పార్టీకి ఉన్న ఎనిమిది ఎంపీ సీట్లలో వచ్చే ఎన్నికల్లో రెండు స్థానాలు గెలుచుకున్నా ఎక్కువేనని వ్యాఖ్యానించారు. అలాగే బీజేపీకి చెందిన ఎనిమిది మంది ఎమ్మెల్యేల్లో ఒక్కరు కూడా గెలిచే పరిస్థితి ఉండదని అన్నారు. తాజాగా నిర్వహించిన చిట్‌చాట్‌లో మహేష్ కుమార్ గౌడ్ రాష్ట్ర రాజకీయాలు, కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు, ప్రతిపక్ష పార్టీల వైఖరిపై తన అభిప్రాయాలను వెల్లడించారు. తెలంగాణలో మరోసారి అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ పార్టీయేనని ఆయన స్పష్టం చేశారు.

**వచ్చే ఎన్నికల్లో 100 సీట్లే టార్గెట్**

రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 100 స్థానాలు సాధించడమే తమ లక్ష్యమని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల పథకం, ఉద్యోగ నియామకాలు తమకు రాజకీయంగా బలాన్నిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ఈ పథకాల ద్వారా లబ్ధి పొందినవారితో పాటు 90 వేల ఉద్యోగాలు పొందినవారు కూడా కాంగ్రెస్‌కు మద్దతుగా ఉంటారని పేర్కొన్నారు. ప్రభుత్వాలు వస్తుంటాయి, పోతుంటాయని, కానీ రాజకీయ పార్టీ శాశ్వతంగా ఉంటుందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీనే తమకు ప్రధాన బలమని, క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టంగా ఉందని చెప్పారు.

**బీజేపీకి భవిష్యత్తు లేదంటూ వ్యాఖ్యలు**

తెలంగాణలో బీజేపీ బలం తగ్గుతోందని మహేష్ కుమార్ గౌడ్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఆ పార్టీకి ఉన్న ఎనిమిది ఎంపీ స్థానాల్లో రెండు గెలిచినా ఎక్కువేనని, ఎనిమిది మంది ఎమ్మెల్యేల్లో ఒక్కరు కూడా తిరిగి గెలిచే పరిస్థితి లేదని వ్యాఖ్యానించారు. ఆదిలాబాద్, నిజామాబాద్ ప్రాంతాల్లో 40 శాతం సీట్లు కాంగ్రెస్‌కే వస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

**కేటీఆర్, హరీశ్ రావుపై విమర్శలు**

బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావు రాజకీయ భ్రమల్లో ఉన్నారని, క్షేత్రస్థాయి వాస్తవాలను అర్థం చేసుకోవడం లేదని మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులపై వాస్తవిక అంచనా లేకుండా వారు మాట్లాడుతున్నారని అన్నారు.
మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మేధావిగా భావిస్తామని, అయితే ఆలోచన లేకుండా అప్పులు చేశారని విమర్శించారు. ఎల్‌నినో ప్రభావంపై హరీశ్ రావు చేస్తున్న వ్యాఖ్యలను కూడా ఆయన తప్పుబట్టారు. ఎల్‌నినో ప్రభావం దేశవ్యాప్తంగా ఉందని పేర్కొన్నారు.

**నవంబర్‌లో సమస్యలకు పరిష్కారం**

రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న సమస్యలకు నవంబర్‌లో పరిష్కారం లభిస్తుందని మహేష్ కుమార్ గౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు. నవంబర్ తర్వాత తమ దృష్టి నేరుగా ఎన్నికలపై ఉంటుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి తమకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారని, కాంగ్రెస్ పార్టీలో ఉన్న సమన్వయం దేశంలో మరెక్కడా లేదని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేస్తున్నారని, ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తాను గమనించానని తెలిపారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తున్నారని చెప్పారు.
,తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ మరోసారి అధికారాన్ని నిలబెట్టుకుంటుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేసిన మహేష్ కుమార్ గౌడ్, ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొడుతూ వచ్చే ఎన్నికల్లో 100 సీట్ల లక్ష్యంతో ముందుకు సాగుతామని స్పష్టం చేశారు.

# ఇన్వెస్ట్ తెలంగాణ--గ్లోబల్ సమ్మిట్--2026కు 550కి పైగా దేశీయ, అంతర్జాతీయ దిగ్గజ సంస్థలకు ఆహ్వానాలు

**న్యూఢిల్లీలో అక్టోబర్ 29న గ్లోబల్ సమ్మిట్ కర్టెన్ రైజర్ కార్యక్రమం**

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్,
అక్టోబర్ 27: భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణా--గ్లోబల్ సమ్మిట్--2026లో పాల్గొనాల్సిందిగా 550కి పైగా దేశీయ, అంతర్జాతీయ దిగ్గజ కంపెనీలను ఆహ్వానిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వెల్లడించారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు సంబంధించి వివిధ కమిటీల ద్వారా చేపడుతున్న ఏర్పాట్ల పురోగతిపై మంగళవారం డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీనియర్ అధికారులు నవీన్ మిట్టల్, హరిచందన, గౌరవ్ ఉప్పల్, సర్ఫరాజ్ అహ్మద్, కృష్ణ ఆదిత్య, అనుదీప్, శశాంక, కృష్ణ భాస్కర్, వల్లూరి క్రాంతి, అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దడం, భారీ పెట్టుబడులను ఆకర్షించడం, పారిశ్రామిక అభివృద్ధికి కొత్త అవకాశాలను సృష్టించడం, యువతకు విస్తృతంగా ఉపాధి అవకాశాలు కల్పించడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఇన్వెస్ట్ తెలంగాణ --గ్లోబల్ సమ్మిట్--2026ను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోందని తెలిపారు.
ఈ సమ్మిట్‌కు విస్తృత అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడంలో భాగంగా అక్టోబర్ 29న న్యూఢిల్లీలో కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ



కార్యక్రమంలో గౌరవ ముఖ్యమంత్రి. ఎ. రేవంత్ రెడ్డి పాల్గొంటారని, వివిధ దేశాల రాయబారులు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు, దిగ్గజ కంపెనీల అధిపతులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. అంతర్జాతీయ పెట్టుబడిదారులతో సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి, తెలంగాణలో అందుబాటులో ఉన్న పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి పరిచయం చేయడానికి ఈ కార్యక్రమం కీలక వేదికగా నిలవనుందని పేర్కొన్నారు. ఇప్పటికే చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ నగరాల్లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్--2026పై రోడ్‌షోలను నిర్వహించినట్లు తెలిపారు. హైదరాబాద్‌లో జరగనున్న ప్రధాన సమ్మిట్‌కు 1,500కు పైగా కంపెనీలు, సంస్థల ప్రతినిధులను ఆహ్వానిస్తున్నామని చెప్పారు.

**రక్షణ, ఏరోస్పేస్ రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యం**

గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా నిర్వహించనున్న రక్షా ఎక్స్ పోలో పాల్గొనేందుకు ప్రపంచవ్యాప్తంగా ఏరోస్పేస్, రక్షణ రంగాలకు చెందిన సుమారు 100 కంపెనీలు, సంస్థలను ఆహ్వానిస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి తెలిపారు. ఆయా సంస్థలకు ఇప్పటికే ప్రత్యేక ఆహ్వానాలు పంపామని, ఆహ్వాన ప్రక్రియ కొనసాగుతోందని వెల్లడించారు. ఈ ఎక్స్ పో లో తెలంగాణలోని ఏరోస్పేస్, రక్షణ రంగాల ప్రతినిధులు పాల్గొంటారు.

**సమ్మిట్ నిర్వహణకు పటిష్ఠ ఏర్పాట్లు**

ఫ్యూచర్ సిటీలో సమ్మిట్ జరిగే ప్రధాన వేదికను 25 సెక్టార్లుగా విభజించి, ప్లీనరీ సమావేశాలు, సెమినార్లు, చర్చలు, ఒప్పందాల కార్యక్రమాలు, ఎగ్జిబిషన్లు, వివిధ కంపెనీలు సంస్థల ప్రదర్శనలకు అవసరమైన వసతులను ప్రణాళికాబద్ధంగా ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు, కళా వైభవాన్ని ప్రతిబింబించేలా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను కూడా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమ్మిట్‌కు హాజరయ్యే దేశీయ, అంతర్జాతీయ ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రవాణా, వసతి, సమావేశాల నిర్వహణతో పాటు అవసరమైన అన్ని ఏర్పాట్లను సమన్వయంతో చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ప్రతినిధికి సమన్వయ బాధ్యతలు నిర్వహించేందుకు ఒక సీనియర్ అధికారిని నోడల్ అధికారిగా నియమించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇన్వెస్ట్ తెలంగాణా--గ్లోబల్ సమ్మిట్--2026ను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ, ఏర్పాట్లను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ప్రధాన కార్యదర్శి అధికారులకు సూచించారు.

# ఎల్‌నినో, కరువు పరిస్థితులపై నేడే అఖిలపక్ష భేటీ

**భట్టి విక్రమార్క అధ్యక్షతన సమావేశం.. కరువు నివారణ చర్యలపై చర్చ**

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:
రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం లోటు, కరువు పరిస్థితులపై చర్చించేందుకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించనుంది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన మధ్యాహ్నం 2.30 గంటలకు హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఆరో అంతస్తులోని గది నంబర్ 33లో ఈ సమావేశం జరగనుంది. రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులు, వర్షపాతం లోటు నేపథ్యంలో ప్రజలు, రైతులపై పడే ప్రభావాన్ని తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించనున్నారు. తాగునీటి సరఫరా, నీటి వనరుల పరిరక్షణ, సాగునీటికి విద్యుత్ సరఫరా, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక వంటి కీలక అంశాలపై రాజకీయ పార్టీల నేతల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించనున్నారు. కరువు నివారణకు అనుసరించాల్సిన వ్యూహాలు, అవసరమైన ముందస్తు చర్యలపై అఖిలపక్ష నేతల అభిప్రాయాలను ప్రభుత్వం తెలుసుకోనుంది. రాష్ట్రంలో కరువు పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ప్రభుత్వం కోరనుంది.

# జ్యోతి జ్ఞాపకాలతో కన్నీటి పర్యంతమైన పూర్వ విద్యార్థులు

**•పాటలతో అలరించిన స్నేహితురాలు**
**ఇక లేదని తలుచుకుంటూ భావోద్వేగం**

చిన్ననాటి నుంచే పాటలంటే ఎంతో ఇష్టపడుతూ, ఆటపాటలతో తోటి విద్యార్థులను అలరించిన మద్దెల జ్యోతి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ పూర్వ విద్యార్థులు కన్నీటి పర్యంతమవుతున్నారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం గోపాలపూర్ గ్రామానికి చెందిన జ్యోతి 15 సంవత్సరాల పాటు అంగన్‌వాడీ టీచర్‌గా సేవలందించారు. వివాహం అనంతరం కొత్తకొండ ధర్మారం గ్రామంలో నివసించారు. రెండేళ్ల క్రితం జ్యోతి మృతి చెందగా, ఆ తర్వాత అనారోగ్య కారణాలతో ఆమె భర్త కూడా మరణించడంతో కుటుంబంలో తీరని విషాదం నెలకొంది. వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. 1987--88 విద్యా



సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న సమయంలో 85 మంది సహచర విద్యార్థులకు జ్యోతి ఎంతో ఆత్మీయురాలు. తరగతి గదిలో మైక్ పట్టుకుని అంబేద్కర్ పాటలు పాడుతూ అందరినీ ఆకట్టుకునేది. కబడ్డీ, ఖోఖో ఆటల్లోనూ చురుగ్గా పాల్గొనేది. ప్రస్తుతం ఆమె పాటల వీడియోలను చూస్తున్న పూర్వ విద్యార్థులు పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ భావోద్వేగానికి గురవుతున్నారు. "జ్యోతి పాటలు, నవ్వులు, పాఠశాల రోజులు ఇప్పటికీ మా కళ్లముందు కదలాడుతున్నాయి. ఆమెను మర్చిపోవడం మా వల్ల కావడం లేదు" అంటూ స్నేహితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జ్యోతి భౌతికంగా దూరమైనా, ఆమెతో గడిపిన మధుర జ్ఞాపకాలు తమ హృదయాల్లో ఎప్పటికీ నిలిచిపోతాయని పూర్వ విద్యార్థులు పేర్కొంటున్నారు.

# యువత మత్తుకు దూరంగా ఉండి మైదానాల వైపు రావాలి:

**ఎంపీ ఎం. అనిల్ కుమార్ యాదవ్**

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా తెలంగాణ క్రీడా శాఖ చేపట్టిన 'ఖేలో తెలంగాణ' కార్యక్రమంలో యువత, విద్యార్థులు నిరంతరం పాల్గొనాలని రాజ్యసభ సభ్యుడు ఎం. అనిల్ కుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ క్రీడలు, వ్యాయామం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా క్రీడలు, ఫిట్‌నెస్‌పై అవగాహన



కల్పిస్తున్న తెలంగాణ క్రీడా శాఖను ఆయన అభినందించారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క, మంత్రి శ్రీధర్ బాబుతో పాటు ముషీరాబాద్ నియోజకవర్గ విద్యార్థులు, యువతకు ఎం. అనిల్ కుమార్ యాదవ్ ఫిట్‌నెస్ ఛాలెంజ్ విసిరారు.
జీఎంసీబీ స్టేడియం అడ్మినిస్ట్రేటర్ కన్నం మధు
పీఆర్‌ఓ స్పోర్ట్స్ అథారిటీ సురేష్ కాలేరు తదితరులు పాల్గొన్నారు.

# జవహర్ నగర్, చంద్రపురి డివిజన్లలో ఎమ్మార్పీఎస్ కమిటీలకు కొత్త సారథులు

ఎమ్మార్పీఎస్ సంస్థాగత బలోపేతంలో భాగంగా జవహర్ నగర్, చంద్రపురి డివిజన్లకు నూతన కమిటీలను ఎన్నుకున్నారు. పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇంచార్జ్ తిప్పారపు లక్ష్మణ్ మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు కేశపాగ రాంచందర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పంగ ప్రభు కుమార్ మాదిగ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కాప్రా మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు బట్టల పరమేశ్వర్ మాదిగ అధ్యక్షత వహించగా, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ సమన్వయం చేశారు. నూతన నియామకాల్లో భాగంగా జవహర్ నగర్ డివిజన్ అధ్యక్షుడిగా వెంకటాపురం ఉపేందర్, అధికార ప్రతినిధిగా రాజేష్, చంద్రపురి డివిజన్ అధ్యక్షుడిగా శివ కేశవ్, అధికార ప్రతినిధిగా శ్రీను ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొయ్యడ వెంకటేష్, సునీల్, గజ్జెల రాంచందర్, ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడు కొత్త నరేష్, ఎమ్మార్పీఎస్ మండల అధికార ప్రతినిధి రమేష్, అంజయ్య,



నరహరితో పాటు వివిధ కాలనీల అధ్యక్షులు పాల్గొన్నారు. నూతన కమిటీ సభ్యులు సంఘం అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

# నిత్యావసరాలను తక్కువ ధరలకు అందించాలి

**మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లో మొబైల్ వాహనాల ద్వారా ధరణి బ్రాండ్ బియ్యం**
**బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరల నియంత్రణపై రైస్ మిల్లర్లు, హోల్‌సేల్ అసోసియేషన్లతో చర్చలు**
**రేషన్ షాపుల ద్వారా కందిపప్పు, పామాయిల్, గోధుమ పిండి సరఫరాకు నిర్ణయం**
**కిలో కందిపప్పు రూ.100, గోధుమ పిండి రూ.25, లీటర్ పామాయిల్ రూ.125**
**ఉల్లి ధర మరింత తగ్గించేలా చర్యలు**
**సీఎం చంద్రబాబు సమీక్ష**



**అమరావతి, ట్రైనెట్ న్యూస్,** అక్టోబరు 27: రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించి, సామాన్య ప్రజలకు అందుబాటు ధరల్లో సరుకులు అందించడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించారు. వివిధ నిత్యావసర వస్తువుల ధరలను వీలైనంత తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరలను నియంత్రించే అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించారు. భవిష్యత్తులో నిత్యావసర వస్తువుల సరఫరా ప్రణాళికలపై చర్చించారు. పౌరసరఫరాల శాఖతో పాటు... వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులతో జరిపిన సమీక్షలో ధరల నియంత్రణకు సంబంధించి కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ మేరకు బియ్యం, కందిపప్పు, పామాయిల్, గోధుమ పిండి వంటి నిత్యావసరాలను తక్కువ ధరలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ధరణి బ్రాండ్ పేరుతో విక్రయిస్తున్న సూపర్ ఫైన్ బియ్యాన్ని రైతుబజార్లకే పరిమితం చేయకుండా మున్సిపాలిటీలు, మండల కేంద్రాలకు విస్తరించాలని ముఖ్యమంత్రి సూచించారు. అలాగే ధరణి బియ్యాన్ని మొబైల్ వాహనాల ద్వారా ప్రజలకు చేరువ చేయాలని స్పష్టం చేశారు. ఫైన్, సూపర్ ఫైన్ రకం బియ్యాన్ని కిలో రూ.49, రూ.50కు విక్రయించాలన్నారు. ఇక బహిరంగ మార్కెట్టులో కూడా బియ్యం ధరలను అదుపులో ఉంచేందుకు సీఎం ఆదేశాలతో మిల్లర్లు, హోల్ సేల్ అసోసియేషన్ ప్రతినిధులతో చర్చిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వివిధ రకాల బియ్యం ధరలను తగ్గించి వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురావడానికి మిల్లర్లు, హోల్ సేల్ అసోసియేషన్ ప్రతినిధులు అంగీకరించినట్టు అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. బీపీటీ రకం స్టీమ్ బియ్యాన్ని కిలో రూ.66కు, సాధారణ రకం స్టీమ్ బియ్యాన్ని కిలో రూ.47కు మించకుండా విక్రయిస్తామని మిల్లర్లు అంగీకరించారని చెప్పారు. ప్రస్తుతం మార్కెట్‌లో బియ్యం ధరలు పెరుగుతున్న నేపథ్యంలో, ధరణి బ్రాండ్ ద్వారా తక్కువ ధరలకు నాణ్యమైన బియ్యాన్ని అందించడంతో పాటు, ఇతర రకాల బియ్యం ధరలపైనా నియంత్రణ ఉండేలా చూడాలని సీఎం ఆదేశించారు. పొరుగు రాష్ట్రాలకు అక్రమంగా ధాన్యం తరలిపోకుండా అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులు, టోల్‌గేట్ల వద్ద నిఘా పెంచాలని, ధాన్యం, బియ్యంపై మార్కెట్ సెస్సు భారాన్ని తగ్గించే అంశాన్ని పరిశీలించాలని సూచించారు.

**దీపావళి నాటికి రేషన్ షాపుల ద్వారా నిత్యావసరాలు**

కందిపప్పు ధరలను తగ్గించేందుకు తీసుకున్న చర్యలను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. రేషన్ కార్డుదారులకు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా నెలకు కిలో కందిపప్పును రూ.100కే అందించేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుతం మార్కెట్‌లో కందిపప్పు కిలో రూ.170 నుంచి రూ.200 వరకు పలుకుతున్న నేపథ్యంలో, ప్రభుత్వ జోక్యంతో ధరల భారాన్ని తగ్గించేలా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. దీనికి సంబంధించి కేంద్రం నుంచి అవసరమైన సహాయాన్ని తీసుకోవాలని సీఎం నిర్దేశించారు. రేషన్ షాపుల ద్వారా కందిపప్పు సరఫరాకు అవసరమైన ఏర్పాట్లను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. పామాయిల్ ధరలను తగ్గించి సామాన్యులకు అందుబాటులోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి చెప్పారు. రేషన్ డిపోల ద్వారా లీటరు పామాయిల్‌ను రూ.125కే అందించేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. దీని కోసం అవసరమైన పామాయిల్‌ను టెండర్ల ద్వారా సేకరించి సరఫరా చేసే ప్రక్రియ చేపట్టాలన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో వంటనూనెల ధరలు పెరిగిన నేపథ్యంలో, ప్రభుత్వ సరఫరా ద్వారా వినియోగదారులకు ఉపశమనం కలిగించాలని పేర్కొన్నారు. అదేవిధంగా గోధుమ పిండిని కూడా రేషన్ దుకాణాల ద్వారా కిలో రూ.25కే అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కందిపప్పు, పామాయిల్, గోధుమ పిండి వంటి నిత్యావసరాలను దీపావళి పండుగ నాటికి రేషన్ షాపుల ద్వారా అందించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

**ఉల్లి ధరలు తగ్గుముఖం పట్టే అవకాశం**

ఉల్లి ధరల నియంత్రణపై అధికారులు తీసుకున్న చర్యలపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. ఉల్లి ధరలను నియంత్రించేందుకు ప్రభుత్వం ఇప్పటికే మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీం ద్వారా రైతుబజార్లల్లో కిలో రూ.35కే విక్రయిస్తోన్నట్టు అధికారులు తెలిపారు. రానున్న రోజుల్లో మరో 800 మెట్రిక్ టన్నుల ఉల్లిని అందుబాటులోకి తీసుకువచ్చి ప్రజలకు సరఫరా చేయనున్నట్లు వెల్లడించారు. వచ్చే కాలంలో కర్నూలు ప్రాంతం నుంచి ఉల్లి పంట మార్కెట్‌లోకి అందుబాటులో వస్తే సరఫరా పెరిగి ధరలు తగ్గే అవకాశం ఉందని వివరించారు. ఉల్లి ధరల పెరుగుదలతో ఇబ్బందులు పడుతున్న వినియోగదారులకు ఉపశమనం కలిగేలా సరఫరాను నిరంతరం పర్యవేక్షించాలని సీఎం సూచించారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన చోట ప్రభుత్వ జోక్యం ఉండాలని సీఎం స్పష్టం చేశారు. ధరల నియంత్రణకై తీసుకుంటున్న ఈ చర్యలతో నెలకు సుమారు రూ. 100 కోట్ల భారం ప్రభుత్వంపై పడుతుందని అధికారులు సీఎంకు వివరించారు. ప్రభుత్వానికి భారమైనా సరే... ధరల పెరుగుదల నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించాలని ముఖ్యమంత్రి చెప్పారు. ప్రజలకు నాణ్యమైన సరుకులు సరసమైన ధరలకు అందేలా సరఫరా వ్యవస్థను బలోపేతం చేయాలని, ధరల నియంత్రణ చర్యల ప్రయోజనాలు నేరుగా వినియోగదారులకు చేరేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో సీఎస్ సాయి ప్రసాద్, పౌర సరఫరాల శాఖ కార్యదర్శి కన్నబాబు సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రైతులు సంఘటితమైతేనే మంచి ధర, మార్కెట్ సౌకర్యం: 'రైతు నేస్తం'లో రైతు సంఘాలకు ప్రత్యేక అవగాహన

**- రైతు ఉత్పత్తిదారుల సంఘాల బలోపేతానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది: వ్యవసాయ ఉత్పత్తి కమిషనర్ ఉవ్యవసాయ శాఖ కార్యదర్శి కె. సురేంద్ర మోహన్, ఐ.ఏ.ఎస్.**
**- సంఘాల ఆధ్వర్యంలో కస్టమ్ హైరింగ్ సెంటర్లు: చిన్న రైతులకు అద్దెకు యంత్రాలు, సంఘాలకు ఆదాయం**
**- గెర్కిన్స్, మునగ పొడి ఎగుమతుల్లో రైతులకు అధిక ఆదాయ మార్గాలు**
**- ఎల్‌నినో ప్రత్యామ్నాయ ప్రణాళిక, నేల సంరక్షణకు 'ఖేత్ బచావో అభియాన్'**



**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:** పంట పండించడం ఒక ఎత్తయితే, పండిన పంటను మంచి ధరకు అమ్ముకోవడం మరో ఎత్తు. ఒక్కడిగా మార్కెటింగ్ చేసుకునే రైతుకు మంచి ధర, మెరుగైన మార్కెట్ సౌకర్యాలు, పంటకు డిమాండ్ దొరకడం కష్టమవుతోంది. రైతులంతా కలిసి రైతు ఉత్పత్తిదారుల సంఘాలుగా (ఫీఓాలు) ఏర్పడినా, మహిళా స్వయం సహాయక సంఘాలు (ాఎఎ+లు), ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (ాాజా) సభ్యులుగా చేరినా ఈ ఇబ్బందులు తగ్గుతాయని వ్యవసాయ శాఖ స్పష్టం చేసింది. సంఘటితంగా ఉంటే పంటకు డిమాండ్ పెరగడంతో పాటు మంచి ధర కూడా దక్కుతుందని తెలిపింది.

ఈ సంఘాల్లోని రైతులకు తెలంగాణ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఇందులో భాగంగా వారి కోసమే 'రైతు నేస్తం' 112వ ఎపిసోడ్‌ను మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యేకంగా నిర్వహించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం ఏర్పాటైంది. వ్యవసాయ ఉత్పత్తి కమిషనర్ ఉవ్యవసాయ శాఖ కార్యదర్శి కె. సురేంద్ర మోహన్, ఐ.ఏ.ఎస్. ముఖ్య అతిథిగా పాల్గొని, రైతు ఉత్పత్తిదారుల సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని చెప్పారు.

**రైతు సంఘాల బలోపేతమే లక్ష్యం**

కార్యక్రమంలో ప్రసంగించిన వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ బి. గోపి, ఐ.ఏ.ఎస్. మాట్లాడుతూ, రైతు ఉత్పత్తిదారుల సంఘాల బలోపేతానికి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని చెప్పారు. అందులో భాగంగానే ఈ రోజు 'రైతు నేస్తం' ప్రత్యేక కార్యక్రమాన్ని వీరి కోసమే నిర్వహించామని తెలిపారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసి, చిన్న, సన్నకారు రైతుల ఆదాయాన్ని పెంచడమే లక్ష్యంగా వ్యవసాయ శాఖ పనిచేస్తోందన్నారు. పథకాల లబ్ధిదారుల ఎంపికలో క్షేత్రస్థాయి అధికారులు ఈ సంఘాలకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని ఆయన సూచించారు.

**అద్దెకు యంత్రాలు: కస్టమ్ హైరింగ్ సెంటర్లులి**

వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా కస్టమ్ హైరింగ్ సెంటర్లను (జఎజ) ఏర్పాటు చేస్తున్నారు. చిన్న, సన్నకారు రైతులు ప్రతి యంత్రాన్నీ కొనుక్కోలేరు. అందుకే

ఫీఓాలు, ాఎఎ+లు, ాాజా ద్వారా ఈ కేంద్రాలు ఏర్పాటవుతాయి. యంత్రాలను అద్దెకు ఇవ్వడం వల్ల ఆ సంఘాలకు ఆదాయం వస్తుంది, చిన్న రైతులకు ఖర్చు తగ్గుతుంది. భూమి అభివృద్ధి, విత్తనం--నాటడం, అంతరకృషి, సస్యరక్షణ, కోత--నూర్పిడి, కోత అనంతర పనులు, పంట అవశేషాల నిర్వహణ అనే ఏడు విభాగాల్లో 37 రకాల యంత్రాలు ఈ కేంద్రాల్లో అందుబాటులో ఉంటాయి. వీటిలో పవర్ టిల్లర్, రోటోవేటర్, విత్తన--ఎరువు డ్రిల్, పవర్ స్ప్రేయర్లు, కిసాన్ డ్రోన్, కంబైన్ హార్వెస్టర్, పసుపు బాయిలర్, పాలిషర్, స్ట్రా బేలర్ ఉన్నాయి. దీనివల్ల కూలీల కొరత తగ్గి, ఖర్చు, సమయం ఆదా అవుతాయి. పథకం నియమాలు, ఆన్‌లైన్ దరఖాస్తు విధానం, రైతులు నేరుగా పొందే ప్రయోజనాలను వ్యవసాయ కమిషనరేట్ అధికారులు వివరించారు.

**ఎల్‌నినో జాగ్రత్తలు, నేల సంరక్షణ**

ఎల్‌నినో నేపథ్యంలో అమలు చేయాల్సిన ప్రత్యామ్నాయ (కాంటింజెన్సీ) ప్రణాళిక, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలు, రైతులకు ఇవ్వాల్సిన అవగాహనపై అధికారులు వివరించారు. 'ఖేత్ బచావో అభియాన్' అమలు తీరు, నేల సంరక్షణ లక్ష్యాలను కూడా విపులంగా చర్చించారు.

**ఎగుమతిదారులు, కొనుగోలుదారుల అనుభవాలు**

పంటలను పెద్ద ఎత్తున కొనే సంస్థలు, అగ్రిగేటర్లు, విలువ జోడించిన ఉత్పత్తులు తయారు చేసే కంపెనీలు, దేశీయంగా, విదేశాలకు ఎగుమతి చేస్తున్న సంస్థల ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతులు, రైతు సంఘాలు, మహిళా సంఘాలు, సహకార సంఘాలు అధిక ఆదాయం ఎలా పొందవచ్చో వారు వివరించారు.

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ డివిజన్‌లోని కోహీర్ మండలంలో రైతులు 'గెర్కిన్స్' అనే ప్రత్యేక రకం కీరదోసను పండిస్తున్నారు. వాటిని విదేశాలకు ఎగుమతి చేస్తున్న కంపెనీ ప్రతినిధులు, స్వల్ప కాలంలో ఈ పంటను ఎలా సాగు చేయాలో, పంట తర్వాత విలువ జోడించిన ఉత్పత్తులుగా మార్చి ఇతర దేశాలకు ఎలా పంపుతున్నారో చెప్పారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో మునగ ఆకులను సేకరించి, పొడిగా తయారుచేసి విదేశాలకు ఎగుమతి చేస్తున్న కంపెనీ ప్రతినిధులు తమ అనుభవాలను రైతులతో పంచుకున్నారు.

**రబీ సాగుకు సూచనలు**

రబీ సీజన్‌లో పంటల ఎంపికపై కూడా వ్యవసాయ శాఖ రైతులకు సూచనలు చేసింది. నవంబర్ మొదటి పక్షం వరకు పప్పుధాన్యాలు, నూనెగింజలు విత్తుకోవచ్చు. నవంబర్ 16 తర్వాత పెసర, మినుము, జొన్న, పొద్దుతిరుగుడు, వేరుశనగ మాత్రమే అనుకూలం. నీటి లభ్యతను బట్టి పంటను ఎంచుకోవాలని, కుసుమ, శనగ, పెసర, మినుము తక్కువ నీటితో పండుతాయని, జొన్న, పొద్దుతిరుగుడు, వేరుశనగకు తగినంత నీరు అవసరమని తెలిపింది. పూత, కాయ నిండే దశల్లో తప్పనిసరిగా నీరు అందించాలని, సిఫారసు చేసిన రకాలనే అధికారిక డీలర్ల నుంచి కొనుగోలు చేయాలని సూచించింది. రైతులు సంఘాలుగా ఏర్పడి, ప్రభుత్వ పథకాలను, మార్కెటింగ్ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ కోరింది.

# విద్యార్థినులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించాలి,





**●మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,**

ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థిని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, హాజీపూర్ మండలం కర్ణమామిడిలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలను సందర్శించి విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాలు, మధ్యాహ్న భోజనం నాణ్యత, విద్యాబోధన, రిజిస్టర్లు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ విద్యార్థినులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు, వారికి సులభంగా అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలను బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. తరగతులలో వెనుకబడిన విద్యార్థినులను గుర్తించి, వారి అభ్యసన సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. విద్యార్థినులకు నిర్ణీత మెనూ ప్రకారం నాణ్యమైన, పౌష్టికాహారం సకాలంలో అందించాలని, పాఠశాలలలో పరిశుభ్రతను పాటించాలని, విద్యార్థినుల ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

అనంతరం హాజీపూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆసుపత్రిలోని వార్డులు, మందుల నిల్వలు, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. వైద్యులు, వైద్య సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటిస్తూ, రోగులకు అందుబాటులో ఉండాలని తెలిపారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల నిర్లక్ష్యంపై సీఎంకు ఫిర్యాదు

**ప్రజా సమస్యలను పట్టించుకోని అధికారులను ఉపేక్షించేది లేదు**
**చిన్మయి మార్గ్‌లో ఇంకుడు గుంత ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి: జంగాల శ్రీరామ్ యాదవ్**



ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేస్తామని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ఉపాధ్యక్షులు జంగాల శ్రీరామ్ యాదవ్ హెచ్చరించారు. ప్రజా ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చేలా అధికారులు వ్యవహరిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు.

మల్కాజిగిరి--మిర్జాలగూడ డివిజన్ చిన్మయి మార్గ్‌లో ప్రజా ప్రయోజనాల కోసం ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతను ఆక్రమించి ప్రహరీ గోడ నిర్మించిన వారిపై చర్యలు తీసుకోవాలని మూడు వారాలుగా ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్నా అధికారులు స్పందించడం లేదని ఆరోపించారు. సమస్య పరిష్కారం కోసం ప్రతి వారం ప్రజావాణికి వస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు.

అక్రమ నిర్మాణాన్ని తొలగించి ఇంకుడు గుంతను యథావిధిగా కొనసాగించాలని మల్కాజిగిరి జోనల్ కమిషనర్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్‌కు ఆదేశాలు ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని తెలిపారు.

ప్రజా సంక్షేమానికి ఉపయోగపడే ఇంకుడు గుంతలను పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఇప్పటికైనా స్పందించి ఆక్రమణను తొలగించాలని డిమాండ్ చేశారు.

అధికారుల నిర్లక్ష్యంపై అవసరమైతే స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ముఖ్యమంత్రిని కలిసి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ప్రజల పక్షాన నిలబడి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని, మైనంపల్లి హనుమంతరావు సహకారంతో ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని జంగాల శ్రీరామ్ యాదవ్ తెలిపారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలి,



**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,**

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన రోడ్డు భద్రతా సమావేశంలో బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, బెల్లంపల్లి, జైపూర్ ఎసిపి లు, జాతీయ రహదారుల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ జాతీయ రహదారులపై ఆక్రమణలు లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని, జాతీయ రహదారి-363పై వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్ గన్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. అవసరమైన ప్రాంతాలలో స్పీడ్ బ్రేకర్లు, రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని, రహదారులపై తగినంత వెలుతురు ఉండేలా లైటింగ్ సదుపాయాలను మెరుగుపరచాలని తెలిపారు. రహదారులపై పశువుల సంచారం వల్ల ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు గోశాల ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేసి అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. రవాణా శాఖ అధికారులు ఓవర్‌లోడ్ వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై అవసరమైన మేరకు లైసెన్సుల సస్పెన్షన్ చర్యలు చేపట్టాలని సూచించారు. పాఠశాల బస్సుల ఫిట్‌నెస్‌ను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని, ఫిట్‌నెస్ లేని వాహనాలను నడిపే వారిపై చర్యలు తీసుకోవాలని, ఇన్సూరెన్స్ లేకుండా తిరిగే వాహనాలపై జరిమానాలు విధించాలని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రిపుల్ రైడింగ్‌పై పోలీసులు నిరంతరం తనిఖీలు నిర్వహించాలని, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. మున్సిపాలిటీల పరిధిలో భవనాల సెల్లార్లను పార్కింగ్ అవసరాలకే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా రహదారులపై వాహనాల పార్కింగ్‌ను నియంత్రించి ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాలను తగ్గించాలని తెలిపారు. రోడ్డు భద్రతకు ప్రాధాన్యతనిస్తూ సంబంధిత శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి, ప్రమాదాల నివారణకు సమగ్ర చర్యలు చేపట్టాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ట్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక
బుధవారం అక్టోబర్ 28, 2026
www.trinetnews.com

# తుఫాన్‌పై అప్రమత్తం.. ప్రజల ప్రాణ రక్షణే ప్రభుత్వ లక్ష్యం!

**290 తుఫాన్ షెల్టర్లు ఏర్పాటు.. 84,396 మందికి సురక్షిత ఆశ్రయం**
**శ్రీకాకుళం నుంచి బాపట్ల వరకు ప్రభావం.. తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**
**ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడి**



**అమరావతి, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:** తుఫాన్ ప్రభావంతో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ప్రజల ప్రాణాలను కాపాడటమే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని స్పష్టం చేశారు. ఎన్నికల పనుల్లో బిజీగా ఉన్నప్పటికీ తుఫాన్ సన్నద్ధతపై నిరంతరం సమీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. తుఫాన్ రెడ్ కేటగిరీలో ఉన్నప్పటికీ ప్రజలు భయాందోళనలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

తుఫాన్ సన్నద్ధతపై నిర్వహించిన మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, శ్రీకాకుళం నుంచి బాపట్ల వరకు తుఫాన్ ప్రభావం ఉండే అవకాశం ఉందన్నారు. పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల నుంచి ఉత్తరాంధ్ర వరకు భారీ వర్షాలు, బలమైన గాలుల తీవ్రత ఎక్కువగా ఉండవచ్చని అంచనా వేశారు. కాకినాడ సమీపంలోని యానాం వద్ద తుఫాన్ తీరం దాటే అవకాశం ఉందని వివరించారు. ఉత్తరాంధ్రలో ఇప్పటికే వర్షాలు ప్రారంభమయ్యాయని, రాత్రి నుంచి మరుసటి రోజు వరకు తీరప్రాంతాల్లో వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు.

**భారీ వర్షాలపై హెచ్చరికలు**

కోనసీమ, ఏలూరు, పశ్చిమగోదావరి, మన్యం, విజయనగరం, శ్రీకాకుళం, కాకినాడ తదితర ప్రాంతాల్లో తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉండవచ్చని ముఖ్యమంత్రి తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో అతిభారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని పేర్కొన్నారు. శ్రీకాకుళంలో 30 సెంటీమీటర్లు, పశ్చిమగోదావరిలో 28 సెంటీమీటర్లు, విశాఖపట్నంలో 23 సెంటీమీటర్ల మేర వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వివరించారు. అనేక ప్రాంతాల్లో 10 సెంటీమీటర్లకు పైగా వర్షం కురిసే ప్రమాదం ఉందన్నారు. తీరప్రాంత జిల్లాల్లో సముద్రపు నీరు లోతట్టు ప్రాంతాల్లోకి చొచ్చుకొచ్చే అవకాశం ఉందని హెచ్చరించారు. నాగావళి, వంశధార నదులకు వరదలు వచ్చే ప్రమాదం ఉందని, వాగులు, వంకల్లో నీటి ప్రవాహాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. చెరువులకు గండ్లు పడితే వెంటనే మరమ్మతులు చేపట్టేలా చర్యలు సిద్ధం చేశామన్నారు.

**84 వేల మందికి సురక్షిత ఆశ్రయం**

తుఫాన్ ముప్పును దృష్టిలో పెట్టుకుని రాష్ట్రవ్యాప్తంగా 290 తుఫాన్ షెల్టర్లను ఏర్పాటు చేసినట్లు చంద్రబాబు వెల్లడించారు. ఇప్పటివరకు 84,396 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు తెలిపారు. సముద్ర తీర గ్రామాలు, లంకలు, లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలు తుఫాన్ షెల్టర్లకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. అత్యవసర పరిస్థితులు మినహా ప్రయాణాలు రద్దు చేసుకుని ఇళ్లలో లేదా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు 24 గంటల పాటు పనిచేస్తున్నాయని, ప్రతి గంటకు తుఫాన్ హెచ్చరికల బులెటిన్లు జారీ చేస్తున్నామని తెలిపారు. ప్రభావం ఎక్కువగా ఉండే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. తుఫాన్ తీవ్రతను అంచనా వేస్తూ కలెక్టర్లతో క్షేత్రస్థాయిలో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తామని చెప్పారు.

**మత్స్యకారులు, గర్భిణుల భద్రతకు ప్రత్యేక చర్యలు**

సముద్రంలో ఉన్న మత్స్యకారులకు చెందిన 30 వేలకుపైగా బోట్లను వెనక్కి రప్పించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. గోపాల్‌పూర్‌లో ఏపీకి చెందిన 93 బోట్లు, వాటి సిబ్బంది సురక్షితంగా ఉన్నారని వెల్లడించారు. అత్యవసర వైద్య సేవల కోసం 1,316 అంబులెన్సులను సిద్ధం చేశామని, సుమారు 5 వేల మంది గర్భిణులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, సమీప ఆస్పత్రులకు తరలించినట్లు చెప్పారు. తాగునీటి సరఫరాకు ట్యాంకర్లు, జనరేటర్లను సిద్ధం చేశామని, విద్యుత్ అంతరాయాలను వెంటనే పునరుద్ధరించేందుకు 8,400 మంది సిబ్బందిని అందుబాటులో ఉంచామని వివరించారు. తుఫాన్ కారణంగా సుమారు 15 వేల విద్యుత్ స్తంభాలు పడిపోయే అవకాశం ఉందని అంచనా వేసి, అందుకు అనుగుణంగా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

**పంట నష్టంపై అంచనా.. డ్రోన్లతో సహాయక చర్యలు**

తుఫాన్ కారణంగా సుమారు 7.16 లక్షల హెక్టార్ల వ్యవసాయ పంటలు, 16 లక్షల హెక్టార్ల ఉద్యాన పంటలు ప్రభావితమయ్యే అవకాశం ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. నష్టాన్ని తగ్గించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని చెప్పారు. ముంపు గ్రామాలకు ఆహారం, ఔషధాలు చేరవేసేందుకు డ్రోన్లను ఉపయోగించేలా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. అంగన్‌వాడీల ద్వారా పిల్లలు, బాలింతలకు అవసరమైన సరుకులు అందించడంతో పాటు, రేషన్ సరఫరాకు కూడా చర్యలు తీసుకున్నామని తెలిపారు. క్యాచ్‌మెంట్ ప్రాంతాల్లో కురిసే వర్షపు నీటిని రిజర్వాయర్లలో నిల్వ చేసుకునేలా ప్రణాళికలు రూపొందించినట్లు వివరించారు.

గత అనుభవాలతో ముందస్తు కార్యాచరణ

గతంలో బుడమేరు వరదల సమయంలో విజయవాడ కలెక్టరేట్‌లోనే ఉండి సహాయక చర్యలను పర్యవేక్షించిన విషయాన్ని చంద్రబాబు గుర్తుచేశారు. ఆ సమయంలో ప్రజలు సుమారు రూ.500 కోట్ల మేర విరాళాలు అందించారని తెలిపారు. ప్రస్తుతం కూడా తుఫాన్ ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి, నష్టాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు.

ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలతో పాటు నౌకాదళం, కోస్ట్‌గార్డులను అప్రమత్తం చేసినట్లు వెల్లడించారు. హుద్‌హుద్ తుఫాన్‌తో పోలిస్తే ప్రస్తుత తుఫాన్ తీవ్రత తక్కువగా ఉండవచ్చని అంచనా వేస్తున్నప్పటికీ, ప్రజలు నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు.

**ప్రజలకు ముఖ్యమంత్రి విజ్ఞప్తి:**

తీరప్రాంత, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. వరద నీటి ప్రవాహాల వైపు వెళ్లకూడదు. అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలి. ప్రాణ, ఆస్తి నష్టాన్ని వీలైనంత తగ్గించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని చంద్రబాబు స్పష్టం చేశారు.

# ఒంటిమిట్ట 3 ఎంపీటీసీ స్థానాలు టిడిపికి ఏకగ్రీవం





ఒంటిమిట్ట మండలంలో ప్రతిష్టాత్మంగా జరగనున్న ఎంపీటీసీ స్థానాలకు మంగళవారం తెలుగుదేశం పార్టీకి 3 ముగ్గురు అభ్యర్థులు ఏకగ్రీవంతో తొలి బోణి చేసింది.. ఒంటిమిట్ట ఎంపీటీసీ స్థానానికి ఎంపీపీ అభ్యర్థి తెలుగుదేశం పార్టీ నాయకుడు ఎలక్ట్రికల్ క్లాస్1 కాంట్రాక్టర్ ఎస్ వి రమణ నరవకాటపల్లె ఎంపీటీసీ స్థానానికి ఒంటిమిట్ట చిన్న సుబ్బరాయుడు పేన్న పేరూరు ఎంపీటీసీ స్థానానికి అన్నిక రాజేశ్వరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఒంటిమిట్ట ఎంపీటీసీ స్థానాలకు టిడిపి వైసిపి జనసేన స్వతంత్ర అభ్యర్థులు కలిపి 40 నామినేషన్లు దాఖలు చేశారు. ఉదయం నుంచి తెలుగుదేశం పార్టీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాజీ పద్ధతిలో ఏకగ్రీవం కోసం చర్చలు జరిపారు. టిడిపికి ఏడు స్థానాలు వైసిపికి రెండు స్థానాలు ఇవ్వాలని ప్రతిపాదన జరిగాయి. కానీ చర్చలు విఫలం కావడంతో ఐదు స్థానాలకు వైసీపీ అభ్యర్థులు పోటీలో పిలిచారు కాగా కొత్త మాధవరం ఎంపిటిసి స్థానానికి ఆలూరు వెంకటసుబ్బయ్య కె.వి.ప్రసాద్ కు టిడిపి బి ఫారాలు ఇవ్వడంతో సాయంత్రం వరకు ఎవరికీ బీఫారాలు అధిష్టానం అందిస్తుందని ఉత్కంఠ నెలకొంది. చివరకు రాజంపేట టిడిపి ఇన్చార్జి జగన్మోహన్ రాజు రంగ ప్రవేశం చేసి ఆలూరు వెంకటసుబ్బయ్య కే బి ఫారం ఇస్తున్నట్లు ప్రకటించారు .దీంతో కొత్త మాధవరం ఎంపిటిసి స్థానం ఉత్కంఠకు తెరపడింది. ఏకగ్రీవాల ధృవపత్రాల కార్యక్రమంలో టిడిపి నాయకులు శ్రీనివాసరాజు గజ్జల నరసింహారెడ్డి ముద్దుకృష్ణారెడ్డి నల్లగొండ వెంకటసుబ్బారెడ్డి బొబ్బిలి రాయుడు నామాల వెంకటయ్య ఎంపీటీసీ సుంకేసుల భాష వెంకట రెడ్డి పొట్టి రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు

# 28వ వార్డు స్వతంత్ర అభ్యర్థి బొడ్డు చిన్న నరసింహారావు ప్రచారానికి విశేష స్పందన





మాచర్ల పట్టణంలోని 28వ వార్డులో మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. వార్డు స్వతంత్ర అభ్యర్థి, కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరుడు అయిన బొడ్డు చిన్న నరసింహారావు తన మద్దతుదారులతో కలిసి వార్డులో జోరుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికీ వెళ్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నవంబర్ 1వ తేదీన జరిగే ఎన్నికల్లో తన ఎన్నికల గుర్తు అయిన 'బీరువా' పై ఓటు వేసి, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు. వార్డు సమగ్ర అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. నిగర్వి, ప్రజా సేవకుడైన బొడ్డు చిన్న నరసింహారావును భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత వార్డు ప్రజలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నాయకులు ఆరే చెన్నయ్య, అంకిరెడ్డిలతో పాటు పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని చిన్న నరసింహారావుకు ఘనస్వాగతం పలికారు. ప్రచారంలో భాగంగా వార్డు ప్రజల నుంచి అభ్యర్థికి విశేష స్పందన లభించింది.

# అధికారులకు బీఫారం అందజేసిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు





మాచర్ల నియోజకవర్గం కారంపూడి మండలం కేంద్రం లోని ఎంపీడీవో కార్యాలయం లో ఎన్నికల అధికారికి బీ ఫారం ఎంపీటీసీ అభ్యర్థులు అందజేశారు. మీ ఫారం అందజేసిన వారిలో పంగులూరు అంజయ్య, కటికల బాలకృష్ణ, చప్పిడి రాము, తండా మస్తాన్ జానీ పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# విద్యార్థులలో అభ్యాసన సామర్థ్యాలలో పెంపొందించాలి,





**●మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య,**

ప్రభుత్వ పాఠశాలలను విద్య అభ్యసిస్తున్న విద్యార్థులలో అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. మంగళవారం జిల్లాలోని జైపూర్ మండలం నర్వ పరిధిలో విద్య, అంగన్‌వాడీ సేవలు, పారిశుధ్యం, నీటి సంరక్షణ, గ్రామ పంచాయతీ భవన నిర్మాణం, అనధికార లేఅవుట్లకు సంబంధించిన అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించాలని తెలిపారు. గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యసన స్థాయిని, పాఠ్యాంశాలపై అవగాహనను పరీక్షించారు. విద్యార్థులకు ప్రశ్నలు వేసి వారు అర్థం చేసుకున్న అంశాలను తెలుసుకున్నారు. ఉపాధ్యాయులతో మాట్లాడి ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం కార్యక్రమం అమలు తీరు, బేస్‌లైన్ పరీక్షల ఫలితాలు, విద్యార్థుల అభ్యసన పురోగతి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బోధనలో వినియోగిస్తున్న బోధనాభ్యసన సామగ్రి గురించి సమీక్షించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు అందిస్తున్న సేవలు, పోషకాహారం పంపిణీ తీరును పరిశీలించారు. వంటగదిని సందర్శించి ఆహార తయారీ, పిల్లలకు అందిస్తున్న భోజనం వివరాలను తెలుసుకున్నారు. చిన్నారులకు నాణ్యమైన పోషకాహారం అందించడంతో పాటు, వంటగది, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ పాఠశాల వద్ద కమ్యూనిటీ సోక్ పిట్ నిర్మాణానికి చేపట్టిన మార్కింగ్ పనులను పరిశీలించారు. మురుగునీటి నిర్వహణకు అవసరమైన నిర్మాణాలను ప్రణాళికాబద్ధంగా చేపట్టి, గ్రామంలో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. నీటిని వృథా చేయకుండా జాగ్రత్తగా వినియోగించుకోవాలని, త్రాగునీటిని పొదుపు చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, నీటి వృథాను నివారించేందుకు ప్రజలు సహకరించాలని తెలిపారు. గ్రామ పంచాయతీ నూతన భవనాన్ని సందర్శించి పరిపాలనకు అవసరమైన మౌలిక సదుపాయాలు, కార్యాలయ నిర్వహణకు సంబంధించిన అంశాలను పరిశీలించారు. గ్రామ పరిధిలోని అనధికార లేఅవుట్లను సందర్శించి, వివరాలను పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా తదుపరి చర్యలు తీసుకునేలా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. గ్రామ పంచాయతీ పరిధిలో భూ వినియోగం, లేఅవుట్లకు సంబంధించిన నిబంధనల అమలుపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జైపూర్ పోలీస్ స్టేషన్ లో ఓపెన్ హౌస్,





**●విద్యార్థులకు పోలీసు శాఖ విధులపై అవగాహన,**

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని జైపూర్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం రోజున పాఠశాల విద్యార్థుల కోసం ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా విద్యార్థులు పోలీస్ స్టేషన్‌ను సందర్శించి పోలీసుల విధులు, స్టేషన్ నిర్వహణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు చేపట్టే చర్యలపై అవగాహన పొందారు. జైపూర్ ఎస్సై ఎల్. భూమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్‌లోని రిసెప్షన్ డెస్క్, మహిళా హెల్ప్ డెస్క్, కేసుల నమోదు విధానం, లాకప్ గదుల నిర్వహణ తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు.

మహిళలు, బాలబాలికల భద్రత కోసం ఏర్పాటు చేసిన మహిళా హెల్ప్ డెస్క్ ప్రాధాన్యతను వివరించడంతో పాటు, అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112 మరియు సైబర్ నేరాల బారిన పడినప్పుడు 1930కు ఫిర్యాదు చేయాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు.

దేశ రక్షణ, ప్రజల భద్రత కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలను స్మరించుకోవాలని ఈ సందర్భంగా విద్యార్థులకు సూచించారు. చిన్నతనం నుంచే చట్టాల పట్ల గౌరవం, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతను అలవర్చుకుని బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు పోలీసు వ్యవస్థ, పోలీసుల విధులు మరియు ప్రజల భద్రతలో పోలీసుల పాత్రపై అవగాహన పెరగడంతో పాటు పోలీసు శాఖపై నమ్మకం, గౌరవం మరింత పెరుగుతుందని జైపూర్ ఎస్సై ఎల్. భూమేష్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నీటి లభ్యతను బట్టి పంటలు సాగు చేయాలి

**●వేసంగిలో వరికి బదులుగా చిరుధాన్యాలు**
**●ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన**



హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామంలో రైతులకు ఆరుతడి పంటల సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఏఈఓ జక్కుల బాబు, ఆయిల్‌ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ ప్రభావతి మాట్లాడుతూ.. భూగర్భ జలాలు తగ్గుతున్న నేపథ్యంలో వచ్చే వేసంగి సీజన్‌లో నీటి లభ్యతను బట్టి పంటలు సాగు చేయాలని సూచించారు.నీటి వనరులను దృష్టిలో ఉంచుకొని వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో పండే చిరుధాన్యాల పంటలను ఎంచుకోవాలని తెలిపారు.రైతులు నీటిని పొదుపుగా వినియోగించాలని, అవసరాన్ని బట్టి స్ప్రింక్లర్లు, డ్రిప్ పద్ధతులను అవలంబించాలని సూచించారు.ప్రభుత్వం అందించే సబ్సిడీ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.అనుకూలమైన భూములు, నీటి వసతి ఉన్న రైతులు ఆయిల్‌పామ్ తోటల సాగుపై దృష్టి సారించాలని, దీర్ఘకాలికంగా ఆదాయం పొందేందుకు అవకాశం ఉంటుందని వివరించారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ జక్కుల బాబు, ఆయిల్‌ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ ప్రభావతి, ఎండీ మహమ్మద్ జాఫర్, తంగిళ్ల సురేష్‌తో పాటు పలువురు రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# తిరుమలంపాలెం-1 ఎంపీటీసీగా హేమలత ఏకగ్రీవం



ద్వారకాతిరుమల మండలం తిరుమలంపాలెం-1 ఎంపీటీసీ స్థానానికి వడ్లమూడి హేమలత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల ఎన్నికల అధికారి నిర్మల జ్యోతి ఆమెకు ఎన్నికల ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.కార్యక్రమంలో రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్, మండల తెదేపా అధ్యక్షుడు లంకా సత్యనారాయణ, సీనియర్ నాయకులు పాకలపాటి గాంధీ, ద్వారకాతిరుమల సొసైటీ చైర్మన్ పోలిన శ్రీనివాసరావు, రాజమండ్రి పార్లమెంట్ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీపీ ఏపూరి దాలయ్య, తిరుమలంపాలెం సొసైటీ చైర్మన్ మాసిరెడ్డి హరిబాబు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మట్టపర్తి రూపేష్ కుమార్, నాయకులు నాదెళ్ల వేణు, బోట్ల సాయి తదితరులు పాల్గొన్నారు.

# అర్నాబ్ తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి

- మత్స్యకారులు ఎవ్వరూ వేటకు వెళ్ళరాదు
- ప్రజల సహాయార్థశీ కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు
- కలెక్టరేట్ కంట్రోలు రూం నెంబర్లు : 0861 - 2331261, 79955 76699
- జిల్లా కలెక్టర్ హిమాన్ను శుక్ల



జిల్లాకు అర్నాబ్ తుఫాన్ హెచ్చరిక ఉన్నందున ప్రజలు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ హిమాన్ను శుక్ల ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. లోతట్టు ప్రాంతాలు,తీరా ప్రాంతాల్లో నివసించే ప్రజలను అప్రమత్తం చేయాలని, అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించే ముందస్తుగా ఏర్పాట్లు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మత్స్యకారులు ఎవ్వరూ వేటకు వెళ్ళరాదని ఆయన సూచించారు. నీటిపారుదల, ఆర్ డబ్ల్యూఎస్, విద్యుత్తు, ఆర్ అండ్ బి, పీఆర్, వ్యవసాయ, పశుసంవర్ధక, పంచాయతీ రాజ్, మున్సిపల్, శాఖలతో పాటు అన్ని లైన్ డిపార్ట్మెంట్లు 24/7 అప్రమత్తంగా ఉంటూ..తగు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు.

### కలెక్టరేట్‌లో కంట్రోలు రూం ఏర్పాటు

భారీ వర్షాల దృష్ట్యా ప్రజలకు అత్యవసర సేవలు అందించేందుకు కలెక్టరేట్‌లో కంట్రోలు రూంను ఏర్పాటుచేసినట్లు కలెక్టర్ తెలిపారు. వర్షాల వలన ఇబ్బందులు తలెత్తితే కంట్రోలు రూం నెంబర్లు : 0861-2331261, 79955 76699 నెంబర్ కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. కంట్రోలు రూంలో 24 గంటలు విధులు నిర్వహించేలా సిబ్బందికి ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.

# అర్నాబ్ తుపాన్ ప్రభావం.. అప్రమత్తమైన యంత్రాంగం!

- మంగళవారం మధ్యాహ్నం నుంచి భారీ వర్షం ఈదురుగాలులు
- పునరావాస కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై అధికారుల దృష్టి





బంగాళాఖాతంలో ఏర్పడిన అర్నాబ్ తుపాన్ ప్రభావంతో సముద్ర తీర తీర ప్రాంతాల్లో అలలు అల్ల కల్లోలంగా ఎగసిపడుతున్నాయి. వాతావరణ పరిస్థితులు మారుతున్నాయి. మంగళవారం మధ్యాహ్నం నుంచి భారీ వర్షం, ఈదురుగాలులు ప్రారంభం కావడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. తుపాన్ ప్రభావం నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలపై దృష్టి సారించింది. తీర ప్రాంత ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

### తీర ప్రాంతాల్లో అప్రమత్తత

తుపాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో తీర ప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా బలహీనమైన ఇళ్లలో నివసించే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని సూచిస్తున్నారు. ఈదురుగాలుల సమయంలో చెట్ల కింద, విద్యుత్ స్తంభాల సమీపంలో ఉండకూడదని, అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని హెచ్చరిస్తున్నారు.

### ముందస్తు ఏర్పాట్లపై అధికారుల దృష్టి

తుపాన్ కారణంగా ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని అధికారులు భావిస్తున్నారు. వర్షపు నీరు నిలిచే ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలు, బలహీనమైన ఇళ్లు ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది. అత్యవసర పరిస్థితులు తలెత్తితే వెంటనే స్పందించేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉంది.

### పునరావాస కేంద్రాల్లో మౌలిక వసతులు

తుపాన్ ప్రభావిత ప్రాంతాల ప్రజలను అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు పునరావాస కేంద్రాలను సిద్ధం చేస్తున్నారు. ఆయా కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, పారిశుద్ధ్యం, ఆహారం వంటి కనీస మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి అవసరమైన సదుపాయాలు కల్పించడంపై అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

### మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దు

తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. సముద్రం అల్లకల్లోలంగా ఉండే అవకాశం ఉన్నందున బీచ్‌ల వద్దకు వెళ్లడం, సముద్రంలోకి దిగడం వంటి సాహసాలు చేయకూడదని హెచ్చరిస్తున్నారు. ప్రజలు అధికారుల సూచనలు పాటిస్తూ తుపాన్ ముప్పు నుంచి సురక్షితంగా ఉండాలని కోరుతున్నారు.

తుపాన్ ప్రభావం పూర్తిగా తగ్గే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాతావరణ పరిస్థితులపై అధికారిక సమాచారం తెలుసుకుంటూ జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.

### ముందస్తు చర్యలు..!

జిల్లాలో తుఫాను ప్రభావంతో 200 కిలోమీటర్ల వేగంతో వీదురు గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యుత్ శాఖ అధికారులు యుద్ధప్రతీ పదికన జిల్లా మొత్తం గా నూతన విద్యుత్ స్తంభాలు అందుబాటులోకి తీసుకొచ్చారు. బికర ఈదురు గాలులకి దెబ్బతిన్న స్తంభాలనం స్థానంలో ఈ నూతన స్తంభాలు ఏర్పాటు చేసే అవకాశం ఉంది.

# అభ్యర్థులు విజయమే లక్ష్యంగా ప్రజలు మద్దతు పొందాలి

- భీమవరం, వీరవాసరం మండలంలోని 1 జడ్పిటిసి, 18 ఎంపిటిసి అభ్యర్థులకు 'బి - ఫారాలు' అందజేసి ఆశీర్వదించిన ఎమ్మెల్యే అంజిబాబు





భీమవరం నియోజక వర్గంలోని ప్రతి గ్రామంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పోటీ చేస్తున్న అభ్యర్థులు సమన్వయంతో పనిచేసి గెలుపునకు శక్తివంచన లేకుండా కృషి చెయ్యాలని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం భీమవరం, వీరవాసరం మండలంలోని 1 జడ్పిటిసి, 18 ఎంపిటిసి అభ్యర్థులకు ఎమ్మెల్యే అంజిబాబు 'బి - ఫారాలు' అందజేసి ఆశీర్వదించారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ భీమవరంలో ఒక జెడ్పీటీసీ, టిడిపి తరుపున 9 మంది ఎంపీటీసీ, జనసేన 8 మంది ఎంపీటీసీ, బీజేపీ 1 ఎంపీటీసీ, టిడిపి తరుపున ఎంపీపి, వీరవాసరం మండలంలో టీడీపీ జెడ్పీటీసీ, టిడిపి తరుపున 8 ఎంపీటీసీ, జనసేన 10 ఎంపీటీసీ, బీజేపీ 1, జనసేన తరుపున ఎంపీపీ పోటీ చేస్తున్నారని అన్నారు. పంతాలు పట్టింపులకు పోయి కూటమి పార్టీకి చెడ్డపేరు తేవద్దని హితవు పలికారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలు పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుండాలని, స్థానిక సంస్థల్లో కూటమి అభ్యర్థులు గెలవడం ద్వారా గ్రామాలు అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందన్నారు. అభ్యర్థులు అత్యధిక మెజార్టీతో విజయాలు సాధించి కూటమి పార్టీ జెండాలు ఎగుర వేయ్యాలని ఎమ్మెల్యే అంజిబాబు అభ్యర్థులను కోరారు.

## ఆహార భద్రత చట్టం--2006 అమలుకు సమర్థవంతమైన చర్యలు,

- మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు,



జిల్లాలో ఆహార భద్రత చట్టం 2006 అమలుకు అధికారుల సమన్వయంతో సమర్థవంతమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్ నుండి ఆహార భద్రత అధికారి వాసురామ్ తో కలిసి ఆహార భద్రత, ప్రమాణాల చట్టం--2006పై నిర్వహించిన ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) వి. రాములు, మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా ఆహార భద్రత చట్టంలోని నిబంధనలు, ఆహార నాణ్యత ప్రమాణాలు, ప్రజారోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు, చట్ట అమలుకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ఆహార భద్రత చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## సబ్సిడీ యంత్ర పరికరాలు సద్వినియోగం చేసుకోవాలి: ఏవో వెంకటేశ్వర్లు.



పినపాక మండల రైతులు ప్రభుత్వ సబ్సిడీపై అందించే వ్యవసాయ యంత్ర పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని అగ్రికల్చర్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం పినపాక రైతు వేదికలో సర్పంచులు, రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లా యూనిట్‌గా సబ్సిడీపై యంత్ర పరికరాలు అందజేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లోని రైతులకు ఈ పథకంపై సర్పంచులు అవగాహన కల్పించాలని కోరారు. పూర్తి వివరాల కోసం స్థానిక ఏఈఓలను లేదా రైతు వేదికలో సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో దిశా కమిటీ అధ్యక్షులు, పొట్లపల్లి సర్పంచ్ సమ్మయ్య, పినపాక సర్పంచ్ అలివేలు, భూపాలపట్నం సర్పంచ్ స్వప్న, బయ్యారం సర్పంచ్ చంద్రావు, తోగూడెం సర్పంచ్ పూణెం వెంకటేశ్వర్లు, తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా నాయకులు మడివి రమేష్, గిరిజన అభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షులు గోగ్గల రామకృష్ణ , మండల అధ్యక్షులు శ్రీను, స్థానిక నాయకులు సతీష్ చారి,గంగిరెడ్డి వెంకటరెడ్డి , ప్రవీణ్, సతీష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## తుపాను ప్రభావం నేపథ్యంలో ముందస్తు చర్యలు

### 40 మంది సిబ్బందితో ఎన్డిఆర్ఎఫ్ ప్రత్యేక బృందం



తుపాను ప్రభావం నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఎన్డీఆర్ఎఫ్ బృందం నరసాపురం చేరుకుంది. సుమారు 40 మంది సభ్యులతో కూడిన ఈ బృందం అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధమైంది. తుపాను కారణంగా భారీ వర్షాలు, వరదలు సంభవించే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు.

ముందస్తు చర్యల్లో భాగంగా నరసాపురం గోదావరి రేవు పరిసర ప్రాంతాలను బృంద సభ్యులు పరిశీలించారు. తుపాను ప్రభావంతో ప్రమాదకర పరిస్థితులు ఎదురైనా తక్షణమే స్పందించేలా సిబ్బందిని సిద్ధం చేశారు. వరద ముంపు ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సహాయక చర్యలు చేపట్టేందుకు సన్నద్ధమయ్యారు.

ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించడం, అత్యవసర సహాయక చర్యలు చేపట్టడం వంటి విధుల్లో ఎన్డీఆర్ఎఫ్ బృందాలు కీలక పాత్ర పోషిస్తాయి. ఈ నేపథ్యంలో నరసాపురం ప్రాంతంలో బృందం అందుబాటులో ఉండటం ప్రాధాన్యత సంతరించుకుంది. తుపాను పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలు పాటించాలని సూచిస్తున్నారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరుతున్నారు.

## పదవి కోసం కాదు... ప్రజా సేవ కోసం - బుసనబోయిన విజయలక్ష్మి



పదవుల కోసం కాదు, ప్రజా సేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చానని ద్వారకాతిరుమల మండల వైఎస్సార్సీపీ జెడ్పీటీసీ అభ్యర్థి బుసనబోయిన విజయలక్ష్మి అన్నారు.

సోమవారం మండలంలోని దొరసానిపాడు గ్రామంలో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి తనకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ... “ప్రజల మధ్య ఉంటూ, ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడమే నా ప్రధాన లక్ష్యం. మన గ్రామం – మన అభివృద్ధి – మన బాధ్యత అనే నినాదంతో ముందుకు వెళ్తాను. మీ ఆదరాభిమానాలు, ఆశీస్సులు నాకు అందించాలి” అని కోరారు.గ్రామంలో మహిళలు, పెద్దలు ఆమెకు హారతులు పట్టి స్వాగతం పలికారు. ఈ ప్రచార కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## లక్కిరెడ్డిపల్లి లో టిడిపి ప్రభంజనం రెపరెపలాడిన పసుపు జెండాలు



### 1,జడ్పిటిసి, 12,ఎంపీటీసీ స్థానాలు టిడిపి వశం

లక్కిరెడ్డిపల్లి మండల జడ్పిటిసి, ఎంపీటీసీ స్థానాలు టిడిపి కైవసం చేసుకుంది .లక్కిరెడ్డిపల్లి జడ్పిటిసిగా యనమల మదనమోహన్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. 12 ఎంపీటీసీ స్థానాలకు గాను 12 మంది ఏకగ్రీవంగా ఎంపిక అయిన వారికి బి ఫారాలు అందజేశామని ఎన్నికల ప్రత్యేక అధికారి రెడ్డి చంద్రిక ,ఎంపీడీవో రెడ్డియ్య తెలిపారు. లక్కిరెడ్డిపల్లి మండలంలో 12 ఎంపీటీసీ స్థానాల వివరాలు లక్కిరెడ్డిపల్లి 1(కొందూరు లక్ష్మీదేవి)

లక్కిరెడ్డిపల్లి 2(వహీదాభి)

పందిళ్ళపల్లి (నిమ్మలపల్లి సుబ్బారెడ్డి)

కుర్నూతల (మండల ఈశ్వరమ్మ)

కస్తూరి రాజు గారి పల్లి (యాగంటి నీరజ) బి ఎర్రగుడి (కోటి శివకుమార్ నాయుడు)

దప్పేపల్లి (అంబా బత్తిన రమాదేవి) పాలెం గొల్లపల్లి (బీద గాని వెంకటరమణ)

మద్దిరేవుల ( అన్నపల్లి జాస్మిన్)

అనంతపురం ఈడిగాపల్లి (చింతమాను విజయ నాగరాజు)

దీన్నే పాడు (శంకరపు లక్ష్మీదేవి)

అప్ప కొండయ్య గారి పల్లి (వేడుక నిర్మల)

ఎంపీటీసీ లకు ఏకగ్రీవంగా డిక్లరేషన్ పత్రాలను అందజేశారు ఈ కార్యక్రమంలో ఎస్పై గోల్కొండ శోభ మండల టిడిపి క్లస్టర్ ఇన్చార్జి శంకరపు జయరాం మాజీ ఎంపీ ఉమాపతి రెడ్డి టిడిపి సీనియర్ నేత యాగంటి పాపయ్య టిడిపి నాయకులు కార్యకర్తలుతదితరులు పాల్గొన్నారు




# ఆ సమయంలో అతడే అండగా నిలిచాడు: జాన్వీ కపూర్

బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ శిఖర్ పహారియా గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. తన తల్లి, దివంగత నటి శ్రీదేవి ) చనిపోయినప్పుడు శిఖర్ తనకు ఎలా అండగా నిలిచాడో వివరించారు. 'కాఫీ విత్ కరణ్' (సీజన్-9) తాజా ఎపిసోడ్‌లో నటుడు వరుణ్ ధావన్‌తో కలిసి జాన్వీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు.

"శిఖర్ అప్పుడు లండన్‌లో చదువుకుంటున్నాడు. అమ్మ చనిపోయారని తెలియగానే తన సెమిస్టర్‌ను మధ్యలోనే వదిలేసి ముంబయికి వచ్చేశాడు. నిజానికి తను టౌన్‌లో వాళ్ల నాన్న దగ్గర ఉండాలి. కానీ, నాకు ఏ అవసరం వచ్చినా వెంటనే అందుబాటులో



ఉండాలనే ఉద్దేశంతో జుహూలోని తన స్నేహితుడి ఇంటికి షిఫ్ట్ అయ్యి, నెలరోజులు అక్కడే ఉన్నాడు. ఈ విషయం నాకు చాలా రోజుల తర్వాత తెలిసింది" అని జాన్వీ గుర్తు చేసుకున్నారు.జాన్వీ, శిఖర్ పహారియా రిలేషన్‌షిప్‌లో ఉన్నారంటూ కొంతకాలంగా వదంతులు వస్తున్నాయి. ఈ విషయాన్ని వారు బహిరంగంగా ప్రకటించకపోయినా.. పలు ఇంటర్వ్యూల్లో శిఖర్ గురించి జాన్వీ ఓపెన్‌గానే చెబుతున్నారు. ఇటీవల రాజ్ షమానీ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ.. "ప్రేమ అనేది ఎంతో సురక్షితమైన భావన. నాలో ఉన్న నిస్సహాయతను దూరం చేసింది శిఖర్ ప్రేమే. అతని దగ్గర నేను ఓ చిన్నపిల్లలా ప్రవర్తించగలను. నన్ను ఎవరూ జడ్జ్ చేయరనే స్వేచ్ఛ అక్కడ ఉంటుంది" అని ఆమె అన్నారు. అలాగే, మరో ఇంటర్వ్యూలో.. "నాకు 15-16 ఏళ్ల వయసున్నప్పటి నుంచే శిఖర్ నా జీవితంలో ఉన్నాడు. మేమిద్దరం ఒకరికొకరం తోడుగా ఉంటూ కలిసే పెరిగాం. నా కలలనే తన కలలుగా భావిస్తాడు" అని జాన్వీ తెలిపారు.

# 'వృషకర్మ' ప్రపంచం

నాగచైతన్య కథానాయకుడిగా కార్తీక్ దండు దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'వృషకర్మ'. మీనాక్షి చౌదరి కథానాయిక. సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర పతాకంపై బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ నిర్మిస్తున్నారు. డిసెంబరు 4న ప్రేక్షకుల ముందుకొస్తోంది. భారీ అంచనాలున్న ఈ సినిమాని ప్రముఖ నిర్మాత దిల్‌రాజుకి చెందిన శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ సంస్థ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో విడుదల చేస్తోంది.మైథలాజికల్ థ్రిల్లర్‌గా భారీ హంగులతో రూపొందుతున్న చిత్రమిది. ఇప్పటికే ప్రచార కార్యక్రమాలు ఊపందుకున్నాయి. ఇదివరకెన్నడూ చూడని ఓ ప్రపంచాన్ని ఈ సినిమాలో చూస్తారని సినీ వర్గాలు చెబుతున్నాయి. స్పర్శ్ శ్రీవాస్తవ, జయరామ్, బేబి కియారా తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అజనీష్ బి.లోక్‌నాథ్, ఛాయాగ్రహణం: రాగుల్ డి.హెరియన్, ప్రొడక్షన్ డిజైన్: శ్రీనాగేంద్ర తంగాల.

# ఈ విషయంలో మార్పు మొదలైంది!

'ఏష నాగుల కట్ట మీద..' అంటూ ఇటీవలే థియేటర్లలో తన స్టెప్పులతో ఉర్రూతలూగించిన కథానాయిక కీర్తి సురేశ్.. ఇప్పుడు లేడీ డాన్‌గా తనలోని మరో కోణాన్ని సినీప్రియులకు పరిచయం చేయడానికి సన్నద్ధమవుతున్నారు. ఆమె, రాధికా ఆప్టే ప్రధాన పాత్రల్లో నటించిన సిరీస్ 'అక్క'. కల్పిత నగరంలోని మాతృస్వామ్య సమాజ నేపథ్యంలో సాగే ఈ సిరీస్ ఈ నెల 30న రాబోతుంది. ఈ నేపథ్యంలోనే ఓ కార్యక్రమంలో పాల్గొన్న కీర్తి మాట్లాడుతూ.. "మహిళా ప్రాధాన్య పాత్రలతో కూడిన యాక్షన్, గ్యాంగ్‌స్టర్ చిత్రాలు వెండితెరపై చాలా తక్కువగా వస్తుంటాయి. నిజ జీవితంలో కూడా మనకు పురుష గ్యాంగ్‌స్టర్ల గురించే ఎక్కువ తెలుసు. వారి కథలు వింటూనే పెరిగాం. బహుశా అందుకనే ఇలాంటి పరిస్థితి ఏర్పడింది. అయితే మహిళా ప్రధానాంశాలతో కూడిన కథనాలపై నమ్మకం లేని చిత్రనిర్మాతలూ ఉన్నారు. వారు కూడా లేడీ ఓరియెంటెడ్ సినిమాల కొరతకు ఒక కారణం. గ్యాంగ్‌స్టర్, పూర్తిస్థాయి యాక్షన్ కథను ఒక నటి సమర్థవంతంగా చేయగలదని ప్రతి దర్శకుడూ నమ్మకపోవచ్చు. కానీ ఇప్పుడా పరిస్థితులు కనిపించట్లేదు. కథ బాగుంటే చాలు.. నటీమణులతో సంబంధం లేకుండా ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. అందుకే నాయికా ప్రాధాన్య చిత్రాల విషయంలో మార్పు మొదలైందని అనుకుంటున్నా" అని చెప్పుకొచ్చారు.



# ముందు అంటారు.. తర్వాత క్షమాపణలు చెబుతారు: రామాయణ ట్రోల్స్‌పై రెహమన్



'రామాయణ' సినిమాలోని పాటలపై వస్తోన్న విమర్శలపై సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ స్పందించారు. మొదట విమర్శించిన వారే.. ఆ తర్వాత తమ అభిప్రాయాన్ని మార్చుకుని క్షమాపణలు చెబుతున్నారని అన్నారు. విమర్శలను పట్టించుకోనని.. తన పనిని నిజాయతీగా చేయడంపైనే దృష్టి పెడతానని స్పష్టం చేశారు. ముఖ్యంగా 'రావణ తాండవ్', 'రంగులు రంగులే' పాటలపై చర్చ జరుగుతోన్న నేపథ్యంలో రెహమాన్ ఈ వ్యాఖ్యలు చేశారు. సినిమాకు సంగీతం అందించే క్రమంలో తాము ఎంత కష్టపడుతున్నామో రెహమాన్ వివరించారు. "మేము చాలా పని చేస్తాం. ట్యూన్స్‌లో పదేపదే మార్పులు చేస్తుంటాం. ఇవన్నీ పూర్తయ్యేసరికి ఇతరుల కామెంట్లను చూడటానికి కూడా శక్తి మిగలదు. ఒక పాటను ఎన్నోసార్లు విని, సంతృప్తి చెందిన తర్వాతే విడుదల చేస్తాం. నిన్న విమర్శించిన వాళ్లే.. ఈ రోజు క్షమాపణలు చెబుతారని మా అబ్బాయి నాతో అంటుంటాడు. నేను మాత్రం నా పని నిజాయతీగా చేశాను.. ప్రజలు దాన్ని ఆదరిస్తారని ఆశిస్తాను" అని రెహమాన్ పేర్కొన్నారు.తన సంగీతంపై ప్రేక్షకుల అంచనాలపై కూడా రెహమాన్ మాట్లాడారు. కెరీర్ ప్రారంభంలో చేసిన పాటలనే మళ్లీ చేయాలంటూ కొందరు కోరుతుంటారని.. ఒకే తరహా సంగీతానికి పరిమితం కావడం తనకు ఇష్టం లేదని చెప్పారు. రెహమన్ స్వరకల్పనలో... నితేశ్ తివారీ దర్శకుడిగా రూపొందిన చిత్రం 'రామాయణ' . శ్రీరాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్, సీతమ్మగా సాయిపల్లవి నటించారు. తొలి భాగం నవంబరు 5న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# 50 ఏళ్ల మహిళగా... నన్ను నేను గుర్తుపట్టలేకపోయా: వామికా గబ్బీ



30 ఏళ్ల వయసులో 50 ఏళ్ల మహిళగా కనిపించడమంటే కొంచెం కష్టమే. నటి వామికా గబ్బీ )కి అలాంటి అనుభవమే ఎదురైంది. ఆమె నటించిన తాజా చిత్రం 'ప్రహార్' . ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న వామికా.. సినిమా గురించి పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ఈ మూవీలో 50 ఏళ్ల వయసున్న జ్యోతి నికమ్ పాత్ర కోసం సిద్ధమైన అనుభవాన్ని పంచుకున్నారు. ఆ మేకప్ పూర్తయ్యాక అద్దంలో తనను తాను చూసుకున్నప్పుడు అస్సలు గుర్తుపట్టలేకపోయానని తెలిపారు. ఈ మేరకు ఇన్‌స్టా వేదికగా ఆమె ఓ పోస్ట్ పెట్టారు. "మేకప్ పూర్తయ్యాక తొలిసారి అద్దంలో చూసుకున్నప్పుడు అలాగే చూస్తుండిపోయా. అదొక కొత్త అనుభూతి. ఆ గెటప్‌లో నన్ను నేను అస్సలు గుర్తుపట్టలేకపోయా. మేకప్ కోసం గంటల తరబడి కూర్చున్నప్పుడు.. నాలో వస్తున్న మార్పుల్ని గమనించాను. అప్పుడే ఆ పాత్ర నా మనసుకు బాగా కనెక్ట్ అయింది. సెట్‌లో ఎవరైనా నా ఫొటో తీసి చూపిస్తే తప్ప.. నేను ఇంతలా మారిపోయానా? అనే విషయం నాకు గుర్తుకొచ్చేది కాదు" అని ఆమె చెప్పుకొచ్చారు. ఈ మూవీలో జ్యోతి నికమ్ పాత్ర చేయడం తనకు దక్కిన ఒక అరుదైన అవకాశమని, నటనలో కొత్త కోణాన్ని ఆవిష్కరించేందుకు ఇది ఉపయోగపడిందని వామికా సంతోషం వ్యక్తం చేశారు."నిజం చెప్పాలంటే ఈ సినిమా చేయడానికి మొదట్లో చాలా భయపడ్డా. 'వద్దు' అనుకోవడానికి నా దగ్గర చాలా కారణాలున్నాయి. కానీ, ఎప్పుడైతే స్క్రిప్ట్ చదివానో అప్పుడే ఈ సినిమా కచ్చితంగా చేయాలని నిర్ణయం తీసుకున్నా. వయసుతో పాటు ఆమె ముఖంలో, శరీరంలో వచ్చే మార్పులు, మారుతున్న ఆమె కలలు.. ఇలా ప్రతీది ఈ చిత్రంలో కొత్తగా అనిపించింది. 30 ఏళ్ల వయసున్న మహిళను.. 50 ఏళ్లు వచ్చేసరికి జీవితం ఎలా మార్చేసిందనేది ఇందులో చూపించారు. ఆ 'జ్యోతి' పాత్రలో ఒదిగిపోయే క్రమంలో నా గురించి నేను మరింత కొత్తగా తెలుసుకున్నాను. కొన్ని పాత్రలు మనల్ని ఎప్పటికీ వదిలిపోవు" అని వామిక తన పోస్ట్‌లో రాసుకొచ్చారు.ఇక, ఈ చిత్రాన్ని అవినాశ్ అరుణ్ దర్శకత్వంలో తెరకెక్కించారు. దినేశ్ విజన్ నిర్మించారు. రాజ్‌కుమార్ రావ్, లలిత్ ప్రభాకర్, జైదీప్ అహ్లావత్, వామికా గబ్బీ, ఆశిష్ విద్యార్థి, సికిందర్ ఖేర్, నాజర్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. అక్టోబరు 16న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చింది.

# అందుకే 'వారణాసి' గ్లింప్స్ రిలీజ్ చేశాం: రాజమౌళి




మహేశ్‌బాబు హీరోగా, రాజమౌళి తెరకెక్కిస్తోన్న చిత్రం 'వారణాసి' . ఈ చిత్రంపై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. తాజాగా ఈ సినిమా కథ గురించి రాజమౌళి ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ఇటీవల బ్రెజిల్ వెళ్లిన ఆయన .. అక్కడి యూట్యూబ్ ఛానల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారు."కొన్నిసార్లు సినిమా గురించి చెప్పడానికి నేను ఇష్టపడను. ఎందుకంటే, మాటలు సినిమా విస్తృతిని, దాని స్థాయిని పూర్తిగా వివరించలేవు. అందుకే 'వారణాసి' ఎలా ఉండబోతోందో చూపించడానికి గతేడాది ఒక గ్లింప్స్‌ను విడుదల చేశాం. కథ గురించి ఎక్కువ వివరాలు చెప్పకుండా, ప్రేక్షకులు ఈ సినిమాలో ఎలాంటి ప్రపంచాలను చూడబోతున్నారు, ఎలాంటి అనుభూతిని పొందబోతున్నారు.. అనేది ఆ వీడియో ద్వారా చూపించాం" అని రాజమౌళి వివరించారు.'వారణాసి'ని కేవలం టైమ్ ట్రావెల్ కథగా మాత్రమే చూడకూడదని రాజమౌళి తన మాటలతో స్పష్టం చేశారు. "ఇది వివిధ ప్రపంచాల నుంచి సాగే ఒక సాహసయాత్ర. అంటార్కిటికా నుంచి ఆఫ్రికా వరకు, అక్కడి నుంచి వారణాసి నగరం వరకు ప్రయాణం సాగుతుంది. విభిన్న కాలమానాల్లోకి వెళ్తుంది. పురాణాల కాలంలోకి కూడా తీసుకెళ్తుంది. అక్కడ మీకు భారీ ఆకారాలు కలిగిన జీవులు, దేవుళ్లు, ఇలాంటి ఎన్నో అంశాలు కనిపిస్తాయి. అయితే, ఈ మొత్తం కథను నడిపించేది తండ్రీకొడుకుల మధ్య ఉండే భావోద్వేగం, ఇద్దరి మధ్య ప్రేమ. ఈ భావోద్వేగాలే మొత్తం సాహసయాత్రను ముందుకు నడిపిస్తాయి" అని రాజమౌళి పేర్కొన్నారు. ఇక ఈ సినిమాలో మహేశ్‌బాబు 'రుద్ర' పాత్రలో కనిపించనున్నారు. ప్రియాంక 'మందాకిని'గా, పృథ్వీరాజ్ సుకుమారన్ 'కుంభ' అనే ప్రతినాయకుడి పాత్రలో నటిస్తున్నారు. ఆర్‌ఆర్‌ఆర్ తర్వాత రాజమౌళి నుంచి వస్తోన్న చిత్రం కావడంతో ఆయన ఎలాంటి ప్రపంచాన్ని సృష్టించారో తెలుసుకోవడానికి ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

ట్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక
సాంస్కృతికం
మన సంస్కృతి.. మన గర్వం..


# ప్రత్యేక అవసరాలున్న పిల్లల దత్తతకు విస్తృత అవకాశాలు కల్పించాలి: కారా

**జార్ఖండ్, బీహార్, ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లోని 115 జిల్లాల నుంచి 175 మందికి పైగా భాగస్వాములు**

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:**
ప్రత్యేక అవసరాలున్న దివ్యాంగ పిల్లలకు సురక్షితమైన, శాశ్వతమైన కుటుంబాలను అందించేందుకు కుటుంబ ఆధారిత పునరావాసాన్ని బలోపేతం చేయాలని కేంద్ర దత్తత వనరుల సంస్థ (జూా=ూా) పేర్కొంది. ఈ దిశగా తూర్పు జోన్ ఐదో ప్రాంతీయ సంప్రదింపుల వర్క్‌షాప్‌ను అక్టోబర్ 27న జార్ఖండ్‌లోని రాంచీలో నిర్వహించింది. కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో, జార్ఖండ్ ప్రభుత్వం, రాష్ట్ర దత్తత వనరుల సంస్థ (ూూా=ూా) సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. 2025 దత్తత అవగాహన ప్రచారంలో భాగంగా నిర్వహించిన ఈ వర్క్‌షాప్ "ప్రత్యేక అవసరాలున్న పిల్లల సంస్థాగతేతర పునరావాసాన్ని ప్రోత్సహించడం" అనే అంశంపై దృష్టి సారించింది. సంబంధిత విభాగాల మధ్య సమన్వయం పెంచడం, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించడం, దత్తత మరియు పునరావాసానికి అనువైన ఆచరణాత్మక మార్గాలను గుర్తించడం కార్యక్రమం లక్ష్యంగా పెట్టుకుంది.

జార్ఖండ్, బీహార్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, సిక్కిం రాష్ట్రాలతో కూడిన తూర్పు జోన్ నుంచి, నాలుగు రాష్ట్రాల్లోని సుమారు 115 జిల్లాలకు ప్రాతినిధ్యం వహిస్తూ 175 మందికి పైగా భాగస్వాములు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. వివిధ రంగాల ప్రతినిధులు తమ అనుభవాలు, ఉత్తమ విధానాలను పంచుకోవడంతో పాటు, సమన్వయంతో కూడిన కుటుంబ ఆధారిత పునరావాస వ్యూహాలపై చర్చించారు.

కారా సీఈఓ భావనా సక్సేనా, మహిళా, శిశు అభివృద్ధి మరియు సామాజిక భద్రత శాఖ కార్యదర్శి ఉమాశంకర్ సింగ్, దివ్యాంగుల రాష్ట్ర కమిషనర్ కీర్తిశ్రీ జి., జార్ఖండ్ సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ కిరణ్ పాసి, జార్ఖండ్ రాష్ట్ర బాలల రక్షణ సంఘం డైరెక్టర్, సభ్య కార్యదర్శి బిజయ్ కుమార్ సిన్హా తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



సమావేశంలో భావనా సక్సేనా మాట్లాడుతూ, లక్ష్యిత అవగాహన కార్యక్రమాలు, భాగస్వాముల భాగస్వామ్యంతో ప్రోత్సాహకరమైన పురోగతి సాధించామని తెలిపారు. దత్తత ప్రక్రియ ఆలస్యమయ్యే అడ్డంకులను తొలగించి, దత్తత తీసుకోవాలనుకునే తల్లిదండ్రులకు అందించే మద్దతును బలోపేతం చేయాలని సూచించారు. ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు శాశ్వత కుటుంబాలు లభించేందుకు నిరంతర అవగాహనతో పాటు, పిల్లల అవసరాలను కేంద్రంగా చేసుకున్న సున్నితమైన విధానం అవసరమని పేర్కొన్నారు.

అవగాహనతో పాటు నిరంతర, ఫలితాల ఆధారిత చర్యలు చేపట్టాలని ఉమాశంకర్ సింగ్ అన్నారు. "బాలల రక్షణ విభాగాలు, వైద్య నిపుణులు, దత్తత సంస్థల మధ్య నిరంతర సహకారంతో మన నిబద్ధతను పిల్లలకు ఉపయోగపడే ఫలితాలుగా మార్చాలి" అని ఆయన పిలుపునిచ్చారు.

రాష్ట్ర దత్తత వనరుల సంస్థలు (ూూా=ూాం), ప్రత్యేక దత్తత సంస్థలు (ూూాూాం), బాలల సంరక్షణ సంస్థలు (జజ×ం), జిల్లా బాలల రక్షణ విభాగాలు (ఱజూఖం), జిల్లా వైద్యాధికారులు, బాలల సంక్షేమ కమిటీలు, వైద్య సంస్థలు, బాలల రక్షణ రంగ సంస్థల ప్రతినిధులు వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. దత్తతకు సంబంధించిన వైద్య, చట్టపరమైన, విధానపరమైన, పరిపాలనా అంశాలపై సమగ్ర చర్చ జరిగింది.

వైద్య పరీక్షలు, చట్టపరమైన మరియు విధానపరమైన అవసరాలు, ఆర్థిక అంశాలు, ఫిర్యాదుల పరిష్కారం, శాఖల మధ్య సమన్వయంపై చర్చించారు. సకాలంలో వైద్య అంచనాలు, తగిన సంరక్షణ ప్రణాళిక, సులభతర దత్తత ప్రక్రియ కోసం వైద్య సంస్థలు, బాలల రక్షణ వ్యవస్థల మధ్య అనుసంధానాన్ని బలోపేతం చేయాలని సూచించారు.

ప్రాంతాల వారీగా ఎదురయ్యే సమస్యలను గుర్తించి, ఆచరణ సాధ్యమైన, కాలపరిమితితో కూడిన సిఫారసులను రూపొందించేందుకు గ్రూప్ చర్చలు నిర్వహించారు. విస్తృత స్థాయిలో అవగాహన కల్పించడం, సంస్థల సామర్థ్యాన్ని పెంచడం, విధానపరమైన అడ్డంకులను తొలగించడం, దత్తత ప్రక్రియలో ప్రతి దశలోనూ పిల్లలకు మెరుగైన మద్దతు అందించడం వంటి అంశాలు చర్చకు వచ్చాయి.

ప్రత్యేక అవసరాలున్న పిల్లల విజయవంతమైన దత్తత కథను వివరించే లఘు డాక్యుమెంటరీని ఈ సందర్భంగా ప్రదర్శించారు. కుటుంబ ఆధారిత సంరక్షణ పిల్లలకు భద్రత, భావోద్వేగ మద్దతు, గౌరవం, కుటుంబంలో భాగమనే శాశ్వత భావనను అందించగలదని ఆ కథనం చాటిచెప్పింది.

రాంచీ వర్క్‌షాప్‌తో కారా ప్రాంతీయ సంప్రదింపుల వర్క్‌షాప్‌ల ఐదో కార్యక్రమాన్ని పూర్తి చేసింది. గతంలో ఉత్తర జోన్ కోసం రాజస్థాన్, ఈశాన్య జోన్ కోసం అస్సాం, మధ్య జోన్ కోసం మధ్యప్రదేశ్, పశ్చిమ జోన్ కోసం మహారాష్ట్రలో సంప్రదింపులు నిర్వహించారు. ఈ సమావేశాలు ప్రాంతాలవారీ సవాళ్లను గుర్తించేందుకు, సమర్థమైన విధానాలను పంచుకునేందుకు, దత్తత మరియు బాలల రక్షణ రంగాల్లో పనిచేసే భాగస్వాముల మధ్య సహకారాన్ని పెంపొందించేందుకు వేదికగా నిలిచాయి.

తూర్పు జోన్ సమావేశంలో వచ్చిన సిఫారసులు దత్తత ప్రక్రియను మెరుగుపరచడం, వైద్య మరియు బాలల రక్షణ వ్యవస్థల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడం, దేశవ్యాప్తంగా ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు కుటుంబ ఆధారిత పునరావాస అవకాశాలను విస్తరించడం వంటి భవిష్యత్ కార్యక్రమాలకు దోహదపడనున్నాయి.

ప్రతి బిడ్డకు సంరక్షణతో పాటు ప్రేమించే, విలువనిచ్చే, తోడ్పడే కుటుంబంలో ఎదిగే అవకాశం ఉండాలనే సూత్రంతో, పిల్లల అవసరాలకు ప్రాధాన్యమిచ్చే సమ్మిళిత దత్తత విధానాన్ని కారా ముందుకు తీసుకెళ్తోంది.

# తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు

**భక్తులకు పటిష్ట ఏర్పాట్లు : టీటీడీ జేఈవో డా. ఎ. శరత్**



**తిరుపతి, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:**
తిరుచానూరు పద్మావతి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు పటిష్టమైన ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని టీటీడీ జేఈవో డా. ఎ. శరత్ అధికారులను ఆదేశించారు.

డిసెంబరు 5న అంకురార్పణతో ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలు డిసెంబరు 6 నుంచి 14వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం తిరుచానూరులోని ఆలయం, వాహన మండపం, నాలుగు మాడ వీధులు, పార్కింగ్ ప్రాంతాలు, క్యూలైన్లు, పుష్కరిణి, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను ఆయన పరిశీలించారు.

**భక్తుల సౌకర్యాలకు ప్రాధాన్యం**

బ్రహ్మోత్సవాల్లో భక్తుల రద్దీని సమర్థంగా నియంత్రించేందుకు హోల్డింగ్ పాయింట్లు, క్యూలైన్లు, అన్నప్రసాదం, లడ్డూ, టికెట్ కౌంటర్లను పద్ధతిగా ఏర్పాటు చేయాలని సూచించారు. ముఖ్యంగా గరుడ వాహనం, గజ వాహనం, పంచమి తీర్థం సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలన్నారు.

**విద్యుత్, పుష్పాలంకరణలతో వైభవంగా ఉత్సవాలు**

విజిలెన్స్, ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ విభాగాలు, ఆలయ సిబ్బంది సమన్వయంతో పక్కా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఆలయం, వాహన మండపం, మాడ వీధుల్లో ఆకర్షణీయమైన విద్యుత్, పుష్పాలంకరణలు చేపట్టాలని, వారంలోగా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భక్తిశ్రద్ధలతో పాల్గొని అమ్మవారి దివ్యదర్శనం చేసుకుని ఆమె కృపకు పాత్రులు కావాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సీఈ మనోహరం, డిప్యూటీ ఈవోలు హరీంద్రనాథ్, సెల్వం, ఎస్ఈ వేంకటేశ్వర్లు, వీజీవో గిరిధర, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# జమ్మూలో జ=జ శాశ్వత భవన నిర్మాణ పనులను సమీక్షించిన కేంద్ర మంత్రి వీరేంద్ర కుమార్

**రూ.24 కోట్లతో పునరావాసం, నైపుణ్యాభివృద్ధి కేంద్రం**

**దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు, సహాయక పరికరాల తయారీకి ప్రత్యేక ప్రయోగశాలలు**

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:**
జమ్మూలోని దివ్యాంగుల నైపుణ్యాభివృద్ధి, పునరావాసం, సాధికారత కోసం నిర్మిస్తున్న సమగ్ర ప్రాంతీయ కేంద్రం (జ=జ) శాశ్వత భవన పనులను కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ మంత్రి డాక్టర్ వీరేంద్ర కుమార్ సమీక్షించారు. జమ్మూ కశ్మీర్‌లోని సాంబా జిల్లా విజయ్‌పూర్ సమీపంలోని చక్ జవాలా గ్రామంలో నిర్మాణ పనుల పురోగతిని ఆయన పరిశీలించారు. సుమారు రూ.24 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న ఈ కేంద్రం అందుబాటులోకి వస్తే, జమ్మూ ప్రాంతంలో దివ్యాంగులకు పునరావాసం, విద్య, శిక్షణ, సహాయక సేవలు విస్తరించనున్నాయి. ప్రస్తుతం జమ్మూ నగరంలో పరిమిత స్థాయిలో పనిచేస్తున్న జ=జ, కొత్త భవనంతో మరింత విస్తృతంగా సేవలందించగలదని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేసి, అవసరమైన మౌలిక వసతులు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను సూచించారు. పునరావాసం, ప్రత్యేక విద్య, ముందస్తు జోక్యం, నైపుణ్యాభివృద్ధి, దివ్యాంగుల సాధికారతకు ఈ కేంద్రం



కీలకంగా మారుతుందని చెప్పారు. సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ దివ్యాంగుల సాధికారత విభాగం సంయుక్త కార్యదర్శి రాజీవ్ శర్మతో పాటు పలువురు ఉన్నతాధికారులు మంత్రితో ఉన్నారు. జ=జ జమ్మూ డైరెక్టర్ డాక్టర్ రోహ్నికా శర్మ నిర్మాణంలో పూర్తయిన పనులు, మిగిలిన పనులు, ప్రాజెక్టును సకాలంలో పూర్తిచేసి కార్యకలాపాలు ప్రారంభించేందుకు అవసరమైన మౌలిక వసతుల వివరాలను మంత్రికి తెలియజేశారు. కేంద్రంలో దివ్యాంగ పిల్లలకు ఫిజియోథెరపీ, ప్రత్యేక శిక్షణ అందించడంతో పాటు, తల్లిదండ్రులు మరియు సంరక్షకులకు కూడా శిక్షణ కల్పించనున్నారు. దివ్యాంగులకు సహాయక పరికరాలు అందించేందుకు ప్రధానమంత్రి దివ్యాశ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. దివ్యాంగుల విద్యకు సంబంధించిన బి.ఎడ్, ఎం.ఎడ్ కోర్సులను ప్రారంభించే ప్రణాళిక ఉందని, వాటి ద్వారా ఈ రంగంలో శిక్షణ పొందిన యువతకు విద్యా, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. కృత్రిమ అవయవాలు, ఇతర సహాయక పరికరాలను కొలవడం, తయారు చేయడం, అమర్చడం కోసం ప్రత్యేక ప్రయోగశాలలను కూడా ఏర్పాటు చేయనున్నారు. ఈ సదుపాయాలు దివ్యాంగులు రోజువారీ పనులను మరింత సులభంగా, స్వతంత్రంగా చేసుకునేందుకు తోడ్పడతాయని పేర్కొన్నారు. దివ్యాంగుల సాధికారత 'సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్', ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాల్లో భాగమని డాక్టర్ వీరేంద్ర కుమార్ అన్నారు. పిల్లల నుంచి వృద్ధుల వరకు దివ్యాంగులకు అవసరమైన సేవలను వారి ప్రాంతానికి చేరువ చేయడం ద్వారా, ఈ కేంద్రం జమ్మూ ప్రాంతంలో ఉన్న దీర్ఘకాలిక అవసరాన్ని తీర్చనుందని తెలిపారు. దివ్యాంగులకు మద్దతు ఇవ్వడం వారి కుటుంబాలను బలోపేతం చేయడంతో పాటు, సమాజం మరియు దేశాభివృద్ధిలో వారి భాగస్వామ్యాన్ని పెంచుతుందని చెప్పారు. జ=జ జమ్మూ కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖలోని దివ్యాంగుల సాధికారత విభాగం పరిధిలో, న్యూఢిల్లీలోని పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జాతీయ శారీరక దివ్యాంగుల సంస్థ ద్వారా నిర్వహించబడుతోంది.

# జగన్ కంచుకోట బద్దలు

**అమరావతి, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:**
స్థానిక ఎన్నికల్లో మాజీ ముఖ్యమంత్రి జగన్ కంచుకోట పులివెందులను టీడీపీ బద్దలు కొట్టింది. ఆ నియోజకవర్గ పరిధిలో 65 ఎంపీటీసీ స్థానాలు ఉంటే అందులో 64 స్థానాలను ఏకగ్రీవంగా గెలుచుకుంది. అలాగే 7 జడ్పీటీసీ స్థానాల్లో మూడు తన ఖాతాలో వేసుకుంది. వేంపల్లి మండలంలో 18 ఎంపీటీసీ స్థానాల్లో 17 గెలుపొందింది. ఇప్పటికే పులివెందుల మున్సిపాలిటీలో 40 వార్డులకు 20 వార్డులను టీడీపీ ఏకగ్రీవంగా కైవసం చేసుకుంది. చిత్తూరులో పలు స్థానాలను అధికార కూటమి ఏకగ్రీవంగా గెలుస్తోంది. ఈ జిల్లాలోని మూడు జడ్పీటీసీ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. యాదమర్రి జడ్పీటీసీగా యశోద, బంగారు పాలెం జడ్పీటీసీగా సుచిత్ర జయప్రకాష్, పూతలపట్టు జడ్పీటీసీగా శైలజ తేజో మూర్తి ఏకగ్రీవంగా గెలిచారు.

అలాగే నంద్యాల జిల్లాలో 8 జడ్పీటీసీ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. బనగానపల్లె నియోజకవర్గంలోని బనగానపల్లి, కొలిమిగుండ్ల, అవుకు, సంజామల, కోవెలకుంట్ల జడ్పీటీసీ స్థానాలను కూటమి ఖాతాలో వేసుకుంది. డోన్ నియోజకవర్గంలో బేతంచెర్ల, ప్యాపిలి, శ్రీశైలం నియోజకవర్గంలోని వెలుగోడు స్థానాలనూ ఏకగ్రీవంగా కైవసం చేసుకుంది.

# క్రీడల్లో స్వచ్ఛతకు భారత్ కట్టుబడి ఉంది: డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ

**డోపింగ్ ఉల్లంఘనలపై క్రిమినల్ నిబంధనలు తీసుకొచ్చేలా జాతీయ యాంటీ డోపింగ్ చట్టానికి మరో సవరణ**

**2025--26లో 7 వేలకు పైగా పరీక్షలు, 350కి పైగా అవగాహన కార్యక్రమాలు: కేంద్ర క్రీడల మంత్రి**

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:**
క్రీడల్లో నైతికత, పారదర్శకతను కాపాడేందుకు భారత్ గట్టిగా కట్టుబడి ఉందని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ తెలిపారు. యునెస్కో అంతర్జాతీయ డోపింగ్ నిరోధక కన్వెన్షన్ పరిధిలో 2026--27 సంవత్సరానికి సంబంధించి జూూ10 బ్యూరో మూడో అధికారిక సమావేశానికి, ఫండ్ ఆమోద కమిటీ నాలుగో అధికారిక సమావేశానికి ఆయన న్యూఢిల్లీలో అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా డాక్టర్ మాండవీయ మాట్లాడుతూ, "క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభతో పాటు నిజాయతీ కూడా ఉండాలని భారత్ గట్టిగా విశ్వసిస్తోంది. ప్రతిభ, సాధన, కష్టంతోనే విజయం నిర్ణయించబడాలి; నిషేధిత పదార్థాలు లేదా పద్ధతులతో కాదు. డోపింగ్ ముప్పుపై జీరో టాలరెన్స్ పాటించాలని, స్వచ్ఛమైన క్రీడలను ప్రోత్సహించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎప్పటికప్పుడు స్పష్టం చేస్తున్నారు" అని అన్నారు.

జాతీయ యాంటీ డోపింగ్ చట్టం--2022, 2025 సవరణతో దేశంలో డోపింగ్ నిరోధక వ్యవస్థను మరింత బలోపేతం చేసినట్లు మంత్రి వివరించారు. ఈ చట్టం, సవరణ 2026 జూలైలో అమల్లోకి వచ్చాయని తెలిపారు. "డోపింగ్ ఉల్లంఘనలను మరింత సమర్థంగా ఎదుర్కొనేందుకు, కోచ్‌లు మరియు సరఫరా వ్యవస్థలోని సంబంధిత వర్గాల బాధ్యతను నిర్ధారించే క్రిమినల్ నిబంధనలతో మరో సవరణను పార్లమెంట్ తదుపరి సమావేశంలో తీసుకొస్తాం" అని వెల్లడించారు.




2025--26లో భారత జాతీయ యాంటీ డోపింగ్ సంస్థ (చీూణూూ) 7 వేలకు పైగా పరీక్షలు నిర్వహించిందని, 350కి పైగా విద్యా, అవగాహన కార్యక్రమాల ద్వారా 27 వేల మందికి చేరువైందని మాండవీయ తెలిపారు. ప్రమాద అంచనా ఆధారిత పరీక్షలు, సమాచార ఆధారిత దర్యాప్తులపై ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్లు చెప్పారు. నిషేధిత పదార్థాలపై సమాచారం అందించే 'నో యువర్ మెడిసిన్' మొబైల్ యాప్‌లో ఐదు లక్షలకు పైగా శోధనలు నమోదయ్యాయని, మందుల వినియోగంపై సరైన నిర్ణయాలు తీసుకునేందుకు ఇది సహాయపడుతోందని తెలిపారు.

కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ, విద్యాశాఖ, యునెస్కో మధ్య త్వరలో అవగాహన ఒప్పందం కుదరనుంది. దీని ద్వారా 'స్పోర్ట్ వాల్యూస్ ఇన్ ఎవ్రీ క్లాస్‌రూమ్' టూల్‌కిట్‌ను భారత్‌లో ప్రవేశపెట్టనున్నారు. క్రీడా విలువలు, నైతికత, నిజాయతీని తరగతి గదుల్లోకి తీసుకెళ్లి లక్షలాది మంది విద్యార్థులకు చేరవేయడం ఈ కార్యక్రమం లక్ష్యం.

డోపింగ్‌పై ప్రపంచస్థాయి సహకారాన్ని ముందుకు తీసుకెళ్లడం, కన్వెన్షన్ అమలును బలోపేతం చేయడం ఈ సమావేశం ప్రధాన ఉద్దేశం. ప్రపంచ డోపింగ్ నిరోధక వ్యవస్థలో ప్రభుత్వ సంస్థల బాధ్యతలు, పాత్రలను వివరించే ముసాయిదా పత్రంపై చర్చించారు. అలాగే జాతీయ అనుసరణ వేదిక ద్వారా సభ్యదేశాలతో కలిసి విద్యా సామర్థ్యం, పరిశోధనలను పెంపొందించడం, వనరుల సమీకరణ, 2026--2031 ఫండ్ కార్యాచరణ వ్యూహం, నిబంధనల అమలు, సామర్థ్య నిర్మాణం వంటి అంశాలు అజెండాలో ఉన్నాయి.

ప్రారంభ సమావేశంలో అజర్‌బైజాన్ యువజన, క్రీడల శాఖ మంత్రి, జూూ10 బ్యూరో ఛైర్‌పర్సన్ ఫరీద్ గయిబోవ్, ఫండ్ ఆమోద కమిటీ ఛైర్‌పర్సన్ ల్యూక్ మెక్‌కాన్, భారత క్రీడల శాఖ కార్యదర్శి, జూూ10 బ్యూరో వైస్ ఛైర్‌పర్సన్ హరి రంజన్ రావు, యునెస్కో సామాజిక విధానాలు, సమ్మిళిత అభివృద్ధి విభాగం డైరెక్టర్ గుస్తావో మెరినోతో పాటు జాంబియా, స్పెయిన్, రష్యా ప్రతినిధులు పాల్గొన్నారు.

జూూ10 బ్యూరోలో గ్రూప్--4 తరఫున వైస్ ఛైర్‌పర్సన్‌గా భారత్ ప్రాతినిధ్యం వహిస్తోంది. ప్రపంచ క్రీడా పాలనలో భాగస్వామ్యాన్ని పెంచుతూ, నైతిక క్రీడా విధానాలకు, యునెస్కో డోపింగ్ నిరోధక అంతర్జాతీయ కన్వెన్షన్ వంటి అంతర్జాతీయ వ్యవస్థలకు మద్దతు ఇస్తున్నట్లు ఈ సంయుక్త సమావేశం చాటిచెప్పింది.

# లేబర్ కోడ్‌లు, కార్మిక సంక్షేమంపై 'శ్రమ్ సంవాద్' ముగింపు

**కేంద్ర--రాష్ట్ర సమన్వయం, సాంకేతికత ఆధారిత సేవలపై అవగాహనకు ప్రాధాన్యం**




**లక్నో, అక్టోబర్ 27, ట్రైనెట్ న్యూస్:**
కార్మిక చట్టాలు, కార్మిక సంక్షేమం, సామాజిక భద్రతపై రెండు రోజుల రాష్ట్రస్థాయి సామర్థ్యాభివృద్ధి, అవగాహన కార్యక్రమం 'శ్రమ్ సంవాద్' లక్నోలో ముగిసింది. కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ, ఉత్తరప్రదేశ్ కార్మిక శాఖ సంయుక్తంగా అక్టోబర్ 26, 27 తేదీల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి.

కొత్త లేబర్ కోడ్‌లు, వాటి కింద రూపొందించిన నిబంధనలపై యజమానులు, మానవ వనరులు, న్యాయ, ఆర్థిక రంగాల నిపుణులకు అవగాహన కల్పించడం కార్యక్రమ లక్ష్యం. కార్మిక సంస్కరణలు, సంక్షేమం, సామాజిక భద్రతపై సంస్థాగత సామర్థ్యాన్ని పెంచడంతో పాటు, కేంద్ర--రాష్ట్ర సమన్వయం, భాగస్వాముల చర్చలు, సాంకేతికత ఆధారిత కార్మిక, ఉపాధి సేవల పంపిణీని ప్రోత్సహించడంపైనా దృష్టి సారించారు.

కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ, ఉత్తరప్రదేశ్ కార్మిక శాఖ ఉన్నతాధికారులతో పాటు, కేంద్ర ప్రధాన కార్మిక కమిషనర్ కార్యాలయం, ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (జూూఖీూ), ఉద్యోగుల రాష్ట్ర బీమా సంస్థ (జూూ×జ), డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ లేబర్ వెల్ఫేర్ (ఱ+ూఔ) ప్రతినిధులు పాల్గొన్నారు. యజమానులు, పరిశ్రమల ప్రతినిధులు, న్యాయ, హెచ్‌ఆర్, ఆర్థిక రంగాల నిపుణులు కూడా కార్యక్రమానికి హాజరయ్యారు.

త్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక



# రాష్ట్రాల పారిశ్రామికోత్పత్తి సూచీ ప్రాతిపదిక సవరణపై వర్క్‌షాప్

**అక్టోబర్ 28 నుంచి 30 వరకు తిరువనంతపురంలో నిర్వహణ**

**న్యూఢిల్లీ, త్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:**
రాష్ట్రస్థాయి పారిశ్రామికోత్పత్తి సూచీ (××ూ) ప్రాతిపదిక సంవత్సర సవరణపై మూడు రోజుల వర్క్‌షాప్ కేరళలోని తిరువనంతపురంలో అక్టోబర్ 28 నుంచి 30 వరకు జరగనుంది. కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ (వీశ్రూ×), కేరళ ఆర్థిక, గణాంకాల శాఖ (ణజూ) సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.
పారిశ్రామిక రంగ పనితీరులో మార్పులను అంచనా వేసే కీలక సూచీ ××ూ. పారిశ్రామిక కార్యకలాపాల ధోరణులను తెలుసుకోవడానికి, విధాన నిర్ణయాలకు, ఆర్థిక వృద్ధి అంచనాలకు విధానకర్తలు, ఆర్థికవేత్తలు, వ్యాపార సంస్థలు, పెట్టుబడిదారులు ఈ సూచీని వినియోగిస్తారు.
అఖిల భారత ××ూ ప్రాతిపదిక సంవత్సరాన్ని 2011--12 నుంచి 2022--23కు వీశ్రూ× ఇప్పటికే మార్చింది. ఉత్పత్తిలో వచ్చే మార్పులను పోల్చేందుకు ప్రాతిపదిక సంవత్సరం ఆధారంగా ఉంటుంది. ప్రస్తుత పారిశ్రామిక ఉత్పత్తి స్వరూపాన్ని సూచీలో మరింత సముచితంగా ప్రతిబింబించేందుకు తాజా ప్రాతిపదిక సంవత్సరం ఉపయోగపడుతుంది.
సవరించిన సూచీలో వస్తువుల బాస్కెట్, వాటాల పునఃపరిశీలన, కర్మాగారాల జాబితా నవీకరణ, గ్యాస్ సరఫరా, నీటి సరఫరా, మురుగునీటి పారుదల, వ్యర్థాల నిర్వహణ కార్యకలాపాలను చేర్చడం, కర్మాగారాల స్థానంలో ప్రత్యామ్నాయాలను తీసుకునే విధానం వంటి మార్పులు ఉన్నాయి.
రాష్ట్రాల స్థాయి ××ూని రూపొందించి, ప్రచురించే బాధ్యత ఆయా రాష్ట్రాల ఆర్థిక, గణాంకాల శాఖలది. జాతీయ స్థాయిలో నోడల్ మంత్రిత్వ శాఖగా వీశ్రూ×, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సాంకేతిక మార్గదర్శకత్వం అందిస్తూ, పారిశ్రామిక గణాంకాల్లో ఏకరీతి, నాణ్యత, పోలికలను పెంపొందిస్తోంది.
వర్క్‌షాప్‌లో సవరించిన ××ూ నిర్మాణం, పద్ధతులపై రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల అధికారులకు అవగాహన కల్పించనున్నారు. సూచీలో ట్రాక్ చేయాల్సిన వస్తువులు, సమాచారం అందించే కర్మాగారాల జాబితాను ఖరారు చేసేందుకు చర్చలు జరగనున్నాయి. జాతీయ పారిశ్రామిక వర్గీకరణ--2025, జాతీయ ఉత్పత్తి వర్గీకరణలో ప్రతిపాదించిన మార్పులపై అభిప్రాయాలు పంచుకునేందుకు కూడా ఈ సమావేశం వేదిక కానుంది. వీశ్రూ×, వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల గణాంక శాఖలకు చెందిన సుమారు 60 మంది అధికారులు వర్క్‌షాప్‌లో పాల్గొననున్నారు. దేశవ్యాప్తంగా పారిశ్రామిక గణాంకాల నాణ్యత, స్థిరత్వం, పోలికలను బలోపేతం చేయడం ఈ కార్యక్రమం లక్ష్యమని మంత్రిత్వ శాఖ తెలిపింది.

## కండక్టర్ ప్రవళికకు ప్రభుత్వం అండగా ఉంటుంది: మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్, త్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:**
ఖమ్మం రీజియన్‌లోని మణుగూరు ఆర్టీసీ డిపోకు చెందిన కండక్టర్ ప్రవళికను మంత్రి పొన్నం ప్రభాకర్ పరామర్శించారు. ఇటీవల ఓ ప్రయాణికుడు తోసివేయడంతో గాయపడిన ప్రవళిక ప్రస్తుతం దిల్‌సుఖ్‌నగర్‌లోని సాయి సంజీవని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రికి వెళ్లిన మంత్రి ఆమె ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రవళిక త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన ఆయన, ఆమెకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. కండక్టర్ ప్రవళిక ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని తెలిపారు. ఆమెకు అందుతున్న వైద్య చికిత్సపై వైద్యులతో మాట్లాడినట్లు పేర్కొన్నారు. ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బంది ఎదురైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ఆర్టీసీ సిబ్బందికి అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

**ఆర్టీసీ సిబ్బంది భద్రతకు ప్రాధాన్యం**

ప్రజలను వారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చడంలో ఆర్టీసీ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి పేద ప్రజలను గమ్యస్థానాలకు చేరవేస్తున్న ఆర్టీసీ కార్మికుల పట్ల ప్రయాణికులు గౌరవంగా, స్నేహపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. ఆర్టీసీ సిబ్బంది సాధారణంగా సౌమ్యంగా, నిజాయితీగా విధులు నిర్వహిస్తారని తెలిపారు.
సిబ్బంది ప్రవర్తనపై ప్రయాణికులకు ఏవైనా ఫిర్యాదులు ఉంటే ఆర్టీసీ యాజమాన్యానికి లేదా సంబంధిత అధికారులకు తెలియజేయవచ్చని మంత్రి సూచించారు. అయితే, ఉద్యోగుల ప్రాణాలకు ముప్పు కలిగించేలా వ్యవహరించడం ఏమాత్రం సమర్థనీయం కాదని స్పష్టం చేశారు. ఇలాంటి చర్యలకు పాల్పడేవారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

**ఖమ్మం ఘటనపై ప్రభుత్వం సీరియస్**

ఖమ్మం ఘటనను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్టీసీ కార్మికుల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలకు సేవ చేయడం ఆర్టీసీ ఉద్యోగుల బాధ్యత అయినప్పటికీ, వారి ప్రాణాలకు రక్షణ కల్పించడం, విధి నిర్వహణలో భద్రతను నిర్ధారించడం కూడా అంతే ముఖ్యమని మంత్రి పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమం, ప్రయాణికుల సౌకర్యం, సంస్థ పరిరక్షణ లక్ష్యంగా పనిచేస్తున్న ఆర్టీసీకి ప్రజల మద్దతు ఎంతో అవసరమని అన్నారు.
ప్రజా రవాణా వ్యవస్థ సజావుగా కొనసాగాలంటే ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది పరస్పర గౌరవంతో వ్యవహరించాలని మంత్రి సూచించారు. ఇటువంటి దురదృష్టకర ఘటనలు మళ్లీ జరగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

## హెబ్రోన్ చర్చి వివాదంలో పోలీసుల తీరుపై ఖండించిన

**-క్రైస్తవ ధర్మ ప్రచార పరిరక్షణ సమితి అధ్యక్షుడు జెరూషలేం మత్తయ్య**

**హైదరాబాద్, త్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27;**
హెబ్రోన్ చర్చి అంతర్గత వివాదంలో పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ అమాయకులపై తప్పుడు కేసులు నమోదు చేసి అరెస్టులు చేస్తున్నారని క్రైస్తవ ధర్మ ప్రచార పరిరక్షణ సమితి అధ్యక్షుడు జెరూషలేం
మత్తయ్య ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగి కె. వెంకటేశ్వర్లు, పాస్టర్ బానోతు భీమా అలియాస్ బర్నబాస్‌ల అరెస్టుల తీరును ఆయన
ఒక ప్రకటనలో
తీవ్రంగా ఖండించారు.
చర్చి ఆస్తులు, కానుకల నిధుల వినియోగంపై వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో, రాగి వీరాచారి ఇచ్చిన ఫిర్యాదుపై సరైన విచారణ లేకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారని మత్తయ్య ఆరోపించారు. సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న ఆడియోలపై ఫోరెన్సిక్ విచారణ జరిపించాలని, హెబ్రోన్ చర్చి ఆస్తులు, నిధుల నిర్వహణకు ప్రభుత్వ పర్యవేక్షణలో కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించి, అక్రమ అరెస్టులకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. హెబ్రోన్ చర్చి విశ్వాసులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా అంతర్జాతీయ ఎల్డర్స్ డే వేడుకలు

**- ఆకట్టుకున్న... హాస్యవదాన కార్యక్రమం**

**త్రైనెట్ న్యూస్, హైదరాబాద్ అక్టోబర్ 27 :**
మహీంద్రా అశ్వితలైఫ్ స్పేస్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఎల్డర్స్ డే వేడుకలు ఘనంగా ని ర్వహించారు. ముందుగా ఇష్మా న్ భటేష్ శ్రీరామ భజ జయతి జయగానం చేశారు. కేరళంపై కుంజాన్ పిల్లాయ్, ఇండోర్ సాం ప్రదాయ వంటల రాజధాని అని అజయ్ మొగీ అసోసియేషన్ ప్రె సిడెంట్



అంతర్జాతీయ వృద్దులు దినోత్సవ చరిత్ర అంశాలపై ప్రసం గం జరిగింది. ఈ కార్యక్రమానికి గౌరవ అధితిగా డా.రాజేంద్ర గొట్టి పాటి ప్రెసి డెంట్ భారత్ వికాస్ పరిషత్ (జనరక్ మెడిసిన్స్) అశ్విని సుబ్బారావు మహీంద్రా అశ్విత హాజరై మాట్లాడారు. వయోవృద్ధులు అందరికీ మార్గ దర్శకులు అని, వారి అనుభవం, జ్ఞానం యువత కు స్ఫూర్తిదాయ కం అని అన్నారు. ఈ సందర్భం గా అసోసియేషన్ ఆగస్ట్ 15 స్వతం త్ర దినోత్సవం సందర్భం గా నిర్వహించిన స్పోర్ట్స్ లో పోటీలో గెలిచిన విన్నర్స్ వాకింగ్ లో వై.రామారావు, ఎంఎన్ మూ ర్తి, అను రాధ, జి.వి.లక్ష్మి, సూప ర్ సీనియర్ లను సన్మానించారు. అనంత రం ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ హైదరా బాద్ వారిచే నవ్వుకుం దాం రండి (అవధాన రూపకం) పేరడీ అవ ధానం శ్రీజయంతి నరసింహం (అవధాని) బృందం అప్రస్తుతం కె ఎల్ కామేశ్వరరా వు, సమన్వయ కర్త ఎంవి సుబ్ర హ్మణ్యం, పృచ్ఛ కులు ఆర్ వి రమణ, జివిలక్ష్మి, బాలసరస్వ తి, రాజేశ్వరి అను రాధ పాల్గొని ప్రేక్షకులను నవ్వు లతో ముంచా రు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఎన్ పాపారావు, సెక్రటరి పి శ్రీకృ ష్ణ తదితరులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్తంగా 1,265 స్టేషన్ మాస్టర్ పోస్టుల భర్తీకి రైల్వే నోటిఫికేషన్

**ఏదైనా డిగ్రీ పూర్తి చేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు**
**ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ నవంబర్ 25**

**న్యూఢిల్లీ, త్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:**
స్టేషన్ మాస్టర్ పోస్టుల భర్తీకి భారతీయ రైల్వే ఆన్‌లైన్ దరఖాస్తులను ప్రారంభించింది. సెంట్రలైజ్డ్ ఎంప్లాయ్‌మెంట్ నోటీసు (జజుచీ) నం. 08/2026 కింద దేశవ్యాప్తంగా 1,265 ఖాళీలను భర్తీ చేయనున్నారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
రైల్వే బోర్డు నిర్ణయం ప్రకారం, 2026 నుంచి స్టేషన్ మాస్టర్ పోస్టుల భర్తీకి ప్రత్యేకంగా నోటిఫికేషన్ జారీ చేస్తున్నారు. అర్హతలు, పరీక్షా విధానం, పోస్టుల పంపిణీ వివరాలను ఈ నోటిఫికేషన్‌లో పొందుపరిచారు.
రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డుల వారీగా అత్యధికంగా ముంబై బోర్డులో 177 పోస్టులు ఉన్నాయి. జమ్మూ--శ్రీనగర్‌లో 122, చెన్నైలో 119 ఖాళీలను ప్రకటించారు. దేశంలోని వివిధ రైల్వే జోన్లలో ఈ ఉద్యోగావకాశాలు అందుబాటులో ఉన్నాయి.
ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ అక్టోబర్ 27న ప్రారంభమైంది. నవంబర్ 25, 2026 దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ. అభ్యర్థులు దరఖాస్తు సమర్పించే ముందు అర్హతలు, పోస్టుల వివరాలు, దరఖాస్తు సూచనలను నోటిఫికేషన్‌లో పరిశీలించాలని రైల్వే సూచించింది.

## సుప్రీం కోర్ట్ లో వైసీపీకి ఎదురుదెబ్బ



**అమరావతి, త్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:**
సుప్రీంకోర్టులో వైసీపీకి ఎదురుదెబ్బ తగిలింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్ గడువును పెంచాలన్న వైసీపీ అభ్యర్థనను న్యాయస్థానం తోసిపుచ్చింది. ఈ ఎన్నికలపై వైసీపీ పిటిషన్‌పై విచారణను ముగించింది. గత విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను తాము పాటించామని ఏపీ ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. నామినేషన్ల సమయం ముగిసినందున 'ఇక ఎన్నికల్లో పోటీచేయాలి.. ఆల్ ది బెస్ట్' అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించా రు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, ఆ ఫుటేజ్‌ను కూడా భద్రపరచాలని ఎన్నికల కమిషన్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. నామినేషన్లు వేయడానికి ప్రతిపక్ష పార్టీలకు అవకాశం ఇవ్వట్లేదని వైసీపీ తరపు న్యాయవాది మణిందర్ సింగ్ న్యాయస్థానానికి తెలిపారు. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలపై తీసుకున్న చర్యలను సుప్రీంకోర్టుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ నివేదించింది. ఎన్నికల కమిషన్ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. ఏపీ ప్రభుత్వం తరపున సీనియర్ కౌన్సిల్ సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు.

## వార్తకు వన్నె తెచ్చేది గళ మాధుర్యమే

**న్యూస్ ప్రెజెంటర్లు గళ కళాకారులు.. కోలేటి దామోదర్ గుప్తా**
**రవీంద్ర భారతిలో మీడియా ప్రముఖులకు జీవన సాఫల్య, ప్రతిభా పురస్కారాలు**



**రవీంద్ర భారతి, త్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:**
వార్తలోని భావాన్ని ప్రేక్షకుల హృదయాలకు చేరవేయాలంటే కేవలం పదాలు చదివితే సరిపోదు.. గళంలో మాధుర్యం, మాటల్లో స్పష్టత, సందర్భానికి తగిన హెచ్చు తగ్గులు ఉండాలని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా అన్నారు. వార్తా కథనానికి స్వరమే ప్రత్యేక ఆకర్షణను తీసుకొస్తుందని, న్యూస్ ప్రెజెంటర్లు ఈ అంశంపై దృష్టి సారించాలని సూచించారు.
ప్రముఖ నటుడు అక్కినేని నాగేశ్వరరావు పేరిట మీడియా రంగ ప్రముఖులకు జీవన సాఫల్య, ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం
మంగళవారం రాత్రి రవీంద్ర భారతిలోని ప్రధాన వేదికపై వైభవంగా జరిగింది. భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శృతిలయ ఫౌండేషన్, సీల్ వెల్ కార్పొరేషన్ సంయుక్త నిర్వహణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కోలేటి దామోదర్ గుప్తా మాట్లాడుతూ, ప్రజలకు సమాచారాన్ని అందించడంలో మీడియా పాత్ర కీలకమని పేర్కొన్నారు. అయితే రాజకీయ పార్టీల ప్రభావంతో నడిచే పత్రికల్లో ఒకే అంశానికి సంబంధించిన వార్తలు భిన్నంగా ప్రచురితమవుతున్నాయని అభిప్రాయపడ్డారు. వార్తను అందించే విధానంలో బాధ్యత, స్పష్టత, నిబద్ధత అవసరమని పరోక్షంగా సూచించారు.

**తెరపై కనిపించేది వార్త.. వినిపించేది గళ కళ!**

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సమాచార హక్కు చట్టం మాజీ ముఖ్య కమిషనర్ పి. విజయబాబు మాట్లాడుతూ, న్యూస్ ప్రెజెంటర్లు కేవలం వార్తలు చదివే వారు మాత్రమే కాదని, తమ గళంతో ప్రేక్షకులను ఆకట్టుకునే కళాకారులని అభివర్ణించారు. అందుకే వారిని 'గళ కళాకారులు'గా గుర్తించాలని పేర్కొన్నారు. సినిమా, రంగస్థల కళాకారులకు లభిస్తున్నట్లుగానే టెలివిజన్ న్యూస్ ప్రెజెంటర్లకూ ప్రభుత్వాలు అవార్డులు అందించి ప్రోత్సహించాలని కోరారు. టీజీవో నాయకుడు ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ, శృతిలయ ఫౌండేషన్‌కు చెందిన ఆమని గాయనిగా ప్రతిభ చాటడంతో పాటు, ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్నారని గుర్తుచేశారు.

**మీడియా సేవలకు పురస్కారాల గుర్తింపు**

మీడియా రంగంలో విశేష సేవలందించిన ప్రముఖులను ఈ సందర్భంగా పురస్కారాలతో సత్కరించారు. నమస్తే తెలంగాణకు చెందిన రఘు రాములు, మహా న్యూస్‌కు చెందిన కృష్ణమూర్తి, ఆంధ్రప్రభకు చెందిన డాక్టర్ మారం శ్రీనివాస్‌లకు జీవన సాఫల్య పురస్కారాలను ప్రదానం చేశారు. వివిధ టీవీ చానెళ్లు, పత్రికలకు చెందిన విజయ చంద్రిక, ప్రభాకర్, అరుణ్ కుమార్, జితేందర్, మంజుల, అక్షయ, సంధ్య, ప్రియాంక, ధనలక్ష్మి, బ్రాహ్మణిలకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. మైనార్టీ మోర్చా నాయకుడు షేక్ షాజహాన్‌ను అక్కినేని స్ఫూర్తి పురస్కారంతో సత్కరించారు.

**పాటలతో ఆరంభం.. ప్రశంసలతో ముగింపు**

కార్యక్రమ ప్రారంభంలో ఆమని, సుభాష్, కృష్ణ తదితరులు ఆలపించిన పాటలు సభికులను అలరించాయి. అనంతరం పురస్కార ప్రదానం, ప్రముఖుల ప్రసంగాలతో కార్యక్రమం సందడిగా సాగింది. ఈ కార్యక్రమంలో కుసుమ, భోగరాజు, నరహరి తదితరులు పాల్గొన్నారు.

## తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : తహసీల్దార్ రమేష్.



బంగాళాఖాతంలో ఏర్పడిన 'అర్నబ్' తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో పినపాక మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రమేష్ సూచించారు. మంగళవారం పినపాక తహసీల్దార్ కార్యాలయంలో అత్యవసర సమావేశం నిర్వహించి, తుఫాన్ ప్రభావం, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై అధికారులకు పలు సూచనలు చేశారు. భారత వాతావరణ శాఖ సమాచారం ప్రకారం అక్టోబర్ 28న బాపట్ల--విశాఖపట్నం మధ్య తుఫాన్ తీరం దాటే అవకాశం ఉందని, దీని ప్రభావంతో తెలంగాణలోనూ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని హెచ్చరించారు. విద్యుత్ స్తంభాలు, తెగిపడిన విద్యుత్ తీగలు, నేలకొరిగే ప్రమాదం ఉన్న చెట్లకు దూరంగా ఉండాలని సూచించారు.
తుఫాన్ ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు తమ పంటల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వాతావరణ పరిస్థితులను గమనిస్తూ అధికారులు జారీ చేసే సూచనలను పాటించాలని కోరారు. అత్యవసర పరిస్థితులు ఎదురైనా వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. తుఫాన్ నేపథ్యంలో అధికారులకు ఇప్పటివరకు మంజూరైన సెలవులను పూర్తిస్థాయిలో రద్దు చేస్తున్నట్లు తహసీల్దార్ ప్రకటించారు. అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. తుఫాన్ ప్రభావం తగ్గే వరకు విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా ప్రజలకు అవసరమైన సేవలు అందించాలని స్పష్టం చేశారు.
ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో తహసీల్దార్ కార్యాలయాన్ని 93929 19735 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. తుఫాన్ ప్రభావం పూర్తిగా తగ్గే వరకు ప్రజలు, అధికారులు సమన్వయంతో వ్యవహరించి అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

edited, Printed, Published and Owned by:Venkateshwarlu Rapolu # Flat No. 202, Nomula Chambers, E-Seva Road, TRT Seetaphalmandi, Sec'bad-61.Telangana. INDIA. www.trinetnews.com, Email: trinetnews2026@gmail.com (Telangana) Editor: Venkateshwarlu Rapolu, +91 98497 67747,9494184136